epaper.vaartha.com
WWW.VAARTHA.COM
తాడేపల్లిగూడెం
: fb.com/vaartha Digital

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

9-3-2026 సోమవారం సంపుటి: 32
సంచిక: 37 పేజీలు: 8+4 వెల: 6.50

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam



2026
2024
2007
మూడు సార్లు ప్రపంచ కప్ విజయం

ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ సంజూ
5 మ్యాచ్‌ల్లో 321 రన్స్
ఫైనల్లో న్యూజిలాండ్‌పై 89 రన్స్
సెమీస్‌లో ఇంగ్లాండ్‌పై 89 రన్స్
వెస్టిండీస్‌పై అజేయంగా 97 రన్స్

## టి-20 ప్రపంచ కప్
# విజేత భారత్



సంజూ 89

అహ్మదాబాద్‌లో బ్లూ సునామీ ఆవిష్కృతమైంది. బ్లూ బ్రిగేడ్ మొదట బ్యాటింగ్‌లో ధనాధన్ లాడిస్తే.. తర్వాత బౌలింగ్‌లో ప్రత్యర్థిని పేకమేడలా కూల్చారు. టి20 ప్రపంచకప్‌లో చరిత్ర సృష్టించారు. ఫైనల్‌కు ముందు ఉన్న డౌట్స్ అన్నీ పటాపంచలు చేశారు. సౌతాఫ్రికాపై చెలరేగిన కివీస్‌ల ఆటలు బ్లూ బ్రిగేడ్ ముందు సాగలేదు. సూర్యసేన సూపర్ షోతో ముచ్చటగా మూడోసారి టి20 ప్రపంచకప్ అందుకుంది. వరుసగా రెండోసారి కప్ సాధించింది. ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ తర్వాత భారత్‌కు కప్ అందించిన సారథిగా సూర్యకుమార్ యాదవ్ నిలిచాడు. ఆతిథ్య జట్టు స్వదేశంలో ట్రోఫీ గెలవడం ఇదే మొదటిసారి. బ్లూ బ్రిగేడ్ కప్ సాధించడంతో దేశవ్యాప్తంగా సంబరాలు అంబరాన్ని అంటాయి.

అహ్మదాబాద్‌లో బ్లూ సునామీ
చెలరేగిన సంజూ, అభిషేక్, ఇషాన్
ఫైనల్లో టీమిండియా రికార్డు స్కోర్
పేకమేడలా కూలిన న్యూజిలాండ్
తిప్పేసిన అక్షర్, కూల్చిన బుమ్రా
సొంతగడ్డపై తొలి సారి కప్ సొంతం





# భీకర దాడులు

### కువైట్ భద్రతా మండలి కార్యాలయంపై ఇరాన్ బాంబుల వర్షం
### న్యూయార్క్ మేయర్ ఇంటివద్ద దాడి
### నార్వేలోని అమెరికా దౌత్యకార్యాలయం వద్ద పేలుడు

**టెహ్రాన్, జెరూసలెం, మార్చి 8:** మధ్యప్రాచ్యదేశాల్లో ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం రోజురోజుకూ మరింత ఉధృతం అవుతోంది. ఇరాన్‌ను సమూలంగా మట్టుపెట్టేస్తామని అటు ఇజ్రాయెల్ ఇటు అమెరికాలుప్రకటిస్తుంటే ఇరాన్ మాత్రం అమెరికా మిత్రదేశాల్లోని స్థావరాలనే లక్ష్యంగా దాడులు ముమ్మరంచేసింది. తాజాగా ఆదివారం కూడా మరిన్న దాడులుజరిగాయి. గల్ఫ్‌దేశాలపై ఇరాన్ తన దాడులతో విరుచుకుపడుతోంది. కువైట్ పరిధిలో అత్యున్నతస్థాయి భవనం అంటే సామాజిక భద్రత టవర్‌పై దాడులుచేయడంతో మంటల్లో చిక్కుకుంది. డ్రోన్ల శకలాలు పడి టవర్ దగ్ధం అయింది. ఇదిలా ఉంటే ఇరాన్‌కు మరింతగా షాకులు ఇస్తామని, ఆకస్మిక >>2

# రాష్ట్రమంతా రెస్టారెంట్లపై ఐటి దాడులు

### పలు హోటళ్లపై బిల్లుల ఎగవేత ఆరోపణలు
### పలువురిపై కేసులు నమోదు

**విజయవాడ,మార్చి 8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రెస్టారెంట్లపై ఐటీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. రాజమండ్రి, నెల్లూరు, విశాఖపట్నం . విజయవాడ. గుంటూరు, శ్రీకాకుళంప్రాంతాల్లోని పలు రెస్టారెంట్లలో ఐటీ సోదాలు చేపట్టారు. ట్యాక్స్ కట్టకుండా బిల్లులు ఎగ్గొడుతున్నారని ఈ రెస్టారెంట్ల, హోటళ్ల యాజమాన్యాలపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఆకస్మిక ఐటీ దాడులు జరిగాయి. ఈ క్రమంలో కంప్యూటర్ డేటాను ఐటీ అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రధానంగా ఆన్‌లైన్ పేమెంట్స్, డిజిటల్ డేటాను పరిశీలిస్తున్నారు. ఇటీవల రూ.70వేల కోట్ల అమ్మకాల డిజిటల్ రికార్డులను పలు హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు తొలగించారని సమాచారం. ఈ క్రమంలో కీలక ఆధారాలని ఆదాయపన్నుశాఖ అధికారులు >>2



ఆదివారం మహిళా దినోత్సవం సందర్భంగా ఐదుగురు మహిళా పారిశ్రామిక వేత్తలను సత్కరించిన సిఎం చంద్రబాబు

వచ్చే యేడాదికి 6 లక్షల మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేస్తాం. ప్రతి ఇంటి నుంచి ఎంఎస్ఎంఇలు ఆవిష్కృతం కావాలి. అందులో 50 శాతం మంది మహిళలే ఉండాలన్నది నా ఆకాంక్ష. మహిళా సంఘాలు, ఎంఎస్ఎంఇలు తయారు చేసిన ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు వెళ్లాలి. ఎక్కడో జరుగుతున్న యుద్ధం మన మార్కెట్లను ప్రభావితం చేస్తోంది. పెట్రోల్, గ్యాస్ ధరలు పెరుగుతున్నాయి. ఈ సమస్యలు వచ్చినా దీనిని సమర్థంగా ఎదుర్కొంటాం.
- ముఖ్యమంత్రి చంద్రబాబు

# ముమ్మందుకు మహిళలు

### వారి సమగ్ర అభివృద్ధి కోసం ఓ బ్లూ ప్రింట్
### వచ్చేయేడాదికి 6లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలు
### 'స్వయం ఎపి' బ్రాండ్‌పేరు, లోగోను ఆవిష్కరించిన సిఎం
### అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో సిఎం చంద్రబాబు కీలక ప్రకటన

**విజయవాడ,మార్చి8,ప్రభాతవార్తప్రతినిధి:** సుపరిపాలనతోనే మెరుగైన ఆదాయం వస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. తద్వారా సంక్షేమం అందించే అవకాశం ఉంటుంది. మహిళా అభివృద్ధి కోసం ఓ బ్లూప్రింట్ కు రూపకల్పన చేశాం. వచ్చే ఏడాదికి 6 లక్షల మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేస్తామన్నారు. ప్రతీ ఇంటి నుంచి ఎంఎస్ఎంఈలు ఆవిష్కృతం కావాలి. అందులో 50 శాతం మంది మహిళలే ఉండాలన్నది నా ఆకాంక్ష అన్నారు. మహిళ సంఘాలు, ఎంఎస్ఎంఈలు తయారు చేసిన ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు వెళ్లాలన్నారు. ఎక్కడో జరుగుతున్న యుద్ధం మన మార్కెట్లను ప్రభావితం చేస్తోందన్నారు. పెట్రోల్, గ్యాస్ ధరలు పెరుగుతున్నాయి. ఈ సమస్యలు వచ్చినా దీనిని సమర్థంగా ఎదుర్కొంటాం అన్నారు. హనుమంతుని శక్తిలా ఆడబిడ్డల శక్తి వారికి తెలీదు అన్నారు. మహిళల్ని శక్తివంతంగా తీర్చిదిద్దుతాం అన్నారు. ఎస్ఎహెజీలు తయారు చేసిన స్వయం బ్రాండ్‌ను ప్రతిష్టాత్మక బ్రాండ్ గా తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపడతామన్నారు. మహిళలకు శక్తి సామర్థ్యాలను ఇచ్చిన పార్టీ టీడీపీనే. ఇంటి స్థలాలు, రుణాలను, సంక్షేమ పథకాలను కూడా వారి పేరిటే >>2

# ఆకస్మిక వర్ష సూచన

### బంగాళాఖాతం ఉపరితల ఆవర్తనం ప్రభావం

**విజయవాడ,మార్చి8,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా ఉత్తరాంధ్ర తీరానికి ఆనుకొని ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది చురుకుగా కదులుతోంది. ఈ ఉపరితల ఆవర్తనం మరింత విస్తరించడానికి అనుకూల వాతావరణం నెలకొంది. ఉత్తరాంధ్రతో పాటు ఛత్తీస్ గఢ్, తెలంగాణ ఉత్తర ప్రాంతం మీదుగా ఇది విస్తరిస్తోంది. దీని ప్రభావంతో నేడు ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రత్యేకించి శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం జిల్లాల్లో చెదురు మదురుగా వర్షాలు కురుస్తాయని >>2



# ప్రభుత్వాసుపత్రుల్లో ఇక 'ఎఐ'

### దాదాపు 40 పరికరాలతో 15 వ్యాధి నిర్ధారణ పరీక్షలు
### వైద్యసేవలు మరింత మెరుగు: మంత్రి సత్యకుమార్

**విజయవాడ, మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి:** కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంతో వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 18 మంది ఇన్నోవేటర్లు ఏకకాలంలో రాష్ట్రంలో ఎంపికచేసిన 18 ప్రభుత్వాసుపత్రుల్లో సుమారు 40 పరికరాల ద్వారా పైలటు ప్రాజెక్టు కింద సరికొత్త ఆవిష్కరణల ద్వారా వైద్య సేవల్లో కీలకమైన స్క్రీనింగ్, కన్ఫర్మేషన్ పరీక్షలు చేస్తున్నారు. దీనివల్ల వైద్యులకు తక్కువ సమయంలో వ్యాధులు ఖరారుపై అవగాహనతో రోగులకు ఉన్నత చికిత్స అందించేందుకు సమయం ఆదా అవుతుంది. అలాగే రోగులకు ఊరట లభిస్తుంది. విశాఖ, అనం తపురం, గుంటూరు, కాకినాడ జీజీహెచ్, విజయవాడ ప్రభుత్వ వైద్య కళాశాల, పార్వతీపురం, తెనాలి జిల్లా ఆసుపత్రి, ఇతరచోట్ల పైలట్ ప్రాజెక్ట్ విధానంలో రకరకాల పరీక్షలు చేస్తున్నాయి.

**ఆసుపత్రుల్లో 'ఏఐ' సేవలు:** రోగులు, వైద్యుల మధ్య జరిగే సంభాషణను రికార్డింగ్ చేయడం, దగ్గు ద్వారా టీబీని గుర్తించడం, గుండె జబ్బులు, రక్తహీనతను గుర్తించడం, సర్వైకల్ క్యాన్సర్ చికిత్సలో ఏఐ కెమెరా వినియోగం, చిన్నపిల్లల్లో న్యూరాలజికల్ డిజార్డర్స్, క్యాటరాక్ట్, గ్లూకోమా, సికిల్ సెల్ అనీమియా, రక్తహీనత, ఇతర పరీక్షలకు ఆధునిక సాంకేతిక పరికరాలను వినియోగిస్తున్నారు. అలాగే అవసరమైనచోట్ల అత్యాధునిక సాఫ్ట్వేర్ ను కూడా ఉపయోగిస్తున్నారు.

**త్వరలో సీఎంకు నివేదిక:** ఇటీవల ఆసుపత్రుల్లో పైలట్ విధానంలో ప్రారంభమైన ఈ పరీక్షలు >>2



# నితీష్ తనయుడు రాజకీయాల్లోకి

### జెడియులో చేరిన నిశాంత్

**పాట్నా, మార్చి 8:** బీహార్ రాజకీయాల్లో ఆదివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తనయుడు నిశాంత్‌కుమార్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆదివారం మధ్యాహ్నం పట్నాలోని జేడీయూ కేంద్ర కార్యాలయంలో ఆయన అధికారికంగా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి జేడీయూ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, కేంద్ర మంత్రి లలన్ సింగ్, మంత్రులు విజయ్ కుమార్ చౌదరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుష్వాహ తదితర సీనియర్ నేతలు హాజరయ్యారు. పార్టీలో చేరిన సందర్భంగా సంజయ్ కుమార్ ఝా నిశాంత్‌కు పార్టీ టోపీ, జ్ఞాపికను అందించగా, కేంద్ర మంత్రి లలన్ సింగ్ సంప్రదాయ తలపాగా చుట్టి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం సీనియర్ నేతల కాళ్లకు నమస్కరించి నిశాంత్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ మాట్లాడుతూ తన తండ్రి మార్గదర్శకత్వంలోనే పనిచేస్తానని స్పష్టం చేశారు.

ఈరోజు నేను పార్టీలో చేరడానికి వచ్చాను. మా నాన్న రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అది ఆయన నిర్ణయం. ఆయన సూచనల మేరకు బీహార్ కోసం మేం పనిచేస్తామని పేర్కొన్నారు. నితీశ్ కుమార్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళతానని చెప్పారు. కార్యకర్తలు పార్టీపై ఇదే ఉత్సాహం, నమ్మకం కొనసాగించాలని కోరారు.


ఆదివారం కేరళలో విద్యార్థినిలతో కలిసి భోజనం చేస్తున్న రాహుల్ గాంధీ

# మహిళలకు తెలివి ఎక్కువ

### దీర్ఘకాలిక ఆలోచనలు చేస్తారు..
### మహిళలు బాస్‌లుగా ఉన్న కుటుంబంలో పెరిగా: రాహుల్

2లో



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం న్యూఢిల్లీలో పారిశుధ్య సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొంటున్న ప్రధాని మోడీ

# మమత తీరును ప్రజలు క్షమించరు

### సంతాల్ ఘటన రాజ్యాంగాన్ని అగౌరవ పరచడమే
### దేశంలోనే తొలి 'రింగ్‌మెట్రో'ను ప్రారంభించిన ప్రధాని మోడీ

5లో

# ముమ్మందుకు మహిళలు



ఆదివారం రాయపూడి సభలో సిఎం చంద్రబాబుతో సెల్ఫీ దిగుతున్న మహిళా మంత్రులు

>> ఇస్తున్నామన్నారు. తాము ఆరోగ్యంగా ఉండటంతో పాటు కుటుంబాన్ని, సమాజాన్ని కూడా ఆరోగ్యంగా ఉంచే బాధ్యత మహిళలదే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతి రాజధాని ప్రాంతంలోని రాయపూడిలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారులు షర్మిల, మహిమ, మంత్రులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన ఐదుగురు మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లను ముఖ్యమంత్రి సత్కరించారు. అలాగే డ్వాక్రా గ్రూపుల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ కల్పించే ఉద్దేశంతో రూపొందించిన "స్వయం ఏపీ".. బ్రాండ్ పేరు, లోగోను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.డ్వాక్రా సంఘాల ఆర్థికాభివృద్ధికి మద్దతుగా రూ.10,102 కోట్ల రుణాలకు సంబంధించిన మెగా చెక్కును మహిళలకు ముఖ్యమంత్రి అందజేశారు. అదేవిధంగా సెర్ప్ ఆధ్వర్యంలో 26 ఎంవోయూలు, ఇతర విభాగాల నుంచి 15 ఎంవోయూలను వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం మహిళలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు తెలుగింటి ఆడబిడ్డలకు, దేశ మహిళలకు శుభాకాంక్షలు. సృష్టికి మూలం మహిళలే. కష్టానికి, ప్రేమకు, త్యాగానికి ప్రతిరూపం మహిళలు. స్త్రీలను ప్రేమించి, పూజించిన చోట సంపదకు లోటు ఉండదు. 1911లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రారంభమై... మార్చి 8న యేటా జరుపుకుంటున్నాం. ఈసారి కొత్త థీమ్ తీసుకొచ్చారు. రైట్స్, జస్టిస్, యాక్షన్... మహిళా హక్కులన్నీ కాపాడటం, న్యాయం చేయడం, ఉన్నత స్థానాలకు తీసుకెళ్లడానికి ఈ మార్గాలు అవలంభించాలి. ముగ్గురు మహిళలు మంత్రులుగా ఉండి...సమర్థవంతంగా పని చేస్తున్నారు. దేశ అధ్యక్షురాలిగా గిరిజన మహిళ ఉన్నారు. బెస్ట్ ఫైనాన్స్ మినిస్టర్ కూడా మన ఆడబిడ్డే. వచ్చిన ఆదాయాన్ని సమర్థవంతగా వినియోగించి నిజమైన ఫైనాన్స్ మినిస్టర్లు ఆడబిడ్డలే. బడ్జెట్ రూపకల్పనకు మహిళలు మారుపేరు. నిర్మలా సీతారామన్ దేశానికి ఆర్థిక మంత్రిగా నిర్మల అద్భుతుంగా పని చేస్తున్నారు... సమర్థవంతంగా బడ్జెట్ ప్రవేశపెట్టి ముందుకు తీసుకెళ్తున్నారు. ఏపీ హైకోర్టుకు కూడా సీజేగా మహిళ వస్తున్నారు. న్యాయం అందించడానికి హైకోర్టు సీజే కూడా మహిళే వస్తున్నారు. నేనెప్పుడూ మహిళా పక్షమే. నా మిత్రుడు పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ. ముగ్గురం మహిళల అభ్యున్నతికి పని చేస్తున్నాం.

201924 మధ్య రాష్ట్రంలో విధ్వంసం జరిగి నష్టపోయాం. నేను, మోదీ, పవన్ కలిసి పేదలకు న్యాయం చేయాలని, డ్వాక్రా, మెప్మా సంఘాలకు పూర్వ వైభవం తేవాలని కలిశాం. మహిళలకు న్యాయం చేయడమే మా ఆలోచన. ఆడబిడ్డలకు న్యాయం చేసిన నాయకుడు ఎన్టీఆర్ అనే విషయం గుర్తుంచుకోవాలి. ఆస్తిలో సమాన హక్కు తీసుకొచ్చారు. చట్టం చేశారు. ఆడబిడ్డలను చదివించాలంటే తల్లిదండ్రులు ఆలోచించే రోజుల్లోనే మహిళల కోసం యూనివర్సిటీని ప్రత్యేకంగా తీసుకొచ్చారు. స్థానిక సంస్థల్లో మహిళలు ఉండేవారు కాదు. కానీ ఎన్టీఆర్ మొదటి మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు..మహిళలకు రాబోయే రోజుల్లో చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు వస్తున్నాయి. ఇదో మంచి అవకాశం.. ఎమ్మెల్యేలు కావాలనుకునే మహిళలు సిద్ధంగా ఉండండి. కట్నం సమస్య ఉండేది. గతంలో ఎక్కడికి వెళ్లినా ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేయాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్యలు తీరాయి. ఉద్యోగాలు, కాలేజీల్లో రిజర్వేషన్లు పెట్టాను. వాటిని కొందరు వ్యతిరేకించారు. అయినా ఆడవాళ్లు పైకి రావాలనే ఉద్దేశంతో ముందుకెళ్లా.

నాడు నేను తీసుకున్న ఓ నిర్ణయంతో ఆడబిడ్డలు బాగా చదువుకుని ఐటీలో ముందుకెళ్లారు. మగవాళ్ల కంటే ఎక్కువ ఆదాయం మహిళలు సంపాదిస్తున్నారు. అదీ మహిళల పట్టుదల.లక్ష మంది మహిళలను పారిశ్రామిక వేత్తలను చేస్తామని చెప్పాం. 1,12,686 మంది మహిళలు ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతాల్లో 33,899 మంది ఏర్పాటు చేశారు. ఇది చూసి చాలా సంతోషించా.

కొందరు అప్పులు తీసకుని చెల్లించరు. కానీ డ్వాక్రా, మహిళలు అప్పులు తీసకుంటే తిరిగి చెల్లించే వ్యవస్థ మనది. ఒకసారి రుణాలు చెల్లిస్తే... రెండోసారి మరిన్ని రుణాలు అందిస్తారు. 84.66 లక్షల మంది డ్వాక్రాలో సభ్యులుగా ఉన్నారు. 8.34 లక్షల సంఘాలు ఉన్నాయి. ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారు చేయాలని సంకల్పించాం. మంచి పనికి సంకల్పం తీసుకుంటే సాధించేవరకు పని చేసేది తెలుగింటి ఆడబిడ్డలే.

రూ.21 వేల కోట్లు కార్పస్ ఫండ్ కింద మీ వద్ద ఉంది. మెప్మా సంఘాలు ఉన్నాయి.. వారినీ అభివృద్ధి చేస్తు న్నాం. కొత్త బ్రాండ్ ఇప్పుడే ప్రారంభించాం... స్వయం మీ బ్రాండ్. అందులో మీ ఫోటోనే ఉంటుంది. 1.10 కోట్ల మంది సభ్యులుగా ఉన్నారు. డ్వాక్రా సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను మహిళలే వినియోగించుకోవాలి. దీని ద్వారా 3.30 కోట్ల మంది వినియోగించుకుంటారు. మన బ్రాండ్లు బాగుంటే ప్రపంచమంతా మన వద్దకు వస్తుంది. స్వయం బ్రాండ్ ను గ్లోబల్ బ్రాండ్ గా మార్చే బాధ్యత మేం తీసుకుంటాం.

**దేశంలో 6 లక్షల మంది ఆడబిడ్డలు పారిశ్రామిక వేత్తలు ఉండే ఏకైక రాష్ట్రం ఏపీ**

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా వేర్వేరు సంస్థలతో స్వయం సహాయక సంఘాల కోసం సెర్ప్, మెప్మా ఒప్పందాలు చేసుకున్నాయి. సముద్రపు నాచుతో ఉత్పత్తుల తయారీకి 500 మంది మహిళలకు శిక్షణ ఇచ్చేలా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీతో ఒప్పందం., సీవీడ్ కల్చర్‌లో మహిళలకు శిక్షణ, ఉత్పత్తుల తయారీ కోసం సీఎస్ఐఆర్‌తోనూ కీలక ఒప్పందం. స్వయం సహాయ సంఘాల మహిళలు ఈ సీవీడ్‌లను వివిధ రకాల ఉత్పత్తుల తయారీ కోసం కేరళకు చెందిన అమృత విశ్వవిద్యా పీఠంతో ఒప్పందం. మహిళలకు నైపుణ్యాభివృద్ధి కల్పనపై ఎక్స్ఎల్ఆర్ఐ సంస్థతో ఒప్పందం. చేసుకున్న మహిళా సంఘాలు పొదుపు చేసిన మొత్తాలతో వ్యాపారాలను నెలకొల్పేందుకు అవసరమైన సహకారం కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తో సెర్ప్ ఒప్పందం. చేనేత, ఇతర ఫ్యాబ్రిక్ ఉత్పత్తుల మార్కెటింగ్ సహా ఇతర అంశాల్లో తోడ్పాటు కోసం ఆప్కోతో ఒప్పందం . డిజిటల్ కామర్స్ సహా ఎఫ్పీఓ ఉత్పత్తుల మార్కెటింగ్ సహా వివిధ అంశాలపై సహకారం కోసం ఐఐఎం విశాఖపట్నంతో ఒప్పందం .ఈ సందర్భగా సీఎం మాట్లాడుతూ డ్వాక్రా మహిళల స్వయం బ్రాండ్ ను ప్రమోట్ చేయడానికి నేను ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటానని అన్నారు. 37 ఎంఓయూలు ఈ రోజు చేసుకున్నాం. మార్కెట్లు, క్వాలిటీ పెంచడానికి, టెక్నాలజీ వినియోగానికి ఎంఓయూలు చేసుకున్నాం..ఈ రోజు నుంచి వచ్చే ఏడాదికి 5 లక్షల మంది మహిళలను పారిశ్రామిక వేత్తలను తయారు చేస్తాం..గత ఏడాది 1 లక్ష మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేశాం అన్నారు.దేశంలో 6 లక్షల మంది ఆడబిడ్డలు పారిశ్రామిక వేత్తలు ఉండే ఏకైక రాష్ట్రం మన ఏపీ. అన్నారు.

# మహిళలకు తెలివి ఎక్కువ

**న్యూఢిల్లీ, మార్చి 8:** మహిళలు సాధారణంగా పురుషుల కంటే ఎక్కువ తెలివైన వారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ అభిప్రాయపడ్డారు. ఇటీవల కేరళ పర్యటనలో విద్యార్థులతో ముచ్చట్లకు సంబంధించిన వీడియోను ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా సోషల్ మీడియాలో షేర్ చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్ని రోజుల క్రితం, భోజన సంభాషణ సందర్భంగా కేరళలో కొంతమంది యువ మహిళా విద్యార్థులను కలిశా, వారితో చాలా ఆసక్తికరమైన సంభాషణ చేశానని చెప్పారు. కేరళలోని కొంతమంది యువ విద్యార్థులతో సంభాషించడం చాలా స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. "వారి కలలపై వారి విశ్వాసం, నమ్మకం స్త్రీలే మార్పుకు అంతిమ శక్తి అని నిరూపిస్తుంది" అని ఆయన అన్నారు. "ప్రతి విద్యార్థి కలలు, ఉత్సుకత, ఆత్మవిశ్వాసం తనను బాగా ఆకట్టుకున్నాయి. మహిళలు తమ సామర్థ్యాన్ని గుర్తించి, విశాల దృక్పథంతో ముందుకు సాగినప్పుడు, వారు అసాధారణ మార్పును తీసుకురాగలరని ఇటువంటి సంభాషణలు మనకు గుర్తు చేస్తాయి" అని ప్రతిపక్ష నాయకుడు అన్నారు. "స్త్రీలే బాస్‌లుగా ఉన్న కుటుంబంలో పెరిగాను. కాబట్టి మా కుటుంబానికి యజమాని నా అమ్మమ్మ, నా కుటుంబంలో, ఈ టేబుల్‌పై ఉన్నట్లుగా, ఎల్లప్పుడూ మహిళల సంఖ్య ఎక్కువగా ఉండేది," అని గాంధీ విద్యార్థులతో అన్నారు. "సాధారణంగా మహిళలు ఎక్కువగా పురుషుల కంటే తెలివైనవారు. పురుషులు తొందరపడతారు. పురుషులు తెలివితక్కువ విషయాలతో కళ్ళు మూసుకుంటారు. మహిళలు దీర్ఘకాలికంగా ఆలోచిస్తారు, వారు ప్రత్యక్ష శక్తిని ప్రయోగించరు, వారు పరోక్ష శక్తిని ప్రయోగిస్తారు, ఇది మరింత ప్రభావవంతంగా ఉంటుంది" అని ఆయన చెప్పారు. "ప్రతి స్త్రీ ప్రత్యేకమైనది. వారి సున్నితత్వం, అవగాహన, భావోద్వేగ మేధస్సు సమాజానికి సమతుల్యత, దిశానిర్దేశం చేస్తాయి. మహిళలు తమదైన ప్రత్యేక మార్గాల్లో సహనం, దీర్ఘకాలిక దృష్టి, సానుభూతితో అధికారాన్ని కూడా చెలాయిస్తారు" అని రాహుల్ గాంధీ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. "కావున, సమాజం నిర్బంధ నిబంధనలకు కట్టుబడి ఉండకుండా, వారి గుర్తింపు, వ్యక్తిత్వం, ఆకాంక్షల ప్రకారం ముందుకు సాగడానికి వారికి ప్రతి హక్కు ఉండాలి" అని ఆయన అన్నారు. "అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అందరు మహిళలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. మీ బలం, ధైర్యం, కలలు సమాజాన్ని సానుకూల భవిష్యత్తు వైపు నడిపించడం కొనసాగించాలి" అని రాహుల్ గాంధీ అభిలాషించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే లింగ సమానత్వంపై బి.ఆర్. అంబే ద్కర్ చేసిన కోట్‌ను ఎక్స్‌లో పంచుకున్నారు. "మీరు బాధపడటానికి పుట్టలేదు. మీరు ఎదగడానికి పుట్టారు. 'మహిళలు కేవలం అభివృద్ధిలో భాగస్వాములు కాదు. వారు దాని చోదక శక్తి. వారి జ్ఞానం, స్థితిస్థాపకత, కరుణ, సంకల్పం ద్వారా, మహిళలు సమాజాలను బలోపేతం చేస్తారు. బలమైన దేశాలను నిర్మిస్తారు" అని ఖర్గే అభిప్రాయపడ్డారు. 'సమానత్వం అనేది ప్రతి స్త్రీకి ఒక ఆకాంక్ష కాకపోయినా, అది జీవించిన వాస్తవికత అయినప్పుడే నిజమైన పురోగతి వస్తుంది" అని కాంగ్రెస్ చీఫ్ అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. "ఈమహిళా దినోత్సవం, ప్రతి స్త్రీ తన బలాన్ని, తన హక్కులను, భవిష్యత్తును రూపొందించే శక్తిని గ్రహించాలి. మీరు ముఖ్యం. మీ స్వరం ముఖ్యం. మీ కలలు ముఖ్యం" అని ఆమె పేర్కొన్నారు.

## ఇక 'ఏఐ'

>> త్వరలో ముగియనున్నాయి. వీటి ఫలితాలపై సీఎం చంద్రబాబుకు నివేదిక అందజేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. సీఎం ఆదేశాలు అనుసరించి, తదుపరి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఏఐ ఆధారిత సేవల ద్వారా తక్కువ సమయంలో నాణ్యమైన వైద్య సేవలను ఎక్కువ మందికి అందించేందుకు వీలవుతుందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. ఈ సేవలను అబా ఐడితో అనుసంధానం చేసి రోగుల వివరాలను డిజిటలైజేషన్ చేస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పానికి అనుగుణంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారం, మంత్రి సత్యకుమార్ ఆదేశాలు నుసరించి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ తదుపరి చర్యలకు ఉపక్రమించారు. వైద్య సేవల్లో టెక్నాలజీ వినియోగంపై సౌరబ్‌గౌర్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.

## రెస్టారెంట్లపై ఐటి దాడులు

>> సేకరిస్తున్నారు. ఇటీవల నెల్లూరులోని శ్రీ వెంగమాంబ పంజాబీ ఫ్యామిలీ దాబాపై ఐటీ అధికారులు దాడులు చేశారు. కీలక ఆధారాలు సేకరించి, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. అదే తరహాలో పన్ను ఎగ్గొడుతున్న సంస్థలని ఆదాయ పన్ను శాఖ అధికారులు గుర్తిస్తున్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

## ఆకస్మిక వర్ష సూచన

>> విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. ఉరుములు, మెరుపులు, బలమైన గాలులు వీస్తాయని పేర్కొంది. పిడుగులు పడే అవకాశం ఉన్నందున రైతులు, వ్యవసాయ కార్మికులు చెట్ల కింద ఆశ్రయం తీసుకోకూడదని హెచ్చరించింది. బలమైన గాలుల వల్ల కొమ్మలు విరిగిపడొచ్చని, పిడుగులు పడే ప్రమాదం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. హోర్డింగ్‌లు, కటౌట్లు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించింది.

# భీకర దాడులు



ఇరాన్‌లో ధ్వంసమైన గృహాలు

>> దాడులు చేస్తామంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరికలు చేసారు. ఆదేశ ప్రజలే అక్కడి మతఛాందస ప్రభుత్వాన్ని పడగొట్టే రోజులున్నాయన్నారు. ఇలా ఉంటే ఇరాన్ జాతీయభద్రతా మండలి కార్యదర్శి అలీలారిజాని అమెరికా ట్రంప్‌కు తీవ్ర హెచ్చరికలు చేసారు. తమ నేత ఖమైనీ మృతికి ప్రతీకారం తీర్చుకుంటామని, ట్రంప్ అందుకు మూల్యం చెల్లించాల్సిందేనని ప్రకటించారు. యుద్ధం నేపథ్యంలో అమెరికన్‌సైనికులను తాము బంధించామని జైళ్లలో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటికే ఆరుగురు యుఎస్ సైనికులు చనిపోయారని ట్రంప్ తప్పుదోవపట్టిస్తున్నారని, కల్పిత సంఖ్యలతోమృతులను పెంచుతారని దుయ్యబట్టారు. అమెరికా,ఇజ్రాయెల్‌పై తమ ప్రతీకార దాడులు కొనసాగుతూనే ఉంటాయని ఆయన ఆగ్రహం వ్యక్తంచేసారు. అలాగే అమెరికా వైఖరిని వ్యతిరేకించే శక్తులు అట్టుడికిపోతున్నారు. నార్వేరాజధాని ఓస్లోలో ఆదివారం అమెరికా దౌత్యకార్యాలయం పేలుడు సంభవించింది. అయితే నార్వేదేశం ఈసంఘటనపై విస్తుపోయి తక్షణ దర్యాప్తునకు ఆదేశించింది. అలాగే సౌదీలోని అల్‌కర్జ్ ప్రాంతంలో ఇరాన్ చేసిన దాడుల్లో ఒక భారతీయుడు చనిపోయాడు.

**న్యూయార్క్ మేయర్ ఇంటివద్ద బాంబుల కలకలం**

ఇదిలా ఉంటే ట్రంప్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న న్యూయార్క్ మేయర్ హందాని ఇంటివద్ద బాంబుల కలకలం రేగింది. స్క్రూలు, బోల్టులతో నింపిన స్మోకింగ్ బాంబులు విసరడంతో ఆప్రాంతం ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనపై పోలీసులు ఆరుగురిని అదుపులోనికి తీసుకుని విచారణచేస్తున్నారు. నిరసనకారులక వ్యతిరేకంగా ట్రంప్ మద్దతుదారులు 100మందికిపైగా మేయర్‌కు మద్దతుగా నిరసనలుచేయడం విశేషం. దీనితో ఇరువర్గాలమధ్య ఘర్షణకు దారితీయడంతో హింసపెరిగింది. ఒకరిపై ఒకరు దాడులకు దిగడంతో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఘటన సమయంలో మేయర్ హందాని ఆయన భార్య ఇంట్లో లేరు.

**గల్ఫ్‌దేశాలపై ఇరాన్ భీకరపోరు**

ఇరాన్ గల్ఫ్‌దేశాలపై యుద్ధం ప్రారంభించినప్పటినుంచి 1300 డ్రోన్లను ప్రయోగించామని, 210 బాలిస్టిక్ క్షిపణులుప్రయోగించినట్లు వెల్లడించింది. యుఎఇ గగనతలంలో వాటిని అడ్డుకున్నట్లు ప్రకటించింది. దుబాయ్, కువైట్, ఖతార్, బహ్రెయిన్ విమానాశ్రయాలపైనా దాడులు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే వీటిని కొద్దిసేపు మూసివేసారు. కువైట్, సౌదీ, ఖతార్, యుఎఇ దేశాలనే లక్ష్యంగాచేసుకుని ఇరాన్ దాడులు ముమ్మరంచేసింది. అమెరికా బలగాలున్న ప్రిన్స్ సుల్తాన్‌ఎయిర్‌బేస్ లక్ష్యంగా 15 డ్రోన్లు, మూడు ఖండాంతర క్షిపణులను గాలిలోనే ధ్వంసంచేసామని సౌదీ రక్షణశాఖ ప్రకటించింది. ఖతార్‌కూడా తాము 12 క్షిపణులను అడ్డుకున్నట్లు వెల్లడించింది

**ఖమేనీ కుమారుడికి గాయాలు**

ఇదిలా ఉంటే అమెరికా ఇజ్రాయెల్ దేశాలు జరుపుతున్న వైమానిక దాడుల్లో ప్రస్తుత తాత్కాలిక చీఫ్ ఖమైనీ కుమారుడు మొజ్తబా ఖమైనీకి గాయాలయినట్లు ఇజ్రాయెల్‌ప్రకటించింది. బహుశా ఆతడు బతికే ఉండవచ్చనికూడా ప్రకటించింది. ఈ దాడి గతనెల 28వ తేదీనే జరిగిందని,మొజ్తబా తన తండ్రితోపాటే అక్కడ ఉన్నట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది.

ఖమైనీతోపాటు 40మంది నేతలు, మేజర్ జనరల్స్‌ను అంతంచేసామని ఇజ్రాయెల్‌ప్రకటిం చింది. అయితే ఈ దాడినుంచి మొజ్తబా ప్రాణాలతో బయటపడ్డారని గాయపడినట్లు ఇజ్రాయెల్‌భద్రతా అధికారులు వాదిస్తున్నారు. ఇదిలా ఉంటే ఇరాన్ భవిష్యత్తు సుప్రీం లీడర్ ఎవరైనా సరే వారినికూడా మట్టుబెడతామని ఇజ్రాయెల్‌ప్రధాని ప్రకటించారు.

**ఇళ్లనుంచి బయటకు రావద్దు...యాసిడ్ దాడుల ముప్పు**

కాగా ఇరాన్ ప్రభుత్వం ప్రజలనున ఇళ్లనుంచి బయటకు రావద్దని హెచ్చరించింది. వాయుకాలుష్యం భారీగా పెరిగిందని, అమెరికా ఇజ్రాయెల్ దాడులకారణంగా వాయుకాలుష్యం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యం బారినపడతారని హెచ్చరించింది. దాడులనుంచి విషపూరితమైన శకలాలు వస్తాయని నగరం మొత్తం చెల్లాచెదురుగా పడతాయని అందువల్ల బయటకు రావడం పూర్తిగా తగ్గించుకోవాలని ఇరాన్ తన పౌరులకు విజ్ఞప్తిచేసింది. ఇరాన్‌రాజధాని టెహ్రాన్‌లో ఒక ఆయిల్ డిపో, చమురుశుద్ధికేంద్రంపై దాడులుజరిగిన తర్వాత పారిశ్రామిక నగరం మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. అయితే యాసిడ్ వర్షం వచ్చే ముప్పు ఉందని, విషపూరిత రసాయనాలు ఇంధన స్టోరేజి ట్యాంకులనుంచి వస్తాయని హెచ్చరించింది. దీనివల్ల ఊపిరితిత్తులు దెబ్బతింటాయని, ప్రాణాపాయం ఉన్నందున ఇళ్లనుంచి బైటకు రావద్దంటూ హెచ్చరించింది.

**ఆయుధపవర్‌చూసాక మాపై ఎవ్వరూ సాహసంచేయరు...ట్రంప్**

ఖరీదైన రాకెట్లకంటే భారీ తూటాలు పేల్చే నౌకలే మేలని గతం కంటే 100 రెట్లు శక్తివంతమైన 10 యుద్ధనౌకలు తమకు ఉన్నాయని, వీటినిచూస్తే ఎవ్వరికైనా మాపై దాడిచేయాలన్న ఊహ కూడా రాదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇపుడు మరో పది భారీ నౌకలు వస్తున్నాయని, గతంకంటే 100 రెట్లు శక్తివంతంగా ఉంటాయన్నారు.

# నేడు డోన్‌లో సిఎం పర్యటన

## రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

**విజయవాడ, మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం నంద్యాల జిల్లాలో పర్యటించనున్నారు. డోన్ నియోజకవర్గం, కొత్తబురుజు గ్రామంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయనున్నారు. ఉదయం 10.00 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి 11.20 గంటలకు కొత్తబురుజు గ్రామానికి చేరుకుంటారు. 11.35 గంటల నుంచి మధ్యాహ్నం 01.30 గంటల వరకు గ్రామ సభలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేసి ప్రజా వేదిక సభలో పాల్గొంటారు. 02.05 గంటలకు స్థానిక రైతులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముచ్చటిస్తారు. అనంతరం 02.40 గంటలకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 05.40 గంటలకు తిరిగి అమరావతి చేరుకుంటారు.





# కృష్ణపట్నం సిఐ, ముత్తుకూరు ఎస్సైల సస్పెన్షన్

## విధుల్లో నిర్లక్ష్యమే కారణం

**నెల్లూరు క్రైమ్, మార్చి 8, ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డి పాలెం పట్టణ, రూరల్ సీఐల పై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని 48 గంటలు గడవకముందే జిల్లాలో మరో ఇద్దరు అధికారులు సస్పెన్షన్‌కు గురయ్యారు. కృష్ణపట్నం సీఐ రవి నాయక్, ముత్తుకూరు ఎస్సై ప్రసాద్ రెడ్డిలను సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు ఇటీవల తోటపల్లి గూడూరు మండలంలోని ఓ గ్రామంలో పసి బాలికపై ఓ దుండగుడు అత్యాచారానికి ప్రయత్నించిన ఘటనే ఇందుకు కారణంగా తెలుస్తోంది. నిందితుడు ముత్తుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్‌గా నమోదై ఉన్నాడు. అయినప్పటికీ అతనిలో ఎటువంటి మార్పు రాక తరచూ నేరాలకు పాల్పడుతుండడం, అటువంటి నిందితుడి నేర కదిలికలపై సీఐ, ఎస్సైలు సరిగా పట్టించుకో కపోవడాన్ని ఉన్నతాధికారులు తప్పుబట్టారు. వీటితో పాటు ఇద్దరు అధికారులపై పలు ఆరోపణలు ఉన్నట్టు సమాచారం. ఈ క్రమంలో ఇద్దరు అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు.

## వారం - వర్జ్యం

09-03-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
షష్ఠి రా.11.28
విశాఖ సా.4.12
వర్జ్యం : రా.8.41-10.29
దు.ము.12.43-1.31,
2)మ.3.06-3.54
రాహుకాలం - ఉ.7.30-9.00

## వారఫలం

**మేషం :** కుటుంబ వ్యవహారాలు కొంత చికాకు కలిగిస్తాయి. కోర్టువ్యవహారాలలో వాయిదాలు చోటు చేసుకుంటాయి.

**వృషభం:** విదేశీయాన యత్నాలు గతంలో కన్నా ఈరోజు ముమ్మరం చేస్తారు. ఆరోగ్యం నలతగా ఉంటుంది.

**మిథునం:** దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నూతన అంశాలను కూడా పరిగణలోనికి తీసుకుంటారు.

**కర్కాటకం:**విదేశాలలోని మీ ఆప్తుల నుండి ఊరట కలిగించే వార్తలు వింటారు. ఆర్థిక పరమైన సమస్యలు కొంత వరకు తీరతాయి.

**సింహం:**గృహ విషయాలకు, అతిథి మర్యాదలకు ప్రాముఖ్యం ఇస్తారు. సమాజములో కీర్తిప్రతిష్ఠలు పెంపొందుతాయి.ధనలాభం.

**కన్య :** సంతాన విద్యా విషయములకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. అన్య భాషల యందు ఆసక్తి కలిగి ఉంటారు.

**తుల :** సులువుగా అవుతుందనుకున్న ఒక పనికూడా ఈ రోజు వాయిదా పడుతుంది. కుటుంబ సమస్యలను అధిగమించ గలుగుతారు.

**వృశ్చికం:**ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:** అంతరంగిక వ్యవహారాలలో కొన్ని రహస్య ఒప్పందాలు కుదుర్చుకుంటారు. విదేశాలకు వెళ్లాలనుకునే కాంక్ష నెరవేరుతుంది.

**మకరం:**ఆత్మీయుల గురించి కొన్ని ముఖ్యమైన వివరాలు తెలుసుకుంటారు. భూ గృహాది విషయాలలోనూ ఆసక్తి చూపుతారు.

**కుంభం:** విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రోత్సాహం లభిస్తుంది. చేస్తున్న వృత్తిలో మార్పులు చోటుచేసుకుంటాయి.

**మీనం:** బ్యాంకింగ్ వ్యవహారాలలో ప్రత్యేకమైన శ్రద్ధ కనబరచవలసి వుంటుంది. బంధువులనుండి లేఖలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రోజు రోజుకు గరం గరం

## ఉష్ణోగ్రతలు 45° దాటే ప్రమాదం

### హెచ్చరించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** మార్చి ఆరంభంలోనే ఎండలు మండిపోతుండడంతో అల్లాడిపోతున్న ప్రజలకు వాతావరణ శాస్త్రవేత్తలు మరో హెచ్చరిక జారీ చేశారు. రానున్న ఎప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు. సాధారణంగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటితేనే అల్లాడిపోతాం.. అలాంటిది రాబోయే రెండు నెలల్లో దేశంలో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల నుండి 48 డిగ్రీల దాకా చేరే ప్రమాదముందని సూచిస్తున్నారు. వేసవి ఉష్ణోగ్రతలదాటికి శరీరం తట్టుకోకపోతే ప్రాణాలకే ముప్పు అని హెచ్చరిస్తున్నారు. గాలిలో తేమ , వేడి కలిసినపుడు శరీరంలోని చెమట ఆవిరి కాదని, దీన్ని వెట్‌బల్బ్ టెంపరేచర్‌గా పేర్కొంటున్న వాతావరణ నిపుణులు ఈ తరహా వాతావరణం మనుషులకు అత్యంత ప్రమాదకరమని పేర్కొంటున్నారు. సాధారణంగా ఎండాకాలం అంటే మధ్యాహ్నం తర్వాత ఎండలు మండిపోయేవి. కానీ ప్రస్తుతం వారం, పది రోజులుగా ఉదయం 8 గంటల నుంచే సూర్యారావు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ప్రస్తుతం మార్చి మెదటి వారంలోనే నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. భానుడి భగభగలు, తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు.ఉదయం పది గంటల తర్వాత కూడా రోడ్లపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.




ఈ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రానున్న రెండు రోజులపాటు రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉంటుందని, సాధారణం కంటే 2 నుండి 3 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది. రానున్న అయిదు రోజులపాటు రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కును చేరుతాయని అంచనా వేసింది. ముఖ్యంగా ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఆకాశం పూర్తిగా నిర్మలంగా ఉండటం వల్ల సూర్యరశ్మి నేరుగా భూమిని తాకుతుందని మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు తీవ్రమైన ఉక్కపోత, వేడి ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఆ సమయంలో బయటకు రాకుండా ఉంటేనే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

## మహిళల సంక్షేమంపై చంద్రబాబుది కపట ప్రేమ

### - వైఎస్ షర్మిల

విజయవాడ, మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి: మహిళల సంక్షేమంపై చంద్రబాబుది కపట ప్రేమని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మహిళల భద్రత, సంక్షేమం విషయంలో మోదీ, చంద్రబాబు ప్రభుత్వాలు పూర్తిగా విఫ లమయ్యాయని ఆమె ఆరోపించారు. పథకా లతో మహిళలను మభ్య పెట్టి మోసం చేస్తు న్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో మహి ళలకు ఇచ్చిన మూడు హామీలను విస్మరించి నయవంచనకు పాల్పడిం దని షర్మిల విమర్శిం చారు. మహాశక్తి పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని చెప్పి 1.80 లక్షల మందిని, తల్లికి వందనం కింద 20 లక్షల మంది తల్లులను మోసం చేశారని ఆరోపించారు.

## విదేశీ ఎంబిబిఎస్ పట్టభద్రులకు శుభవార్త

విజయవాడ మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి: విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి స్వదేశానికి వచ్చిన పట్టభద్రుల సమస్యను రాష్ట్ర ప్రభు త్వం పరిష్కరించింది. తమకు శాశ్వత రిజిస్ట్రేష న్ పత్రాలు ఇవ్వాలంటూ విదేశీ ఎంబీబీఎస్ పట్టభద్రులకు కూటమి ప్రభుత్వ చొరవతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని 70 మందికి శాశ్వత రిజిస్ట్రేషన్ల పత్రాలు అందజేయడానికి ఏపీ మెడికల్ కౌన్సిల్ సిద్ధమైంది. వీరిలో నలుగురికి మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా పత్రాలను ఇప్పటికే అందజేశారు. మిగిలిన వారికి సోమవారం నుంచి ధ్రువీకరణ పత్రాలను ఇవ్వనున్నట్లు డాక్టర్ శ్రీహరిరావు తెలిపారు. ఫిలిప్పీన్స్, ఉక్రెయిన్, చైనా, కజకస్తాన్ లాంటి ఏడు దేశాల్లో ఎంబీబీఎస్ విద్యను పూర్తి చేసి. ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్న్‌షిప్ చేసిన వారికే శాశ్వత రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు.

## క్యాన్సర్‌ను జయించిన మహిళల ర్యాంప్ వాక్

విజయవాడ మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాల్లో భాగంగా శనివారం విజయవాడ సిద్దార్థ మహిళా కళాశాలలో క్యాన్సర్ జయించిన మహిళలతో ర్యాంప్‌వాక్ నిర్వహించారు. రూట్స్ ఫౌండేషన్, అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు పి.అనీల, ఇషాంత్, స్రవంతి, రూట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ విజయభాస్కర్, సిద్దార్థ మహిళాద కళాశాల ప్రిన్సిపాళ్లు వి.వి.సుబ్రహ్మణ్య కుమార్, ఎస్.పద్మజ తదితరులు పాల్గొని క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు.

# తిరుపతిలో నకిలీ మద్యం తయారీ గుట్టురట్టు

## కార్డన్ సెర్చ్‌లో అక్రమ మద్యం స్వాధీనం



**తిరుపతిరూరల్, మార్చి 8 ప్రభాతవార్త:** తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం తయారు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతిరూరల్ డియస్పీ బేతంపూడి ప్రసాద్ ఆదేశాల మేరకు తిరుచానూరు ఎస్సై టి.వి.సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసు బృందం శేషాద్రినగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించగా ఈ వ్యవహారం బయటపడింది. పాడిపేట పంచాయతీ పరిధిలోని శేషాద్రి నగర్ ఇందిరమ్మకాలనీలో బ్లాక్ నెంబర్-40 ఇంటి నెంబర్ ఎఫ్-8 వద్ద నిర్వహించిన సోదాల్లో ఇంటి నుంచి తీవ్రంగా మద్యం వాసన రావడంతో అనుమానం వచ్చిన పోలీసులు పెద్దల సమక్షంలో తనిఖీలు చేపట్టారు. నిందితుడు విశాఖపట్నం జిల్లా గోపాలపట్నం ప్రాంతానికి చెందిన చింతగుంట రామస్వామి నగేష్‌రెడ్డి (39) గా గుర్తించారు. పోలీసుల విచారణలో నిందితుడు యూట్యూబ్ వీడియోలు చూసి నల్లద్రాక్ష, చక్కెర, గోధుమలు, ఈస్ట్‌తో పాటు దాలిచన చెక్క, యాలకులు, లవంగాలు, సోంపు, జాజి పువ్వు, బిర్యాని ఆకులు వంటి సుగంధ ద్రవ్యాలను ఉపయోగించి డ్రమ్ములో పులియబెట్టి ఇంట్లోనే వైన్ తయారు చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఈ మద్యాన్ని పాత సీసాలో నింపి పరిచయస్తులకు సుమారు రూ.300కు విక్రయిస్తూ తాను సేవిస్తున్నట్లు వెల్లడించారు.

కెమికల్ అనాలిసిస్ నివేదిక ప్రకారం ఈ మద్యంలో ఆల్కహాల్ శాతం 8.12శాతం నుంచి 8.25శాతం వరకు ఉన్నట్లు తెలిందన్నారు. సాధారణంగా మార్కెట్‌లో లభించే మద్యంలో ఇది సుమారు 42శాతం వరకు ఉంటుందని, అయితే అశాస్త్రీయంగా తయారు చేయడం వల్ల ఈ మద్యం కలుషితమై ఆరోగ్య సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉందని పోలీసులు తెలిపారు. సోదాలలో భాగంగా నిందితుడి వద్ద నుంచి 1000 మిల్లీలీటర్ల సామర్థ్యం గల నాలుగు బాటిళ్లు నాన్-డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డిపిఎల్) 750 మిల్లీలీటర్ల సామర్థ్యం గల 33 బాటిళ్ల నాటు మద్యం అలాగే ప్లాస్టిక్ డ్రమ్ములో ఉన్న ఆరు లీటర్ల పులియబెట్టిన మద్యం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సుమారు 34.750 లీటర్ల అక్రమ మద్యం, మద్యం తయారీకి ఉపయోగించిన సుగంధ ద్రవ్యాల ప్యాకెట్లును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిన్న ఎక్సైజ్ చట్టంలో సెక్షన్ 34(ఇ) 35 ప్రకారం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

## బిజెపినేత ఫామ్ హౌస్‌లో గంజాయి సాగు!

నయారాయ్‌పూర్, మార్చి 8: బీజేపీ నేత తన ఫార్మ్‌హౌస్‌లో అక్రమంగా నల్ల మందు సాగు చేస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడులు చేశారు. బీజేపీ నేతతో సహా ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. స్థానిక బీజేపీ నేత, బీజేపీ కిసాన్ మోర్చా రైస్ మిల్ ప్రాసెసింగ్ ప్రాజెక్ట్ రాష్ట్ర కన్వీనర్ వినయ్ తామ్రాకర్‌కు సమోదా గ్రామం లో ఫామ్‌హౌస్ ఉన్నది. అందులో రహస్యంగా నల్లమందు అక్రమంగా సాగుచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వినయ్‌తో పాటు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. పార్టీ ప్రతిష్టకు తీవ్ర నష్టం కలిగినట్లు బీజేపీ పేర్కొంది. రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ సింగ్ డియో సూచనల మేరకు వినయ్ తామ్రాకర్‌ను సంస్థాగత పదవి నుంచి తొలగించింది. అలాగే ఆయన అరెస్ట్, కేసుపై దర్యాప్తు నేపథ్యంలో పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. రాష్ట్ర కార్యాలయం మార్చి 7న సస్పెన్షన్ ఉత్తర్వు జారీ చేసింది. మరో వైపు సమోదాలోని ఆ ఫార్మ్‌హౌస్‌ను భూపేశ్ బాఘేల్ సందర్శించారు. సుమారు 150 ఎకరాల మేర విస్తరించి ఉన్నదని, నిందితులకు రాజకీయ సంబంధాలు ఉన్నాయని బాఘేల్ ఆరోపించారు. ఈ అక్రమ నల్లమందు సాగులో ఏ మంత్రులు, ఎమ్మెల్యేలకు పాత్ర ఉన్నదో ప్రభు త్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడ గుమిగూడటంతో పోలీసులను మోహరించారు.

### భారత్‌మాకు ముఖ్యమైన భాగస్వామి

## అందుకే 30 రోజులు వెసులుబాటు: ట్రంప్

వాషింగ్టన్, మార్చి 8: భారత్ మాకు ముఖ్యమైన భాగస్వామి అందుకే రష్యా ఆయిల్ కొనుగోలు విషయంలో 30 రోజుల పాటు వెసులుబాటు కల్పించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. పశ్చిమ ఆసియా, గల్ఫ్ ప్రాంతాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం, ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ ఆయిల్ మార్కెట్‌పై పడుతున్న ఒత్తిడిని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఎయిర్ ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడిన ట్రంప్ ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించారు. అమెరికా ఆంక్షల కారణంగా సముద్రంలో నిలిచిపోయిన రష్యన్ క్రూడ్ ఆయిల్ షిప్‌మెంట్‌లను భారతీయ రిఫైనరీలు కొనుగోలు చేసేందుకు ఈ 30 రోజుల గడువు ఉపయోగపడుతుందని ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి సమీపంలో భద్రతా కారణాల రీత్యా ఆయిల్ సరఫరాకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉండటంతో, అంతర్జాతీయ మార్కెట్లో కొరత రాకుండా ఉండేందుకు ఈ తాత్కాలిక నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ కొనుగోలు ద్వారా రష్యాకు కొత్తగా ఎలాంటి ఆర్థిక ప్రయోజనం ఉండదని ట్రంప్ తేల్చిచెప్పారు. ప్రపంచవ్యాప్తంగా, అమెరికాలోనూ ఆయిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, పరిస్థితి త్వరలోనే సర్దుబాటు అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

## తిరుమల సమాచారం

### ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్ట్‌కి రూ.70 లక్షలు విరాళం

తిరుమల, మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి: విశాఖపట్నంకు చెందిన ఎన్ఆర్ఐలు త్రిపురనేని వెంకటరత్నం, మాధురి దంపతులు ఆదివారం టిటిడి వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 50 లక్షలు రూపాయలు విరాళంగా అందించారు. ఆయన కుమారులు త్రిపురనేని విజయ్, త్రిపురనేని వినయ్‌లు కూడా వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 20 లక్షలు విరాళంగా అందించారు. దాతల తరపున ప్రతినిధి పొట్లూరి నరసింహారావు తిరుమలలో అదనపు ఇఒ క్యాంపు కార్యాలయంలో అదనపు చిరుమామిళ్ల వెంకయ్య చౌదరికి విరాళం డిడి అందజేశారు.

### ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో వేంకటేశ్వర ఆగమ విద్వత్ సదస్సు ప్రారంభం

తిరుమల, మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో 29వ శ్రీవేంకటేశ్వర వేద శాస్త్ర ఆగమ విద్వత్ సదస్సు ఆదివారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సు 13వ తేది వరకు ఆరు రోజుల పాటు పండితుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. శ్రీవారి దివ్యానుగ్రహంతో భారతదేశ వ్యాప్తంగా ఉన్న వేద, శాస్త్ర, ఆగమ, స్మార్త, ప్రబంధ పండితులను గుర్తించి, వారిని టిటిడి పక్షాన పరీక్షించి, నగదు, శాలువా, విజయ పత్రికను అందించి గౌరవించేందుకుగాను 1969 సంవత్సరంలో వేంకటేశ్వర వేద, శాస్త్ర, ఆగమ, విద్వత్ సదస్సును ప్రారంభించడం జరిగింది. సదస్సుకు దేశవ్యాప్తంగా 800 మందికి పైగా అభ్యర్థులు హాజరవుతున్నారు. 100 మందికి పైగా సుప్రసిద్ధ పండితులు అభ్యర్థులను పరీక్షించనున్నారు. ఈ కార్యక్రమ ప్రారంభ సభలో తిరుమల చిన్నజీయర్ స్వామి, మైసూరు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ హాజరై అభ్యర్థులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.

### నేడు డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి

తిరుపతి, మార్చి 8 ప్రభాత వార్త ప్రతినిధి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మెట్ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు డయల్ యువర్ సిఎండి కార్యక్రమాన్ని ఏపిఎస్పిడిసిఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అబనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నంబరు: 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుంచి 9:30 గంటల వరకు డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు ఈ క్రింద పేర్కొన్న నంబర్లకు కాల్ చేయవచ్చు. తిరుపతి: 8712652679, చిత్తూరు: 7993147979, నెల్లూరు: 08612320427, అన్నమయ్య: 9440817449, కడప: 08562242457, కర్నూలు: 7382614308, నంద్యాల: 7382618976, అనంతపురం: 9154790350, శ్రీసత్యసాయి: 9963707847 ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మహిళల సాధికారతతోనే అభివృద్ధి సాధ్యం: జిల్లా కలెక్టర్

తిరుపతి, మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి..ప్రతి మహిళ ఉన్నత స్థాయికి చేరుకోవాలనే సంకల్పంతో ముందుకు సాగాలనీతిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర తెలిపారు. మహిళల సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఆదివారం మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సాధికారత, అభివృద్ధి సమాజంలో వారి పాత్రను గుర్తించి గౌరవించేందుకు మహిళా దినోత్సవం ఒక ముఖ్యమైన సందర్భంగా నిలుస్తుందని తెలిపారు. మహిళలు కుటుంబం, సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల జీవితంలో ఆర్థిక స్వేచ్ఛ, ఆరోగ్యం, ఆనందం అనే మూడు అంశాలు ఎంతో ముఖ్యమని, ఇవి ఉంటే కుటుంబం, సమాజం మరింత బలపడుతుందని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా లక్షపతి దీదీ కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా బలపరచడం జరుగుతుందని చెప్పారు. తిరుపతి జిల్లాలో సుమారు 1.60 లక్షల లక్షపతి దీదీలు ఉన్నారని పేర్కొన్నారు. డిఆర్డిఏ, మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా ఆర్థిక అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రతి కుటుంబంలో ఒక మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో కార్యక్రమాలు చేపడుతున్నదని, గత ఏడాదిలో జిల్లాలో 10 వేలకుపైగా మహిళా పారిశ్రామికవేత్తలు తయారయ్యారని వెల్లడించారు. జిల్లాలో డిఆర్డిఏ, మెప్మా ఆధ్వర్యంలో 14,600 స్వయం సహాయక సంఘాలు ఉండగా, వాటిలో 2 లక్షలకు పైగా సభ్యులుగా ఉన్నారన్నారు. 11 నెలల్లోనే సుమారు 2,600 కోట్లకు పైగా రుణాలు సంఘాలకు అందించామన్నారు. మహిళల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు అందించడం వల్ల మహిళల ఆరోగ్యం మెరుగుపడిందన్నారు. తిరుపతి జిల్లాలో 10.88 లక్షల కుటుంబాలకు పథకం ప్రయోజనం అందుతున్నట్లు చెప్పారు.

## వసూలుచేసిన సుంకాల చెల్లింపులకు సిబిపి కసరత్తు!

వాషింగ్టన్, మార్చి 7: ట్రంప్ విధించిన వాణిజ్య సుంకాలు చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో ఇప్పటివరకూ వసూలు చేసిన సొమ్మును 45 రోజుల్లోగా వాపసు చేయడానికి అమెరికా సిద్ధమైంది. ఈ చెల్లింపుల వ్యవస్థను సిద్ధం చేసే కార్యాచరణపై యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) విభాగం కసరత్తు చేస్తోంది. ఈ మేంకు సీబీపీ అధికారి బ్రాండన్ లార్డ్ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో వెల్లడించారు. చెల్లని సుంకాల కింద చేసిన చెల్లింపులను దిగుమతిదారులు తిరిగి పొందేందుకు వీలు కల్పించే వ్యవస్థను అభివృద్ధి చేస్తోందని తెలిపారు. దీనిలో భాగంగా దాదాపు 3.30 లక్షల మందికి సుమారు రూ.15.26 లక్షల కోట్ల సుంకం డబ్బును సీబీపీ తిరిగి ఇవ్వనుంది. ఈ అంశంపై చర్చించడానికి ట్రేడ్ కోర్టు న్యాయమూర్తి రిచర్డ్ ఈటన్‌తో ప్రభుత్వ న్యాయవాదులు శుక్రవారం సమావేశమయ్యారు.

## బాబు పాలనలో మహిళల జీవితాలు చీకట్లోకి: సజ్జల

విజయవాడ, మార్చి8 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు పాలనలో మహిళల జీవితాలు చీకట్లోకి వెళ్లిపోయాయని, రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. మళ్లీ మహిళల జీవితాల్లో వెలుగులు రావాలంటే వైయస్ జగన్ సిఎంని చేసుకుంటేనే సాధ్యమన్నారు. తాడేపల్లిలోని వైయస్సార్‌సిపి కేంద్ర కార్యాల యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. వైయస్ జగన్ పాలనలో మహిళలను రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా అండగా నిలబడ్డామన్నారు. రిజర్వేషన్లతో సంబంధం లేకుండా కీలకమైన పదవులు మహిళలకు ఇచ్చి గౌరవించామని చెప్పారు. కానీ చంద్రబాబు సీఎం అయ్యాక మహిళల మానప్రాణాలకే రక్షణ లేకుండా పోయిందని, ఆరేళ్ల చిన్నారి నుంచి 60 ఏళ్ల మహిళ వరకు ఉన్మాదులు మద్యం మత్తులో అత్యాచారాలు చేసి చంపేస్తున్నారని మండిపడ్డారు. అయినా మంత్రులుగా ఉన్న అనిత, సవిత, సంధ్యారాణిలు ఏమాత్రం స్పందించక పోవడం రాష్ట్ర మహిళల దౌర్భాగ్యమని మాజీ మంత్రి ఆర్కే రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. సుగాలి ప్రీతి పేరును వాడుకుని, ఆ బాలిక తల్లి కన్నీళ్లతో ఎమ్మెల్యేగా గెలిచిన పవన్ కళ్యాణ్ ఎన్నో అబద్ధాలతో మహిళలను మోసగించాడని ధ్వజమెత్తారు. వైయస్ జగన్ గారి నాయకత్వంలో మహిళలంతా ఒక్కటై ఉద్యమిస్తే ఈ అరాచకాలకు చరమగీతం పాడగలమని ధీమా వ్యక్తం చేశారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

### సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కల్యాణ్, మంత్రులు

**విజయవాడ,మార్చి8 ప్రభాతవార్త ప్రతినిధి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలుగింటి ఆడపడుచులకుముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు ఇవ్వడం నుంచి ప్రారంభమైన మహిళా సాధికారిత ప్రస్థానం నేడు మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేసే విధంగా కొనసాగుతోందని అన్నారు. మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం తల్లికి వందనం, స్త్రీ శక్తి ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, దీపం 2 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం, ఎన్టీఆర్ భరోసా వితంతు పింఛన్లు వంటి పథకాలను అమలు చేస్తోందని వెల్లడించారు. మెగా డీఎస్సీ ద్వారా 7955 మంది మహిళలకు టీచర్ ఉద్యోగాలు, 993 మహిళలకు కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చామని వివరించారు.

**డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్**

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ కుటుంబానికి ఆధారం, సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్న మహిళల శక్తి, సహనం, ప్రేమ, త్యాగం అపూర్వమైనవని కొనియాడారు. సమాజాభివఅద్ధికి మహిళా సాధికారత ప్రమాణమని, ఆడబిడ్డల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు.

**మంత్రి నారా లోకేష్**

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఎపి మంత్రి లోకేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మనిచ్చిన అమ్మ. జీవితాంతమూ మనల్ని కంటికి రెప్పలా కాచే మాతృ మూర్తులందరికీ శుభాకాంక్షలు చెప్పారు. జీవితాంతమూ అమ్మమ్మ, నాన్నమ్మ, అక్కా, చెల్లి, భార్య, అత్త, పెద్దమ్మ, పిన్ని, వదిన, మరదలి రూపంలో మనల్ని కంటికి రెప్పలా కాచే మాతృ మూర్తులందరికీ శుభాకాంక్షలు.

### మంత్రుల శుభాకాంక్షలు

**హోం మంత్రి వంగలపూడి అనిత**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహిళల భద్రత, గౌరవం, సాధికారత కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని తెలియజేశారు.

**సవిత, సంధ్యారాణి**

మంత్రి సవిత, సంధ్యారాణి కూడా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. భద్రత, గౌరవం, సాధికారత కోసం ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని అనిత చెప్పారు. డ్వాక్రా సంఘాలు చంద్రబాబు మానస పుత్రికలని, వాటి ద్వారా ప్రతి ఇంటా ఒక మహిళ ఆర్థికంగా ఎదుగుతూ పారిశ్రామికవేత్తగా మారాలన్నదే సీఎం లక్ష్యమని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు.

**కందుల దుర్గేష్**

ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని అనేక మంది మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతున్నారని అన్నారు. ప్రతి ఇంట్లో ఒక మహిళా పారిశ్రామిక వేత్త ఉండాలన్నదే సిఎం లక్ష్యమని, మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

**సంధ్యారాణి**

మహిళలను అత్యుత్తమ సృజనాత్మక శక్తులుగా గుర్తించి. వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం గుణాత్మక కార్యచరణ చేపట్టిందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

**కొండపల్లి శ్రీనివాస్**

మహిళలు సంతోషంగా ఉంటేనే కుటుంబం, జిల్లా, రాష్ట్రం, దేశం బలంగా ఉంటాయని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

### శుభాకాంక్షలు తెలిపిన వైసిపి అధ్యక్షుడు వైఎస్. జగన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ... రెండు తెలుగు రాష్ట్రాల మహిళలతోపాటు యావత్ మహిళలందరికీ వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే వారు నిజమైన పురోగతి సాధించినట్లని పేర్కొన్నారు.

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్**

మహిళ శక్తి సంఘటితంగా ఉంటే అద్భుతాలు సాధిస్తుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారత కోసం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నాయి. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబుల నేతృత్వంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు అత్యంత శక్తివంతంగా అభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళాలోకానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పిఎస్సార్, కాంతిరాణా సస్పెన్షన్ పొడిగింపు

విజయవాడ,మార్చి8 ప్రభాతవార్త ప్రతినిధి: ముంబాయి నటి జెత్వాని కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారులపీఎస్సార్ ఆంజనేయులు, కాంతి రాణా టాటా పైన ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. వైసీపీ హయాంలో కీలక అధికారులుగా పని చేసిన వీరి పైన కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టగానే చర్యలు తీసుకుంది ముంబైకి చెందిన సినీనటి కాదంబరి జెత్వానీపై అక్రమ కేసు బనాయించి ఆమెతో టు కుటుంబ సభ్యులను వేధించిన కేసులో ఐపీఎస్ అధికారులపై ఇప్పటికే సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుతం ఆ కాలపరిమితి ముగుస్తుండటంతో మరో సారి వీరి సస్పెన్షన్ ను ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయం నుంచి వీరు సస్పెన్షన్ లోనే ఉన్నారు. అయితే పీఎస్సార్ ఆంజనేయులు సస్పెన్షన్ పదవి విరమణ వరకు కొనసాగుతుందని ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టం చేసారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఐపీఎస్ అధికారి పీఎస్సార్ నిఘా చీఫ్‌గా పని చేసారు. కాంతిరాణా విజయవాడ సీపీగా వ్యవహరించారు.



## జగ్గయ్యపేటలో ఏప్రిల్ 5న తెలుగు రాష్ట్రాల ఈతల పోటీ

జగ్గయ్యపేట, మార్చి 8, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో ఏఫ్రిల్ 5వ తేదీన ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి ఈతల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఏపి, టిజి స్టేట్స్ డిఎస్ఏ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్-2026 పోటీల పోస్టర్లను వారు ఆవిష్కరించారు. స్థానిక స్విమ్మింగ్‌పూల్‌లో ఈపోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తెలిపారు.

### భారత్ చైనాలు ప్రత్యర్థులు కాదు..

## భాగస్వాములే!

### చైనా విదేశాంగమంత్రి వాంగ్ యి

బీజింగ్, మార్చి 8: భారత్, చైనా దేశాలు పరస్పరం ప్రత్యర్థుల్లా కాకుండా భాగస్వాములుగా ఉండాలని చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యి వ్యాఖ్యానించారు. ఒకరికొకరు ముప్పు అని భావించకుండా అభివృద్ధికి తోడ్పడే అవకాశంగా చూడాలన్నారు. వార్షిక మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకుండా సం బంధాలను మెరుగుపర్చుకునే విషయానికి ఇరుదేశాలు కట్టుబడి ఉండాలని సూచించారు. 2024లో కజాన్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల సమావేశం జరిగిందని, అప్పటి నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైందని వాంగ్ యి చెప్పారు. గత ఏడాది తియాంజిన్‌లో ఇరుదేశాల నేతలు మరోసారి భేటీ అయిన తర్వాత మరింత మెరుగుదల కనిపించిందని తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయికి చేరుకోవడం, ప్రజల మధ్య సంబంధాలు మెరుగుపడటం వంటివి ఇరుదేశాలకూ ప్రయోజనం చేకూర్చాయని అన్నారు. భారత్, చైనా సత్సంబంధాలు, స్నేహాన్ని కాపాడుకోవాలని, సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించాలన్నారు.

## జనసేనలో రఘురామచౌదరి చేరిక

విజయవాడ, మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి: చిత్తూరు జిల్లా రాజకీయాల్లో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, సిద్ధార్థ్ ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్ అధినేత గుర్రం రఘురామచౌదరి అధికారికంగా జనసేన పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన పీఏసీ సభ్యుడు నాగబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్ళూరి ఆయనకు జనసేన కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఐటీ కోఆర్డినేటర్ ఉయ్యాల శ్రీనివాస్, చిరంజీవి యువత అధ్యక్షుడు పూల ప్రభాకర్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘురామచౌదరి మాట్లాడుతూ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా, పార్టీ విధివిధా నాలకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. పూత లపట్టు నియోజకవర్గంతో పాటు చిత్తూరు పార్ల మెంటు స్థానం పరిధిలో జనసేనను బలోపే తం చేసేందుకు నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ శ్రమిస్తానని తెలిపారు.

## 16న అమరావతిలో పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహా ఆవిష్కరణ



విజయవాడ,మార్చి8 ప్రభాతవార్త ప్రతినిధి: "స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్" పేరిట అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 16న పొట్టి శ్రీరాములు విగ్రహా అవిష్కరణ జరగనుంది. రాజధాని ప్రాంతం తుళ్లూరు మండలం పెదపరిమి ప్రాంతంలోని అమరజీవి స్మృతి వనం లో ఆయన జయంతికి పొట్టి శ్రీరాములు 58 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత విగ్రహావిష్కరణ పనులను పరిశీలించారు. నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ ఈ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని మంత్రి సవిత తెలిపారు. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని కోరుతూ ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని భావి తరాలకు తెలియ చేసేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్లు మంత్రి తెలిపారు.

# సంతాల్ సదస్సులో రాష్ట్రపతికి అవమానం విచారకరం

## ఎపి డి.సిఎం పవన్ కల్యాణ్



విజయవాడ, మార్చి8 ప్రభాతవార్తప్రతినిధి: పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్‌లో జరిగిన అంతర్జాతీయ సంతాల్ సదస్సు నిర్వహణ తీరు, అక్కడ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎదురైన పరిణామాలపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ద్రౌపది ముర్ము, అక్కడి పరిస్థితులపై చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరమని, అవి తనను తీవ్ర ఆందోళనకు గురిచేశాయని పవన్ పేర్కొన్నారు. సంతాల్ సామాజిక వర్గం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ఒక సదస్సును నిర్వహించినప్పుడు, అందులో ఆ వర్గానికి దక్కాల్సిన గౌరవం, ప్రాధాన్యత కచ్చితంగా ఉండాలని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఎవరి కోసమైతే ఈ సదస్సును ప్రత్యేకంగా ఏర్పాటు చేశారో, ఆ సంతాల్ కమ్యూనిటీకి చెందిన సభ్యులే ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తడం అత్యంత విచారకరమని ఆయన అన్నారు. ఇలాంటి సాంస్కృతిక సమావేశాలు అందరినీ కలుపుకుపోయేలా, సున్నితత్వంతో కూడిన పరిపాలనా ప్రణాళికతో జరగాలని హితవు పలికారు. ముఖ్యంగా భారత రాష్ట్రపతి పదవి అనేది దేశంలోనే అత్యున్నత రాజ్యాంగ పదవి అని, ఆ పదవికి, ఆ వ్యవస్థకు ఎల్లప్పుడూ అత్యున్నత గౌరవం దక్కాలని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. రాష్ట్రపతి పర్యటన అంటే ఎంతో హుందాగా, పకడ్బందీగా జరగాలని, అది ఆయా రాష్ట్రాల అధికార యంత్రాంగం బాధ్యత అని స్పష్టం చేశారు. రాష్ట్రపతి పర్యటనలో ప్రొటోకాల్, మర్యాదలకు భంగం వాటిల్లడం సరికాదన్నారు. భారతదేశ అస్తిత్వంలో, మన దేశ ఖ్యాతిలో గిరిజన సమాజాలు అంతర్భాగమని పవన్ కల్యాణ్ కొనియాడారు. వారి సంస్కృతి, సంప్రదాయాలు, వారి గళానికి ఎల్లప్పుడూ నిజాయతీతో కూడిన గౌరవం లభించాలన్నారు. గిరిజనుల మనోభావాలను దెబ్బతీసేలా, రాజ్యాంగ అధిపతికి అసౌకర్యం కలిగించేలా జరిగిన ఈ సంఘటన దురదృష్టకరమని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు జరగకుండా పాలకులు, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

వార్త

ఆకలి రుచి ఎరుగనట్లే, మనకు అత్యవసరమైన దాంట్లో తప్పులు కనిపించవు.

-ఆస్కార్‌వైల్డ్

# నేపాల్ చరిత్ర కొత్త సిరాతో..

నేపాల్‌లో రాజకీయ అనిశ్చితికి వ్యతిరేకంగా గత యేడాది సెప్టెంబర్‌లో 'జెన్ జీ' తిరుగుబాటు ప్రభావం తాజా ఎన్నికలపై పడింది. గురువారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జెన్‌జీ మద్దతున్న రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ విజయపరంపర కొనసాగుతోంది. నేపాల్ రాచరికం అంతరించాక ఏర్పడిన అన్ని ప్రభుత్వాలూ ఎప్పటికప్పుడు తమ నేతను మార్చుకోవడంలోనే కాలం గడిపేసాయి. సుదీర్ఘకాల రాజకీయ అస్థిరతతో కొనసాగిన నేపాల్ ప్రభుత్వానికి పటిష్ట పాలన చేయగల సమర్థుడు, సరైనోడి అవసరముంది. ఎన్నిసార్లు ప్రభుత్వాలు మారినా మళ్లీ మళ్లీ మార్పు కోరుకోవడంతో నేపాల్ రాజకీయాలు భ్రష్టుపట్టాయి. గత 18ఏళ్ల వ్యవధిలో 14 ప్రభుత్వాలు మారాయి. ఒకప్పుడు హిందూ రాజ్యంగా ఉన్న నేపాల్ తరచు రాజకీయ అనిశ్చితిలో ఉండడం భారతదేశానికి కునుకు పట్టని పరిస్థితి. ఈసారి ఎన్నికలు, ఓటింగ్ సరళి, ఓట్లలెక్కింపు ఫలితాలను చూస్తే పటిష్ట ప్రభుత్వానికి పట్టం కట్టారన్న విషయం ద్యోతకమవుతోంది. కొత్త రాజకీయ ధోరణులకు జనాదరణ ఎక్కువగా లభించింది. స్ట్రక్చరల్ ఇంజినీర్ బాలేంద్ర షా మంచి గాయకునిగా గుర్తింపు పొందినవ్యక్తి. తన పాట కచేరీల్లో ప్రధానంగా అవినీతి అసమానతలు, యువత ధోరణి వారికి అవసరమైన అంశాలను లేవనెత్తడంతో యువతలో మార్పు వచ్చింది. అంతేగాక ఆయన తలపనితలంపుగా రాష్ట్రీయ స్వతంత్ర పార్టీకి నేతృత్వం వహించడంతోవారికి ఆశాజనకంగా మారింది. సామాజిక మాధ్యమాల్లో పాల్గొంటూ బాలేంద్ర షా ఎంతో చైతన్య శీలిగా యువతను ఆకర్షించారు. ఖాట్మండు మేయర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినా ఘన విజయం అందుకోగలిగారు. దీనికి తోడు మేయర్‌గా షా తీసుకున్న నిర్ణయాలు యువతను ఆకర్షించాయి. నగరంలో అక్రమ నిర్మాణాలను కూలగొట్టడంతో ఆయన 'హీరో' అయ్యాడు. నేపాల్‌లో ప్రాబల్యమున్న కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ఇంతటి వెనుకంజ వేస్తాయని ఎవరూ ఊహించలేరు. చాన్నాళ్లుగా ఇరు పార్టీలు చెరిసగం ఓట్లను పంచుకుంటూ రాజకీయ అనిశ్చితికి కారణమవడం 'జెన్ జీ' యువత వైఖరిని మార్చింది. అందుకే వారు ఆయా పార్టీ ప్రభుత్వాల పాలన మీద తిరుగుబాటు బావుటానెగురవేసిన విషయం విదితమే. సంప్రదాయ పార్టీలతో విసిగిపోయిన జెన్‌జీ యువతకు ఆర్‌ఎస్‌పి ఆశాజ్యోతిలా కనిపించింది. కాంగ్రెస్, కమ్యూనిస్టుల పాలన నేపాల్ జనం ఎన్నో చేదు అనుభవాలు చవిచూసింది. ఆయా పార్టీలను బాలేంద్ర షాపార్టీ కదిలించగలిగింది. ఆర్‌ఎస్‌పి అభ్యర్థులు అధిక నియోజకవర్గాలలో ఆది నుంచీ లీడింగ్‌లో ఉన్నారు. మొత్తం 165 నియోజకవర్గాల్లో 110లో పోటీలోఉన్న అభ్యర్థులుఆధిక్యతలో కొనసాగుతున్నారు. బాలేంద్ర షా కూడా జాపా-5 నియోజకవర్గంలో తన సమీప ప్రత్యర్థి సిపిఎన్-యూఎంఎల్ పార్టీ అధ్య క్షుడు, నాలుగుసార్లు ప్రధానిగా పనిచేసిన కె.పి శర్మ ఓలీపై గెలిచారు. ఆదేశంలో జెన్‌జీ నిరసనలు జరిగినప్పు డే ఓలీ ప్రభుత్వం కూలిపోయింది. కానీ ఈ ఎన్నికల్లో ఓలీ కూడా ఓటమి పాలవడం చెప్పుకోదగిన విషయం. ఆయన మీద ప్రజల్లో గూడుకట్టుకున్న వ్యతిరేకతకిదే సాక్ష్యం. 'జెన్‌జీ' తిరుగుబాటు తర్వాత జరిగిన తొలిసాధారణ ఎన్నికలివే. పార్లమెంటులోని ప్రజా ప్రతినిధుల సభలో 275 స్థానాలుండగా వాటిలో 165 స్థానాలకే ప్రత్యక్ష ఎన్నిక జరుగుతుంది. తక్కిన 110 స్థానాలకు దామాషా ప్రాతిపదికన ఎన్నిక ఉంటుంది. నేపాలీ కమ్యూనిస్టు నేత పుష్ప కమల్ 'ప్రచండ' మాత్రం విజయం సాధించారు. ఏక మొత్తంగా ఆర్‌ఎస్‌పి క్లీన్‌స్వీప్ చేసింది. ఆపార్టీ అధ్యక్షుడే ఇప్పుడు ప్రధాని కానున్నారు. ఆయన వయస్సు 35ఏళ్లు కాగా భారత్‌కు వ్యతిరేకిగా పేరుంది. నేపాల్‌లో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడాలని కోరుకున్న భారత్ అక్కడి ఎన్నికల ఫలితాలపై మొదటి నుంచి ఎదురుచూస్తోంది. కొత్త ప్రభుత్వంతో పరస్పర ప్రయోజనాల రీత్యా కలిసి నడవాలని భారత్ ఇప్పటికే సిద్ధమైంది. నేపాల్‌లో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడి, శాంతి అభివృద్ధి చెందుతుందన ఆశావాహ దృక్పథంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా నడపడం కోసం లాజిస్టక్ సౌకర్యాన్ని కూడా భారత్ అందచేసింది. కానీ కొత్తపార్టీ కొత్త నేతలు భారత్‌తో కలిసి వచ్చేందుకు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి. పూర్తి ఫలితాలు రావడం, ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పడ్డాక కానీ వారివైఖరి తెలియదు. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీని 2022లో రవిలమిచ్చేన్ స్థాపించారు. కాగా ఈ యేడాదిజనవరి 18న అదే పార్టీలో చేరిన బాలేంద్ర షాకు ప్రధాని అభ్యర్థిత్వం జాక్‌పాట్ తగిలినట్లే. నేపాల్ ఎన్నికలు ఆ దేశ రాజకీయాలను మలుపు తిప్పే రోజొచ్చింది. సంప్రదాయ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల తరపున పోటీచేసిన పాత ముఖాలు బరిలో ఉన్నా గెలిచే స్థాయి లేదనే విషయం తేలిపోయింది. పాత పాలకుల్లో అవినీతి ఆరోపణలున్నాయి. ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి పేరుకుపోయిందన్న విమర్శలూ ఉన్నాయి. తొలుత సామాజిక మాధ్యమాలను నేపాలీ ప్రభుత్వం నిషేధించిన తరుణంలో ప్రజాగ్రహం పెల్లుబికిన విషయం తెలిసిందే. అదే 'జెన్‌జీ' మహోద్యమంగా పేరొందింది. ఈ ఉద్యమాన్ని అణచి వేసే సందర్భంలో పోలీసుకాల్పుల్లో దాదాపు వందమంది మృతి చెందారు. ఓలి ప్రభుత్వం కుప్పకూలింది. ఆ సందర్భంగా కొన్ని రాజకీయపార్టీల్లో ప్రముఖులు పలు సంస్కరణలతో తాము పునీతులమయ్యామని చెప్పసాగారు. అయినా దేశంలో పెచ్చుపెరిగిన సామాజిక రుగ్మతల నుంచి కాపాడలేని ఏ సంస్కరణలనూ అంగీకరించబోమని ఆనాడే చెప్పారు. అదే వ్యతిరేకత ఇప్పుడు ప్రతిబింబించింది. బాలేంద్ర షా పాలనను నేపాల్ చూడబోతోంది.

అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.



శ్రీరమణ మహర్షి

అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగించుకోవడంలోనే అసలు సమస్య ఉంటుంది.



రామకృష్ణ పరమహంస

# ప్రజావాక్కు



## కృత్రిమ మేధ ఒక ముప్పు

**భారతదేశం** ప్రపంచ వేదికపై తన సాంకేతిక ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలంటే, విస్తృత స్థాయిలో కృత్రిమ మేధ పరిష్కారాలను స్వీకరించడం, మానవ వనరుల నైపుణ్యాలను పెంపొందించడం అత్యంత ఆవశ్యకం. ప్రస్తుత పరిస్థితుల్లో సాఫ్ట్‌వేర్ సేవల రంగానికి కృత్రిమ మేధ ఒక ముప్పు అని భావించడం తప్పు. వాస్తవానికి ఇది ఉత్పాదకతను, ఆవిష్కరణలను సమస్య పరిష్కార సామర్థ్యాలను రెట్టింపు చేసే ఒక శక్తివంతమైన సాధనం. నేడు అనేక సంస్థలు తమ విలువైన కార్యకలాపాల్లో కృత్రిమ మేధను అంతర్భాగం చేస్తున్నాయి. దీనివల్ల పనిలో ఖచ్చితత్వం పెరగడమే కాకుండా, సృజనాత్మకతకు కొత్త ద్వారాలు తెరుచుకుంటున్నాయి. భారతదేశంలో ఇప్పటికే అనేక అంతర్జాతీయ భాగస్వామ్యాలు కృత్రిమ మేధ ఆధారిత అభివృద్ధిపై దృష్టిసారించడం మనసాంకేతిక సామర్థ్యంపై ప్రపంచానికి ఉన్న నమ్మకానికి నిదర్శనం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## మేకపోతు గాంభీర్యం

**శాసనసభ,** లోక్‌సభ ఎన్నికలుజరిగిన సమయంలో బిజెపికి చెందిన మహానేతలు, ముఖ్యమంత్రులు తెలంగాణకు వచ్చి పట్టణాల్లో, పల్లెల్లోసందుల్లో గొందుల్లో తిరిగి ప్రచారం చేశారు. అయినా ఆఎన్నికల్లో బిజెపి సింగిల్ డిజిట్‌కే పరిమితమయింది. ఆ తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచే తీరాలనేపట్టుదలతో పనిచేసినా ఫలితం దక్కలేదు. రెండు ఉపఎన్నికల్లోనూ బిజెపికి డిపాజిట్ పనిచేసినా దక్కని పరిస్థితి. పల్లెపోరు, పట్టణ పోరులోను ఆ పార్టీ అత్యధిక స్థానాల్లో ఓటమిపాలైంది. తెలంగాణలో జరుగుతున్న ఏఎన్నికల్లోనూ బిజెపిప్రభావం చూపలేకపోతోంది.

- శాస్త్రి, హైదరాబాద్

## మారిన తమిళ రాజకీయాలు

**తమిళ్నాడులో** ఎన్నికలు ముంచుకోస్తున్న వేళ రాజకీయ చిత్రాలుమారిపోతున్నాయి. అమ్మకునమ్మినబంటుగా ఉన్న పన్నీరు సెల్వం ద్రావిడమున్నెట కాజగంలో చేరడం ఒక గొప్పమలుపు జయలలిత ఉన్నప్పుడు నెంబర్ 2గా ఉన్న పన్నీరుపళని రాకతో పలుచబడిపోయాడు. ఇక చిన్నమ్మ పునరాగమానం విజయ్‌రాకతో తమిళనాడు రాజకీయాలు తమిళ పాయసం లాగా మారాయి.

- భారత అవినాష్, జనగామ

## పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

**నడుస్తున్న** వేసవిలో రాబోయే రోజుల్లో బాగా ఉష్ణోగ్రతలు పెరగనున్నవి. ప్రకృతి ద్వారా వచ్చే సహజ ఇబ్బందులు మన నియంత్రణ ప్రమేయం లేదు. సాధారణ ఉష్ణోగ్రత కన్నా ఆరు డిగ్రీలు అధికంగా నమోదైనవి. బయట పనికి వెళ్లేవారికి ఎక్కువ ఇబ్బంది ఉంటుంది. వారు వ్యక్తిగత జాగ్రత్తతోపాటు నగర కార్పొరేషన్ వారు ప్రతియేటా ఏర్పరిచే చలివేంద్రాలు, వాటికి సరిపడ నీరు ఏర్పాట్లు ముఖ్యం. స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వాములుగా మరికొన్ని అదనంగా పెట్టవచ్చు. ఇంటిలో త్రాగునీరు మితంగా వాడాలి. వృధా చేయరాదు. రోగులు, వృద్ధులు ఒకరి సహాయంతో బయటకు తప్పనిసరి ఐతే వెళ్ళాలి. ఆరోగ్య శాఖ వారి సూచనలు పాటించాలి. ఇవి సాధారణమే గాని కాస్త ఆచరణ లోపిస్తే దాని దుష్ఫలితం తెలుస్తుంది. నీరు, ఆహారంతోనే ప్రాణం.

- బొల్లోజు మేఘానాదం, విశాఖపట్నం

## దోపిడీయే ప్రధాన అజెండా

**అందమైన** సూటు వేసుకున్న అస్తిపంజరం లాంటిదే అమెరికా ఆర్థిక పరిస్థితి. ఆయుధాలు అమ్మకం ఆయుధాలు తయారీ, సరఫరామీదవారి ఆదాయం ఆధారపడిఉంటుంది. ఒక తుపాకీ పట్టుకున్న వ్యక్తి ఎదురుగా ఉన్న వ్యక్తులను కాల్చుతాడు. సహనం చచ్చిపోయిన తర్వాతతనకు తానే కాల్చుకుంటాడు. పుట్టిన వారికి మరణం తప్పదు, మరణించిన వారికి జననం తప్పదు. జనన మరణాలు చక్ర భ్రమణాలు. అయితే జనన మరణాలు ప్రకృతి సిద్ధంగా జరగాలి. సహజంగా ఉండాలి. అమెరికా తమ శత్రుదేశాలుగా భావించి, ప్రకటించిన రష్యాపైన, చైనాపైన డైరెక్ట్‌గా యుద్ధం ప్రకటించదు. సహజ వనరులుఎక్కడైతే ఉన్నాయో, ఆదేశాల మీద ఆదేశాల నాయకులు మీద ఆదేశాల ప్రజల మీద దాడి, దోపిడీ చేస్తారు. సహజ వనరుల దోపిడీ మాత్రమే వాళ్ల ప్రధాన ఎజెండా.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## భూకబ్జాలను ఆపాలి

**తెలంగాణ** రాష్ట్రంలోని మండల కేంద్రాలలో ఉన్న ఎస్సీ, ఎస్టీ కాలనీలలో భూకబ్జాలు భూ ఆక్రమణలు అక్రమ కట్టడాలు జరుగుతున్నాయి. న్యాయంకోసం పోలీస్‌స్టేషన్, రెవెన్యూ అధికారులకు, ఎస్సీ, ఎస్టీ కమిషన్, వికలాంగుల సంక్షేమ శాఖ, జిల్లా కలెక్టర్‌లకు కూడా ఫిర్యాదు చేసినా కూడా సమస్యలు పరిష్కారంకావడం లేదు. సంవత్సరాలు గడిచినా కూడా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

మనవి

**ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అగ్రరాజ్యం యుద్ధ దాహం తీరేదెన్నడు?

**అమెరికాను ఎదురించిన వీరుడిగా ఖమేనీని కొంతమంది అభివర్ణిస్తే, మానవ హక్కులను హరించి, వేలాది మందిని హతమార్చిన క్రూరమైన నియంతగా మరికొంతమంది విమర్శిస్తూపోస్టులు పెట్టడం జరిగింది. బాలికలను, మహిళలను మత చాంధస వాదంతో నిర్బంధానికి గురిచేసి వారి స్వేచ్ఛను, హక్కులను కాలరాసాడని ఇంకొంతమంది వాదించారు. ఏదిఏమైనప్పటికీ ఇప్పటికైనా ఇరాన్ వైఖరిలో మార్పురావాలి. ఆర్థికంగా బలహీనంగా తయారైన అమెరికా కేవలం టెక్నాలజీ సహాయంతో ప్రపంచదేశాలను బెదిరించడం అనుచితం. ఆయుధ బలం, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచాన్ని తమ గుప్పెట్లో పెట్టు కోవాలని అగ్రదేశాలు విశ్వప్రయత్నం చేస్తున్నాయి. యుద్ధాలను ప్రోత్సహిస్తున్నాయి. పలుదేశాలు అమెరికా భజన చేయడం గమనార్హం. ఇతర దేశాలకు తలవంచిన నాడు భవిష్యత్తులో తలదించుకునే పరిస్థితులు ఏర్పడతాయి.**



సుంకవల్లి సత్తిరాజు

స్ట్రయిట్ ఆఫ్ హార్ముజ్ వర్తమాన ప్రపంచాన్ని గజగజా వణికిస్తున్నది. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దేశాలు సంయుక్తంగా గతకొద్ది రోజులుగా నిర్వహిస్తున్న 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' భయోత్పాతాన్ని సృష్టిస్తున్నది. ఈ యుద్ధానికి ఎటువంటి సంబంధం లేని దేశాలు కూడా ఆర్థికంగా అతలాకుతలమైపోతున్నాయి. ప్రస్తుత యుద్ధానికి సంబంధం లేని దేశాలను అమెరికా, ఇజ్రాయిల్‌లు సంక్షోభంలో నెట్టాయి. ప్రపంచంలోని పలు దేశాల చమురు దిగుమతులకు హార్ముజ్ జలసంధి కీలకంగా మారిన నేపథ్యంలో ఇక్కడ చిక్కుకున్న సుమారు 700 నౌకల్లో 37 నౌకలు భారత దేశానికి చెందినవి. అమెరికా, ఇజ్రాయిల్, ఐరోపా దేశాలకు హార్ముజ్ జలసంధిలో ప్రవేశం లేదని ఇప్పటికే ఇరాన్ ప్రకటించింది. ఈవిషయంలో భారత్ పట్ల ఇరాన్ సుహృద్భావాన్నే ప్రదర్శించిందనే చెప్పాలి. ఇక్కడ నుండి భారత్‌కు యథావిధిగా చమురు సరఫరా జరిగే అవకాశాలున్నాయా? అనే విషయం పరిశీలించవలసి ఉంటుంది. హార్ముజ్ జలసంధి వద్ద చమురు ట్యాంకర్లకు రక్షణ కల్పిస్తామని, ఇన్సూరెన్స్ పేరుతో ట్రంప్ నాటకాలాడుతున్నాడు. అమెరికా ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం వలన పలుదేశాలు చేదు అనుభవాలను చవిచూడవలసి వస్తున్నది. ఇజ్రాయిల్‌తో రక్షణ సంబంధాలున్న దేశాలను సైతం ఇరాన్ వదలడం లేదు. అజర్ బైజాన్ విమానాశ్రయం పైనా ఇరాన్ దాడులు చేసింది. ఇజ్రాయిల్‌తో సంబంధాల కారణంగా తనతో సన్నిహితంగా మెలగిన దేశాలను సైతం ఇరాన్ విడిచిపెట్టడం లేదు. ఇరాన్ అజర్ బైజాన్, టర్కీలపై కూడా దాడులు చేయడం జరిగింది. బహ్రెయిన్ ఆయిల్ రిఫనరీలపై ఇరాన్ దాడులు చేస్తున్నది. దుబాయ్, కువైట్, ఖతార్ లాంటి గల్ఫ్‌దేశాల్లో ఉన్న కోటి మంది భారతీయుల భవిష్యత్తు ఏమిటి? వారంతా క్షేమమేనా? ఇంకా ఉద్రిక్తతలు పెరిగితే వారి పరిస్థితిఏమిటి? ఇప్పటికే వందలాది మందిచనిపోయిన ఈయుద్ధం రానున్న రోజుల్లో మరింత మంది చావుకు దారితీయవచ్చు. అమెరికా స్థావరాలపైన, ఇజ్రాయిల్ పైన, గల్ఫ్ దేశాలపైన గురి పెడుతున్న ఇరాన్ ప్రస్తుతం హార్ముజ్ జలసంధిలో నిలిచిపోయిన చమురు నౌకలకు ముప్పుతేనుందా? అందుకే భారత ప్రభుత్వం ఆలస్యమైనా ఖమేనీ మృతికి సంతాపం తెలిపిందా? హిందూ మహా సముద్రంలో ఇరాన్ నౌకపై అమెరికా పాల్పడిన అరాచకాన్ని ఇరాన్ క్షమిస్తుందా? ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధానికి ప్రతీకారంగా ఈ రెండు దేశాలు రక్తాన్ని చిందించవలసి వస్తుందని ఇరాన్ హెచ్చరిక చేసింది. హార్ముజ్ జలసంధిలో నిలిచి పోయిన 700 నౌకల్లో 37 భారత్‌కు చెందినవి. భారత్ వైఖరిని ఇరాన్ సానుకూల దృక్పథంతో అర్థం చేసుకుని విడిచి పెట్టవచ్చు. ఇతర దేశాలపై ప్రతీకారం తీర్చుకునే అవకాశాలే మెండు. ఇరాన్ ప్రజలు కూడా గతంలో మాదిరిగా అమెరికాకు సానుకూల స్పందన తెలియ చేయడం లేదు. ఖమేనీ మృతితో సంబరాలు చేసుకున్న ఇరాన్ ప్రజలు, మహిళల్లో నేడు అదేఉత్సాహం కనిపించడం లేదెందుకని? 13 దేశాలకు విస్తరించిన యుద్ధంవలన చమురు ధరలు పెరిగిపోతున్నాయి. అమెరికా మాదిరిగా సుదీర్ఘ కాలం ఉండే ఆయిల్ రిజర్వ్ భారత్‌లో లేవు. భారత ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడానికి యుద్ధాలు చేటు. కేవలం ఆపద సమయంలో 20రోజులకు సరిపడే ఆయిల్ నిల్వలు భారత దేశ అవసరాలను తీర్చలేవు. రష్యా ఇప్పటికే భారత్‌కు చమురు సరఫరా చేస్తానని ప్రకటించగా, అందుకు అమెరికా 30రోజుల వరకు భారత్ రష్యా నుండి చమురు



కొనుగోలు చేయడానికి అనుమతినిచ్చింది. భారత్ చమురు కొనుగోలులో అమెరికా పెత్తనమేమిటి? ఈవిషయంలోభారత ప్రజలు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న మాట వాస్తవం. ఈ ప్రపంచంలో చాలా దేశాలు అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారిపోయాయి. చివరికి గల్ఫ్ దేశాలు కూడా అమెరికాకు పాదాక్రాంతమైనాయి. అమెరికాకు ఎదురు చెప్పగల ధైర్యం, ఎదురించగల సాహసం రష్యా, చైనా, ఉత్తర కొరియాలకు మాత్రమే ఉందని అనుకున్నప్పటికీ వారుకూడా కేవలం హెచ్చరికలకే పరిమితమైనారు. ఈ మూడు దేశాలు అమెరికా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పనిచేసి, ఇరాన్‌కు మద్దతుగానిలిస్తే యుద్ధ స్వరూపమే మారిపోయిఉండేది. మూడవ ప్రపంచ యుద్ధమే సంభవించి ఉండేది. పరిస్థితులు అంత దూరం రానందుకు సంతోషించాలి. నాటో మిత్రదేశాలను తూలనాడిన ట్రంప్‌కు ఆయా దేశాల నుండి సరైన స్థాయిలో ప్రతిస్పందన రాలేదు. స్పెయిన్‌ను ట్రంప్ తీవ్ర స్వరంతో హెచ్చరించాడు. తన మాట వినకపోతే ప్రాణాలు పోవడం తప్ప ఏమీ మిగలదని ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించారు. ఇరాన్ సుప్రీం లీడర్‌ని కూడా తానే ఎంపిక చేస్తానని ట్రంప్ పేర్కొనడం భావ్యంగా లేదు. వెనిజులా విషయంలో కూడా ట్రంప్ ఇదే ధోరణి అవలంభించారు. ఇరాన్ యుద్ధం ముగిసాక, క్యూబా తన తదుపరి లక్ష్యమని ట్రంప్ పేర్కొనడం మారని ట్రంప్ యుద్ధోన్మాదానికి పరాకాష్ట. ఇరాన్ ఖమేనీని కోల్పోయినప్పటికీ ఇప్పటి వరకు అమెరికా ఇజ్రాయిల్ దేశాలను ధీటుగానే ఎదుర్కొంటున్నది. అతి తక్కువ ఖర్చు గల డ్రోన్ల సాయంతో ఇరుదేశాల క్షిపణులను, ఇతర ఆయుధాలను ఇరాన్ తుత్తునియలు చేస్తున్నది. ఇప్పటికేఅమెరికా, ఇజ్రాయిల్ లు ఇరాన్ పై దాడికి భారీ మొత్తంలో ఖర్చు చేసినట్టు తెలుస్తున్నది. అమెరికా క్షిపణి నిల్వలు తగ్గుతున్న దృష్ట్యా తక్షణమే యుద్ధానికి అవసరమైన ఆయుధాల ఉత్పత్తిని ప్రారంభించాలని అమెరికా తన రక్షణ శాఖను ఆదేశించినట్టు వార్తలు వెలువడ్డాయి. ఇప్పటికే రష్యా, ఉక్రెయిన్ యుద్ధంతో ఆర్థికంగా కుదేలైన అమెరికా ఇరాన్‌పై దాడులు చేస్తూ ప్రపంచ దేశాలను ఆర్థికంగా దివాలా తీయించడం, పులి మీద పుట్రలా ఇప్పటికే ఆర్థిక మాంద్యంతో అల్లాడుతున్న దేశాల ఆర్థిక స్థితిగతులను అధ్వాన్నంగా మార్చడం తగని పని. గల్ఫ్ దేశాలు తమ ఆహారం కోసం దిగుమతులపై అధారపడి ఉన్నందున కోట్లాది మందికి ఆహారసరఫరా ఆగిపోయే పరిస్థితులున్నాయి. యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో భారత ఆర్థిక వృద్ధి రేటు స్వల్పంగా క్షీణించవచ్చునని, రూపాయి పతనం కూడా పెద్దగా ఉండబోదని రిజర్వ్ బ్యాంకు, ఆర్థిక నిపుణుల అంచనాలు. యుద్ధ ప్రభావం వలన భారత దేశానికి వచ్చే ముప్పేమీ లేదని అంచనా. అయితే ఈ యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే భారత్ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశాలున్నాయి. విశాఖలో జరిగిన నౌకా విన్యాసాల్లో పాల్గొని, తిరుగుదశలో ఉన్న ఇరాన్ యుద్ధనౌకను అమెరికా శ్రీలంక సమీపంలో విధ్వంసం చేయడం యుద్ధాన్ని హిందూ సముద్ర జలాలకు విస్తరించడమే కదా? దీనిపై భారత్ స్పందనం ఏమిటి? భారత్‌కువచ్చిన ఇరాన్ నౌకను టార్పెడోతో ముంచేసుమారు 100మందిని చంపే అధికారం అమెరికాకు ఎవరిచ్చారు? ఖచ్చితంగా ఇది భారత పరువు ప్రతిష్టలను అంతర్జాతీయంగా మంటపెట్టే ట్రంప్ కుట్రే. భారత్‌ను వివాదంలోకి లాగడమే. ఇరాన్ విషయంలో భారత్ అనుసరిస్తున్న వైఖరికి అనుకూలంగా కొందరు, ప్రతికూలంగా మరికొందరు ప్రతిస్పందిస్తున్నారు. ఇరాన్ సుప్రీం ఖమేనీ అంతమైనతర్వాత కొన్ని చోట్ల నిరసనలు, మరికొన్ని చోట్ల సంబరాలు చేసుకోవడం జరిగింది. ఇరాన్‌ను సమర్థించే వారంతా ఇండియాను వదలిపెట్టి, ఇరాన్ వెళ్లి పోవాలంటూ కొంతమంది, ఇరాన్ మనకు మిత్ర దేశమంటూ కొంతమంది సోషల్ మీడియా వేదికగా ఖర్చులేని మాటల యుద్ధం చేసారు. అమెరికాను ఎదురించిన వీరుడిగా ఖమేనీని కొంతమంది అభివర్ణిస్తే, మానవ హక్కులను హరించి, వేలాది మందిని హతమార్చిన క్రూరమైన నియంతగా మరికొంతమంది విమర్శిస్తూపోస్టులు పెట్టడం జరిగింది. బాలికలను, మహిళలను మత చాంధస వాదంతో నిర్బంధానికి గురిచేసి వారి స్వేచ్ఛను, హక్కులను కాలరాసాడని ఇంకొంతమంది వాదించారు. ఏదిఏమైనప్పటికీ ఇప్పటికైనా ఇరాన్ వైఖరిలో మార్పురావాలి. ఆర్థికంగా బలహీనంగాతయారైన అమెరికా కేవలం టెక్నాలజీ సహాయంతో ప్రపంచదేశాలను బెదిరించడం అనుచితం. ఆయుధ బలం, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవాలని అగ్రదేశాలు విశ్వప్రయత్నం చేస్తున్నాయి. యుద్ధాలను ప్రోత్సహిస్తున్నాయి. పలుదేశాలు అమెరికా భజన చేయడం గమనార్హం. ఇతర దేశాలకు తలవంచిన నాడు భవిష్యత్తులో తలదించుకునే పరిస్థితులు ఏర్పడతాయి. ●

# పసి పిల్లలకు పాలే శాపమా?

మేకిరి దామోదర్

పాలు మనిషి జీవితంలో తొలి ఆహారం. పుట్టిన శిశువు నుంచి వృద్ధుడి వరకూ ప్రతి దశలోనూ పాలు కీలక పాత్ర పోషిస్తాయి. అందుకే వాటిని 'సంపూర్ణ ఆహారం'గా పరిగణిస్తారు. రోజువారీ జీవనానికి కావలసిన శక్తి, ఎదుగుదలకు అవసరమైన ప్రోటీన్లు, ఎముకల దృఢత్వానికి అవసరమైన క్యాల్షియం, ఫాస్ఫరస్, శరీర క్రియల సమతుల్యతకు కీలకమైన విటమిన్ బి-12 వంటి అనేక పోషకాలు పాలలో సమృద్ధిగా లభిస్తాయి. పిల్లల ఎదుగుదలలో, దంతాలఆరోగ్యంలో, కండరాల నిర్మాణంలో పాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతారు. నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి, రోగనిరోధక శక్తి పెరగడానికి కూడా పాలు దోహదపడతాయి. రాత్రిపడుకునే ముందు గ్లాస్‌పాలుతాగితే నిద్ర బాగా పడుతుందనే విశ్వాసం కూడా సామాన్యప్రజల్లో బలంగా ఉంది. పాలు కేవలం పానీయంగా మాత్రమే కాదు, టీ, కాఫీ, పెరుగు, మజ్జిగ, నెయ్యి, స్వీట్లు వంటి అనేక ఆహార పదార్థాల మూలాధారం. ప్రాంతీయ భోజన అలవాట్లు ఎంత భిన్నంగా ఉన్నా, పాల వినియోగంలోమాత్రం దేశవ్యాప్తంగా ఒక సామాన్యత కనిపిస్తుంది. పౌష్టికాహారంగా పాలను పిల్లలకు తప్పనిసరిగా అందించడం, పెద్దలు రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం సాధారణం. ఆయుర్వేదంలో కూడా పాలను ఔషధంగా వినియోగిస్తారు. కొన్ని రకాల వ్యాధులను నివారించడంలో పాలు ఉపకరిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే, ఈ సమగ్ర ఆహారమే నేడు ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతోందనే ఆందోళన పెరుగుతోంది. కారణం పాల కల్తీ. పాడి పరిశ్రమలో పెద్దభాగం ఇంకా అసంఘటిత రంగంలోనే కొనసాగుతోంది. సరైన పర్యవేక్షణ లేకపోవడం, నియంత్రణలోపాలు, అధిక లాభాల దాహం స్వార్థంతోడై పాలకల్తీకి మార్గం సుగమం చేస్తున్నాయి. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో కల్తీ పాలు తాగి ప్రజలు అనారోగ్యానికి గురైన ఘటనలు వెలుగుచూశాయి. ఈ దారుణాలు సమాజాన్ని కలవరపరుస్తున్నాయి. అధిక ఉత్పత్తి కోసం పశువులకు అనుచితంగా ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు ఇవ్వడం నుంచి, కాలం చెల్లిన పాలపొడి, పామ్ ఆయిల్, యూరియా, నీరు కలిపి కృత్రిమ పాలు తయారు చేయడం వరకు అనేక అక్రమాలు జరుగుతున్నాయి. గంజిపొడి, హైడ్రోజన్ పెరాక్సైడ్, కాస్టిక్ సోడా, వంట సోడా, డిటర్జెంట్లు, మెలమైన్, మాల్టో డెక్స్ట్రిన్ వంటి రసాయనాలను కలిపి పాలను చిక్కగా, తెల్లగా కనిపించేలా చేసి విక్రయించడం ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదం. ఇటువంటి కల్తీ పదార్థాలు శరీరంలోకి వెళ్లినప్పుడు అజీర్తి, కడుపునొప్పి, వాంతులు వంటి తక్షణ సమస్యలు తలెత్తడమే కాదుదీర్ఘకాలంలో మూత్రపిండాల వైఫల్యం, కాలేయ సమస్యలు, నాడీ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీసే అవకాశముంది. అధికారిక గణాంకాల ప్రకారం గత కొన్నేళ్లలో దేశవ్యాప్తంగా వేలాది పాల కల్తీ కేసులు నమోదయ్యాయి. అనేక కేసుల్లో జరిమానాలు, శిక్షలు విధించినా, శిక్షల తీవ్రత తక్కువగా ఉండటం వల్ల నేరగాళ్లకు భయం కలగడం లేదు. లాభాల ఆశతో ప్రజల ఆరోగ్యాన్ని పణంగాపెట్టే ఈ అక్రమవ్యాపారం కొనసాగుతూనే ఉంది. 'తెల్లనివన్నీ పాలు కావు' అన్న జాగ్రత్త స్పృహ ప్రతి వినియోగదారుడిలో కలగాలి. కల్తీ పాలను గుర్తించడం సాధారణ ప్రజలకు సులభం కాదు. కానీ రంగు, వాసన, రుచి, చిక్కదనంలో అనుమానాస్పద మార్పులు కనిపిస్తే అప్రమత్తం కావాలి. అనుమానాస్పద ఉత్పత్తులను సంబంధిత ఆహార భద్రతశాఖలకు ఫిర్యాదు చేయడం ప్రతిపౌరుడి బాధ్యత. సరైన లైసెన్సులు ఉన్న, నాణ్యత ప్రమాణాలు పాటించే సంస్థల నుంచే పాలను కొనుగోలు చేయాలి. ప్యాకేజింగ్‌పై తయారీ తేదీ, గడువు తేదీ, ప్రమాణ చిహ్నాలు పరిశీలించడం అలవాటు చేసుకోవాలి. ఆహార భద్రత విభాగాల్లో ఖాళీలను భర్తీచేయడం, ప్రయోగశాలల సంఖ్య పెంచడం, ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం, కఠినశిక్షలు అమలు చేయడం ద్వారా మాత్రమే ఈ కల్తీదందాను అరికట్టవచ్చు. కల్తీ పాల తయారీని తీవ్రనేరంగా పరిగణించి కఠిన కారాగార శిక్షలువిధించేలా చట్టాలను అమలు పరచాలి. పశువుల సంక్షేమా న్ని కాపాడే చర్యలతో పాటు పాడి పరిశ్రమను మరింత పారదర్శకంగా మార్చాలి. కల్తీ ఆహారాల కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురైతే వైద్యవ్యయాలుపెరుగుతాయి, ఉత్పాదకత తగ్గుతుంది, కుటుంబాల ఆర్థికస్థితి దెబ్బతింటుంది. ప్రజారోగ్యాన్ని కాపాడడం అంటే కేవలం వ్యక్తిగత ఆరోగ్యమే కాదు దేశఆర్థిక భద్రతను కూడా కాపాడడం. ●

# బాలల భవితకు కొత్తదారి డిజిటల్ విద్య

వివి రమణ

ప్రస్తుత కాలం డిజిటల్ మయంగా ఎంత వేగంగా తన రూపును మార్చుకుంటూ రోజురోజుకు ఎంత వరకు పరివర్తన చెందగలుగుతుందో అది గమనించే వారికి సైతం ఊహకు అందని విధంగా ఉన్నదనిపిస్తుంది. పూర్వం పారిశ్రామిక విప్లవం అనేది కొన్ని దశాబ్దాల పాటు కొన్ని ప్రాంతాలకే పరిమితమై ఆ ప్రాంతంలోనే వేగంగా తన అభివృద్ధిని చూపించగలిగింది. కానీ నేటి ఈ డిజిటలికరణకు ఎటువంటి సరిహద్దులు లేకుండా యావత్ భూగోళమే ఒక గ్రామంగా మారిపోవటమే కాకుండా ప్రీ ప్రైమరీ, ప్రైమరీ బాల్యానికి సైతం డిజిటల్ విద్యరూపంలో చెంతకు చేరిందనే విషయాన్ని అర్థవంతంగా తెలియపరుస్తున్నది ఈ డిజిటల్ యుగం. ప్రస్తుతం ఇది టెక్నాలజీ యుగం. కాబట్టి ఈ 'టెక్నాలజీ అనేది విద్యతో కలిసినప్పుడు మాత్రమేజ్ఞానం సమాజానికి శక్తిగా మారుతుంది. అని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వివరించారు. నెల్సన్ మండేలా సైతం విద్య అనేది ప్రపంచాన్నే మార్చే శక్తివంతమైన ఆయుధం అనే వివరించారు. నేడు ఈ 'విద్య'ను డిజిటల్ సాధనాలే ప్రతి వ్యక్తి దగ్గరకు చేరుస్తుందని మనం ఆశాభావం వ్యక్తపరచవచ్చు. ఆకోవలోనే మన జాతీయ విద్యా విధానం 2020 అనేది నేటి బాలలకు డిజిటల్ విద్యను, దాని శిక్షణకోసం అని ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ ద్వారా అందుబాటులో తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుంది. దీని ప్రకారం ప్రీ ప్రైమరీ, ప్రైమరీ వయస్సు నుండే ఐసిటి (ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ)లతో విద్యను అందించడం బోధించడం పిల్లలకు అలవాటు చేయడం లాంటి సరికొత్త విధానాలను అందించేందుకు జాతీయ విద్యా విధానం 2020 సమాయత్తం అవుతుంది. అయితే 'బాలల భవితకు' భద్రత ఆందోళనల దృష్ట్యా యునెస్కో డిజిటల్‌ను ఉపయోగించే విధాన క్రమంలో తగుసూచనలను తెలియపరుస్తుంది. అది ప్రధానంగా నాలుగు విషయాలపై ఫోకస్ చేయడం జరిగింది. సాంకేతిక ఆధారిత ప్రపంచంలో తాజా సమాచారం పొందడానికి ఐసిటి ఉపయోగమనేది ఉపయోగకరం అయినప్పటికీ అధికంగా సాంకేతికతనుఉపయోగించే క్రమంలో విద్యార్థుల శారీరక ఆరోగ్యానికి హానికరమని గమనించబడింది. దీనిని అధిగమించేందుకు డిజిటల్ తీరును అదేవిధంగా పిల్లలు చూసినప్పుడు కంటి సమస్యలు, నిద్ర సమస్యలు, తలనొప్పి, వెన్నెముక సమస్యలు లాంటివి విద్యార్థులు ఎదుర్కోవలసి వస్తుంది. కాబట్టి విద్యార్థులు తల్లిదండ్రులు తగు జాగ్రత్తలను అనుసరించి డిజిటల్



తెరను ఉపయోగించే సమయం తక్కువగాఉండేటట్లు చూసుకోవడం, ఆ సమయంలో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో వారి సూచనలతో సమస్యను అధిగమించి నేటి ప్రపంచంతో పాటు నడవవలసి ఉన్నదని తెలియపరుస్తుంది. ఈ మధ్య కాలంలో చాలామంది విద్యార్థులు ఆరుబయట ఆడే ఆటల కన్నా డిజిటల్ తెరపై ఆడే ఆటలకు సమయాన్ని ఎక్కువ కేటాయించటం జరుగుతుంది. ఇది శారీరక అభివృద్ధిని పూర్తిగా కుంటుపరుస్తుందని యునెస్కో ఆందోళన వ్యక్తపరుస్తుంది. అంతేకాకుండా డిజిటల్ తెరకు అలవాటు పడి స్నేహితులతో పరస్పరం భౌతికంగా ఆలోచనత్మక జ్ఞానం పంచుకోకుండా డిజిటల్ చాటింగ్ ద్వారా సమయాన్ని గడుపుతున్నారు. దీని ద్వారా సామాజిక భావోద్వేగాలకు, విలువలకు దూరమై, వారి ప్రవర్తనలో మార్పు వస్తుంది. అందుచే ఇలాంటి వాటిని సైతం యునెస్కో హితువు పలుకుతూ సూచనలు, జాగ్రత్తలు వివరిస్తూ కొన్ని పర్యవేక్షణల మధ్య తగువిధంగా డిజిటల్ విద్యను అందించవచ్చని అభిప్రాయపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ 19 పరిస్థితుల ప్రభావంగా విద్యార్థుల తరగతులు డిజిటల్ తరగతులుగా మారిన విషయం తెలిసిందే. ఆ సమయంలో మన రాష్ట్రంలో సైతం విద్యార్థులకు ట్యాబ్ల ద్వారా డిజిటల్ విద్యను చేరువ చేయటం జరిగింది. ప్రీ ప్రైమరీ ప్రైమరీ విద్యార్థులు సైతం వినోదం కోసమని పడిన అలవాటు కాస్త ఆన్లైన్ గేమ్ లాంటి హానికరమైన విషయాల వైపు అడుగులు వేసే పరిస్థితులకు లోనవుతున్నారు కాబట్టి ఉపాధ్యాయులు డిజిటల్ విద్య గురించి వివరించే సమయంలో హానికరమైన వెబ్‌సైట్‌ల గురించి, ప్రమాదకరమైన విషయాలను తెలియపరచవలసిన ఆవశ్యకతను యునెస్కో తెలియపరుస్తుంది. యునెస్కో సూచించిన విషయాలలో ఇదొకటి. దీని ప్రకారం మొదటగా ఉపాధ్యాయులు సాంకేతికత వినియోగం అలవాటు పడి, దానిలో ఉన్న ప్రమాదాలను తెలుసుకోవడం కోసం విమర్శణాత్మకంగా ఆలోచన చేయవలసి ఉన్నదని యునెస్కో అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది. బయట ఆడటానికి బదులుగా పిల్లలు మొబైల్ ఫోన్లో లాప్టాప్లో లేదాటీవీల ముందు ఇంట్లోనే ఎక్కువ సమయం గడపడం ఇష్టపడుతున్నారు. ఈ విధానం శారీరకంగా మానసికంగా ప్రమాదకరమైనదని తెలుపుతుంది. ఇలాంటి సమస్యలు లేకుండా ఉపాధ్యాయులు కొన్ని విషయాలను గుర్తుంచుకోవలసి ఉన్నదని సూచించింది. విద్యార్థులు ఐసిటి ఉపయోగించేటప్పుడు చూపు, వినికిడి, స్పర్శ మొదలగునవి ఉపయోగించగలగాలి. విద్యా విషయాలను మాత్రమే సపోర్టు చేయాలి, ఆటల ద్వారా నేర్చుకునే విధంగా సపోర్టు చేయాలి, సహకార భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి, సమగ్రతను మద్దతు ఇవ్వాలి, వ్యక్తిగత భద్రతదేశ భద్రతను కాపాడాలి, హింసను వదిలిపెట్టాలి, బట్టి విధాన ధోరణులను నివారించాలి. ●

# మమత తీరును ప్రజలు క్షమించరు

**సంతాల్ ఘటన రాజ్యాంగాన్ని అగౌరవ పరచడమే: దేశంలోనే తొలి 'రింగ్‌మెట్రో'ను ప్రారంభించిన ప్రధాని మోడీ**




**న్యూఢిల్లీ, మార్చి 8:** రాష్ట్రపతి ద్రౌపది ముర్మును బెంగాల్ పర్యటనలో మమతా బెనర్జీ సర్కార్ తీవ్రంగా అవమానించింది, ఇది రాజ్యాంగాన్ని అగౌరవ పరచడమే కాదు, సంప్రదాయ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్య అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ తీవ్రంగా ధ్వజమెత్తారు. ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ, అంతర్జాతీయ సంతాల్ సమ్మేళనం వేదికను అస్తవ్యస్తంగా మార్చడంపై మండిపడ్డారు. "రాష్ట్రపతి పట్ల బెంగాల్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు అత్యంత అవమానకరం. ప్రజాస్వామ్యాన్ని, గిరిజన సాధికారతను నమ్మే ప్రతి ఒక్కరూ ఈ ఘటనతో దిగ్భ్రాంతికి గురయ్యారు. స్వయంగా గిరిజన సామాజిక వర్గానికి చెందిన రాష్ట్రపతి వ్యక్తం చేసిన ఆవేదన భారతీయులందరినీ కలిచివేసింది" ప్రధాని మోడీ పేర్కొన్నారు. "శనివారం పశ్చిమ బెంగాల్ టీఎంసీ ప్రభుత్వం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును తీవ్రంగా అవమానించింది. ద్రౌపది ముర్ము, శాంతల్ కమ్యూనిటీ వేడుకలో పాల్గొనడానికి బెంగాల్‌కు వెళ్లారు. అయితే, రాష్ట్రపతికి స్వాగతం పలకడానికి ముఖ్యమంత్రి లేదా మంత్రివర్గ సభ్యులు కూడా వెళ్లలేదు. అంతేగాక, వేడుకకు సంబంధించిన వేదికను మార్పు చేసి, గందరగోళం సృష్టించారు. ఈ చర్య రాష్ట్రపతికి స్వల్ప అవమానం మాత్రమే కాదు, భారత రాజ్యాంగానికి కూడా అగౌరవం. ఇది రాజ్యాంగ స్ఫూర్తిని కూడా అగౌరవపరుస్తుంది. అంతేకుండా, ఇది ప్రజాస్వామ్యంలోని గొప్ప సంప్రదాయాన్ని దెబ్బతీస్తుంది. జీవితాంతం అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం మరియు పోరాడారు. ఇది అలాంటి ప్రతి సోదరి, కుమార్తెకు అవమానం" అని ఆయన అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ "మురికి రాజకీయాలు" పాల్పడిందని ప్రధాని మోడీ అభివర్ణించారు. ఇందుకు తృణమూల్ కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని, ఆ పార్టీ "అహంకారం" త్వరలో విచ్ఛిన్నమవుతుందని అన్నారు. "మన దేశంలో ఒక వ్యక్తి ఎంత శక్తివంతుడైనా, చివరికి అతను అహంకారంతో నాశనం అవుతాడని చెబుతారు. దేశ అధ్యక్షురాలి గౌరవాన్ని అవమానించిన టీఎంసీ మురికి రాజకీయాలు, అధికార దురహంకారం త్వరలో విచ్ఛిన్నమవుతాయి. పశ్చిమ బెంగాల్‌లోని జాగృతి పొందిన ప్రజలు ఒక మహిళను, ఒక గిరిజనుడిని, దేశ అధ్యక్షురాలిని అవమానించినందుకు టీఎంసీని ఎప్పటికీ క్షమించరు. దేశం కూడా వారిని ఎప్పటికీ క్షమించదు. దేశంలోని గిరిజన సమాజం వారిని ఎప్పటికీ క్షమించదు. దేశంలోని మహిళలు వారిని ఎప్పటికీ క్షమించరు" అని ఆయన అన్నారు.

**పేదలను 'ఆప్' గాలికొదిలేసింది**

ఆదివారం ఢిల్లీలో రూ.33,500 కోట్లకు పైగా విలువైన బహుళ అభివృద్ధి పనులను ప్రధాని మోడీ శంకుస్థాపన చేసి ప్రారంభించారు. దాదాపు రూ. 18,300 కోట్ల విలువైన ఢిల్లీ మెట్రో రెండు కొత్త కారిడార్లను కూడా ప్రధాని ప్రారంభించారు. వీటిలో దాదాపు 12.3 కి.మీ.ల మజ్లిస్ పార్క్‌మోజ్‌పూర్ బాబర్‌పూర్ (పింక్ లైన్) కారిడార్, దాదాపు 9.9 కి.మీ.ల దీపాలి చౌక్ మజ్లిస్ పార్క్(మెజెంటా లైన్) కారిడార్ ఉన్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ, ఢిల్లీ అభివృద్ధి ప్రయాణానికి కొత్త వేగాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. "ఏడాది క్రితం, అందరి విశ్వాసంతో బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు, ఇప్పుడు, దాని ఫలితాలు ఇప్పటికే ఇక్కడ కనిపిస్తున్నాయి. ఈ అభివృద్ధి ప్రాజెక్టులకు కృషి చేసిన ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నాను" అని ఆయన అన్నారు. "ఢిల్లీ 'ఆప్దా' నుండి విముక్తి పొందడం ఎంత ముఖ్యమో ఈ అభివృద్ధి ప్రాజెక్టులు కూడా నిదర్శనం" అని అన్నారు. ఆప్దా ప్రభుత్వం ఇక్కడ లేకుంటే, ఈ మెట్రో ఫేజ్4 ప్రాజెక్ట్ చాలా కాలం క్రితమే పూర్తయ్యేది. అయితే, రాజకీయ ప్రయోజనం కోసం, ఈ ఆప్దా వ్యక్తులు లక్షలాది ఢిల్లీ వాసులకు అభివృద్ధి ప్రాజెక్టులను నిలిపివేశారు. "బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, పరిస్థితులు మారిపోయాయి" అని ఆయన అన్నారు, పరిధీయ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం జంతో, లక్షలాది వాహనాలు ఇకపై నగరంలోకి ప్రవేశించాల్సిన అవసరం లేదని ప్రధాని మోడీ అన్నారు.

# స్కూలుపై దాడి అమెరికా చర్యకాదు!

### అది ఇరాన్ దుశ్చర్య మాత్రమే: ట్రంప్



**వాషింగ్టన్, మార్చి 8:** ఇరాన్‌లోని ఓ ప్రాథమిక పాఠశాలపై జరిగిన ఘోర బాంబు దాడిలో 160 మంది మరణించిన ఘటనపై అమెరికాకు ఎలాంటి సంబంధం లేదని అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పారు. ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో మయామికి వెళ్తున్న సమయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం, తాజా పరిణామాలపై ఆయన సుదీర్ఘంగా స్పందించారు. పాఠశాల దాడి గురించి విలేకరులు ప్రశ్నించగా ట్రంప్ ఆ ఆరోపణలను ఖండించారు. "నేను చూసిన సమాచారం, ఆధారాల ప్రకారం అది కచ్చితంగా ఇరాన్ చేసిన పనే. వారి ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చాలా అస్థిరంగా ఉంటాయి. వాటికి లక్ష్యాన్ని ఛేదించే కచ్చితత్వం అస్సలు ఉండదు. గురి తప్పి వారి పాఠశాల మీదే పడి ఉండవచ్చు తప్ప, మేము స్కూల్ పిల్లలపై దాడులు చేయం. ఇది పూర్తిగా వారి తప్పిదమే, అని ట్రంప్ స్పష్టం చేశారు. యుద్ధం పురోగతిపై ట్రంప్ పూర్తి ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తాము యుద్ధంలో గొప్ప విజయాలు సాధిస్తున్నామని, ఇరాన్ అనే దుష్ట సామ్రాజ్యాన్ని దాదాపు నేలమట్టం చేశామని వ్యాఖ్యానించారు. ఇరాన్ నౌకాదళంలోని 44 ఓడలను, వైమానిక దళంలోని ప్రతి విమానాన్ని మేము ధ్వంసం చేశాం. వారి క్షిపణి తయారీ కేంద్రాలపై, డ్రోన్ల నిల్వలపై తీవ్ర దాడులు జరిపాం. ఫలితంగా ఇప్పుడు ఇరాన్ నుంచి వచ్చే దాడులు నామమాత్రంగా మారాయి. యుద్ధం మొదలైన మొదటి రెండు రోజులతో పోలిస్తే, ప్రస్తుతం వారు కేవలం 9 శాతం సామర్థ్యంతోనే పోరాడుతున్నారు. వారి దగ్గరున్న 70 శాతం లాంచర్లు నాశనమయ్యాయి. అవి చాలా ఖరీదైనవి, తిరిగి సమకూర్చుకోవడం వారికి చాలా కష్టం. వారి నాయకత్వం అంతా దాదాపు అంతమైందని అమెరికా విజయాలను ట్రంప్ వివరించారు. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందన్న ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ, తాను కాలపరిమితిని అంచనా వేయనని, ఎంత సమయం పడితే అంత కాలం పోరాడుతామని చెప్పారు. ఇరాన్ సైన్యం దాదాపు తుడిచిపెట్టుకుపోయిందని, వారిపై మరింత తీవ్రంగా విరుచుకుపడాలా వద్దా అనేది ఇంకా నిర్ణయించలేదని అన్నారు. ఈ పర్యటనలో ట్రంప్ వెంట అమెరికా ప్రత్యేక ఎన్వాయ్ స్టీవ్ విట్‌కాఫ్ కూడా ఉన్నారు. ఆయన మాట్లాడుతూ, దౌత్య పరమైన పరిష్కారం సాధ్యమేనని, అయితే అది పూర్తిగా ఇరాన్ చేతుల్లోనే ఉందన్నారు. గత చర్చల్లో వారు సహకరించలేదు. తమకు యురేనియం శుద్ధి చేసే హక్కు ఉందని, 11 అణుబాంబులకు సరిపడా ఇంధనం తమ వద్ద ఉందని గొప్పలు చెప్పారు. యుద్ధంలో గెలవలేని దాన్ని, చర్చల ద్వారా సాధించలేమని వారికి స్పష్టం చేశాం. కాబట్టి వారి అహంకారం, ధోరణి మారాలని విట్‌కాఫ్ అభిప్రాయపడ్డారు. గతనెల 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించిన తర్వాత పరిస్థితులు తీవ్రరూపం దాల్చాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్ బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, జోర్డాన్ వంటి దేశాలపై క్షిపణి దాడులు చేసింది.



### పూజ చేసుకుంటున్న వారిపై బాంబులు

**ఢాకా, మార్చి 8:** బంగ్లాదేశ్ హిందువులపై దాడులు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. తాజాగా మరో ఘటన చోటుచేసుకుంది. కోమిల్లా ప్రాంతంలో శనివారం పూజ చేసుకుంటున్న హిందువుల బృందంపై గుర్తుతెలియని దుండగులు బాంబులు విసిరారు. భయభ్రాంతులకు గురైన ప్రజలు పరుగులు పెట్టారు. పూజా కార్యక్రమానికి హాజరైన పలువురు ఈ ఘటనలో గాయపడినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. పూజారి కేశవ్ చక్రవర్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసుకొని నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### 90 యేళ్ల వృద్ధురాలిపై సామూహిక లైంగికదాడి

**ఖాండ్వా, (ఎంపి), మార్చి 8:** మానవత్వం సిగ్గుతో తలదించుకునే దారుణ ఘటన మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. ఖాండ్వా జిల్లాలో 90 ఏళ్ల వృద్ధురాలిపై నలుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ప్రస్తుతం బాధితురాలి పరిస్థితి విషమంగా ఉందని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. ఈ అమానవీయ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఖాండ్వా జిల్లాలోని ఓ గ్రామంలో 90 ఏళ్ల వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ఆమె ఇంట్లో నిద్రిస్తుండగా ముఖాలకు ముసుగులు ధరించిన నలుగురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఒంటరిగా ఉన్న ఆ వృద్ధురాలిపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు.

# మహిళల్లో పెరుగుతున్న 'ఇస్కీమిక్ హార్ట్ డిసీజ్'



**న్యూఢిల్లీ, మార్చి 8:** గుండెపోటు అనేది కేవలం పురుషులకు మాత్రమే కాకుండా మహిళల ప్రాణాలకుకూడా ముప్పుతెస్తోందని సర్వేల్లో స్పష్టం అయింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ డేటాను చూస్తే 2021లో భారతదేశంలో కొవిడ్ 19 తర్వాత మహిళల మరణాలకు "ఇస్కీమిక్ హార్ట్ డిసీజ్ "(ఐహెచ్ డీ) రెండో ప్రధాన కారణమని తేలింది. ఆ ఏడాది లక్ష మందిలో 159.9 మంది కొవిడ్ వల్ల మరణించగా, 99.4 మంది ఈ గుండె జబ్బు కారణంగా ప్రాణాలు కోల్పోయారు. ఇస్కీమిక్ హార్ట్ డిసీజ్‌నే కరోనరీ హార్ట్ డిసీజ్ అని కూడా పిలుస్తారు. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనుల గోడలలో కొవ్వు పదార్థం (ప్లాక్) పేరుకుపోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. కాలక్రమేణా రక్తనాళాలు సన్నబడి, రక్త ప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. ఒకవేళ ఆ ప్లాక్ పగిలి రక్తం గడ్డకడితే గుండెకు ఆక్సిజన్ అందక హార్ట్ ఎటాక్ వచ్చే ప్రమాదం ఉంది. ప్రపంచవ్యాప్తంగా మహిళల మరణాల్లో మూడో వంతు ఈ వ్యాధి వల్లే సంభవిస్తున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళల్లో గుండెపోటు లక్షణాలు పురుషులతో పోలిస్తే భిన్నంగా ఉంటాయి. సినిమాటిక్ స్టైల్లో ఛాతీలో తీవ్రమైన నొప్పి అందరికీ రాకపోవచ్చు. అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వాంతులు, దవడ లేదా వీపు భాగంలో నొప్పి వంటివి కనిపిస్తాయి. వీటిని చాలామంది ఒత్తిడి లేదా గ్యాస్ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. ఇదే ప్రాణాల మీదకు తెస్తోంది. ముఖ్యంగా మహిళల్లో మెనోపాజ్(నెలసరి ఆగిపోవడం) తర్వాత గుండె జబ్బుల ముప్పు పెరుగుతుంది. శరీరంలో రక్తనాళాలను రక్షించే ఈస్ట్రోజెన్ హార్మోన్ తగ్గడమే ఇందుకు కారణం. దీనికి తోడు అధిక రక్తపోటు, షుగర్, ఊబకాయం, వ్యాయామం లేకపోవడం వంటివి పరిస్థితిని మరింత దిగజారుస్తాయి. పొగతాగే అలవాటు ఉన్నవారిలో రక్తనాళాలు త్వరగా దెబ్బతింటాయి.

**జాగ్రత్తలు ముఖ్యం**

గుండెను కాపాడుకోవడానికి ఆరోగ్యకరమైన ఆహారం, రోజువారీ వ్యాయామం, బరువు నియంత్రణ చాలా అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. సమస్య తీవ్రతను బట్టి యాంజియోప్లాస్టీ లేదా బైపాస్ సర్జరీ ద్వారా చికిత్స పొందవచ్చు. లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్‌ను సంప్రదిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# రాష్ట్రపతి ప్రొటోకాల్ అవమానంపై కేంద్రం సీరియస్



**న్యూఢిల్లీ, మార్చి 8:** పశ్చిమ బెంగాల్ పర్యటనకు వెళ్లిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తగిన గౌరవం ఇవ్వకుండా అక్కడి మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని టీఎంసీ ప్రభుత్వం అవమానించింది. ఈ విషయంపై స్వయంగా రాష్ట్రపతి అసహనం వ్యక్తం చేశారు. ఇప్పుడీ అంశం రాజకీయ రంగు పులుముకుంది. టీఎంసీ ప్రభుత్వంపై కేంద్రంలోని బీజేపీ మండిపడుతోంది. మరోవైపు రాష్ట్రపతి పర్యటన కోసం తగిన ఏర్పాట్లు చేయకపోవడంపై, నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కేంద్ర హోం శాఖ కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు పశ్చిమ బెంగాల్ ప్రధాన కార్యదర్శి నందిని చక్రవర్తిని వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. ప్రధానంగా నాలుగు అంశాలపై ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించింది. రాష్ట్రపతికి స్వాగతం పలికేందుకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, చీఫ్ సెక్రెటరీ, డీజీపీ ఎందుకు రాలేదు, రాష్ట్రపతికి వాష్‌రూమ్‌లో నీళ్లు కూడా ఎందుకు ఏర్పాటు చేయలేదు, రాష్ట్రపతి పర్యటనకు ఎంపిక చేసిన మార్గం మొత్తం చెత్తతో నిండి ఉంది. ఇలాంటి మార్గాన్ని ఎందుకు ఎంచుకున్నారు, ఈ నిర్లక్ష్యానికి బాధ్యులైన డార్జిలింగ్ జిల్లా జడ్జి, కమిషనర్ ఆఫ్ పోలీస్, సిలిగురి జిల్లా అడిషనల్ జడ్జిలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, అంటూ ప్రశ్నలు సంధించింది. వీటికి ఈ రోజు సాయంత్రం ఐదు గంటలలోపు సమాధానం చెప్పాలని ఆదేశించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం బెంగాల్‌లో పర్యటించారు. సాధారణంగా రాష్ట్రపతి పర్యటనకు వచ్చినప్పుడు సీఎం, చీఫ్ సెక్రెటరీ, మంత్రులు వంటి వారు స్వాగతం పలుకుతారు. కానీ, ద్రౌపది ముర్ము పర్యటనకు వీరు గైర్హాజరయ్యారు.

# గల్ఫ్‌దేశాల నుంచి 52 వేలమంది భారత్‌కు



**న్యూఢిల్లీ, మార్చి 8:** పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో గల్ఫ్ ప్రాంతం నుంచి 52 వేల మందికి పైగా భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తరలించినట్లు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మార్చి 1 నుంచి 7వ తేదీ మధ్య ఈ తరలింపు ప్రక్రియ విజయవంతంగా కొనసాగిందని వెల్లడించింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ స్వదేశానికి తిరిగి వచ్చిన వారిలో 32,107 మంది భారత విమానయాన సంస్థల ద్వారా, మిగిలిన వారు విదేశీ విమానాల్లో ప్రయాణించారని తెలిపారు. గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులను, ముఖ్యంగా అక్కడ చిక్కుకున్న భారతీయుల సంక్షేమాన్ని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని ఆయన స్పష్టం చేశారు. బాధితులు, వారి కుటుంబాల సహాయార్థం న్యూఢిల్లీలో ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను, ప్రభావిత దేశాల్లోని భారత రాయబార కార్యాలయాల్లో 24/7 హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ హెల్ప్‌లైన్ల పూర్తి వివరాలను మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

# అమెరికా ఎంబసీ వద్ద భారీ పేలుడు



**ఓస్లో, మార్చి 8:** నార్వే రాజధాని ఓస్లోలో తీవ్ర కలకలం రేగింది. ఇక్కడి అమెరికా రాయబార కార్యాలయం సమీపంలో భారీ పేలుడు సంభవించింది. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో ఎంబసీ సిబ్బంది, స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘటనతో నార్వే ప్రభుత్వం అప్రమత్తమైంది. సమాచారం అందుకున్న వెంటనే భద్రతా దళాలు ఘటనా స్థలానికి చేరుకుని ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఈ పేలుడులో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని నార్వే పోలీసులు అధికారికంగా ధృవీకరించారు. అయితే, ఎంబసీ భవనం వెలుపల స్వల్పంగా నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా రాయబార కార్యాలయం చుట్టూ భారీగా బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికాను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగి ఉండవచ్చన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన చర్య అయ్యుంటుందన్న అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.

# మంటల్లో పశ్చిమాసియా

## ఇరాన్‌కు మరిన్ని సర్‌ప్రైజ్‌లు: నెతన్యాహు



**టెల్‌అవీవ్, మార్చి 8:** ఇరాన్‌పై భీకర దాడులు కొనసాగుతోన్న నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. ముందు ముందు ఇరాన్‌కు మరిన్ని సర్‌ప్రైజ్‌లు ఇస్తామన్నారు. ప్రజలు ఆ దేశంలోని ప్రభుత్వాన్ని పడగొట్టే క్షణం దగ్గరలో ఉందన్నారు. ఈ దాడులతో తాము ఇరాన్‌ను విభజించడానికి ప్రయత్నించట్లేదని.. నిరంకుశ పాలన నుంచి ఆ దేశానికి విముక్తి కలిగించడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇరాన్ విషయంలో తమ ప్రణాళికలోని తదుపరి దశను త్వరలో చేరుకోబోతున్నామని నెతన్యాహు అన్నారు. ఇజ్రాయెల్ చేస్తున్న దాడులతో కీలక నేతలను కోల్పోయి ఇరాన్ ప్రభుత్వం ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిందని నెతన్యాహు అన్నారు. ఆ దేశంలోని ప్రస్తుత పాలనను అస్థిరపరచడానికి ప్రభుత్వంలో మార్పులు తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్కడి పాలక వర్గాన్ని గద్దె దించడానికి ఇదే సరైన సమయమని తెలిపారు. ఆ దేశ ప్రభుత్వాన్ని అక్కడి ప్రజలే స్వయంగా పడగొట్టాలన్నారు. అప్పుడే ఇరాన్-ఇజ్రాయెల్‌లతో శాంతి నెలకొంటుందని తెలిపారు.

## కువైట్‌పై ఇరాన్ దాడులు.. అగ్నికీలల్లో భారీ టవర్



**కువైట్ సిటీ, మార్చి 8:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఇరాన్‌పై భీకరంగా విరుచుకుపడుతున్నాయి. ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై దాడులు కొనసాగిస్తోంది. శనివారం రాత్రి ఇరాన్ మరోసారి తమపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినట్లు కువైట్ రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ దాడుల్లో పలువురు ప్రజలు తీవ్రంగా గాయపడగా అనేక భవనాలు దెబ్బతిన్నాయని తెలిపింది. డ్రోన్ల శకలాలు పడడంతో నగరంలోని సోషల్ సెక్యూరిటీ టవర్‌కు మంటలు అంటుకున్నట్లు వెల్లడించింది. దానిలో అనేకమంది ప్రజలు చిక్కుకున్నారని, మంటలు ఆర్పడానికి అగ్నిమాపక దళాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. దాడులు కొనసాగుతున్నందున సురక్షితమైన ప్రదేశాల్లో తలదాచుకోవాలని కువైట్ సైన్యం ప్రజలకు సూచించింది. మరోవైపు ఆ దేశ అంతర్జాతీయ విమానాశ్రయానికి చెందిన ఇంధన ట్యాంకులు, పలు ప్రభుత్వ భవనాలకు అంటుకున్న మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చినట్లు అగ్నిమాపక దళం పేర్కొంది. సౌదీ అరేబియా, ఖతార్‌లలోనూ దాడులు కొనసాగుతున్నాయి. గల్ఫ్ దేశాలపై దాడులు చేస్తున్నందుకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పినప్పటికీ.. టెహ్రాన్ ఆయా దేశాలపై దాడులు కొనసాగిస్తుండడం గమనార్హం.

**ఇజ్రాయెల్ హెచ్చరికలు..**

మరోవైపు ఇరాన్‌కు మద్దతిస్తున్న హెజ్‌బొల్లా నేతలే లక్ష్యంగా దాడులు చేపట్టినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. బీరుట్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలను లక్ష్యం చేసుకున్నందువల్ల ఆ ప్రాంతాన్ని వీలైనంత త్వరగా ఖాళీ చేయాలని స్థానిక ప్రజలను హెచ్చరించింది. సెంట్రల్ బీరుట్‌లోని ఓ హోటల్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు బెనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

## ఖమేనీ మృతికి ట్రంప్ మూల్యం చెల్లించుకోవాల్సిందే: ఆలీ లారిజాని



**టెహ్రాన్, మార్చి 8:** ఇరాన్ సుప్రీం లీడర్ ఆయ తుల్లా అలీ ఖమేనీ మృతికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి డాక్టర్ అలీ లారిజాని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఖమేనీపై జరిగిన దాడికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఖమేనీకి అత్యంత సన్నిహితుడైన లారిజాని సోషల్ మీడియా వేదికగా అమెరికా తీరుపై నిప్పులు చెరిగారు. ట్రంప్‌ను తాము వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దాడుల్లో తమ నాయకుడితో పాటు అనేక మంది సామాన్య పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారని, ఇది సాధారణ విషయం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు అమెరికా తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనని హెచ్చరించారు. మరోవైపు, యుద్ధ వాతావరణం నేపథ్యంలో అనేక మంది అమెరికా సైనికులను తాము బంధించి జైళ్లలో ఉంచామని లారిజాని సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం ఆరుగురు సైనికులే చనిపోయారంటూ ట్రంప్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, వాస్తవానికి మృతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని ఆరోపించారు. భవిష్యత్తులో కల్పిత ప్రమాదాల పేరుతో ఈ మరణాలను అమెరికా బయటపెట్టే అవకాశం ఉందన్నారు. వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను బందీగా తీసుకెళ్లినట్లే, ఇరాన్‌లో కూడా యుద్ధాన్ని త్వరగా ముగించాలని అమెరికా భావించిందని, కానీ వారి ప్లాన్ బెడిసికొట్టిందని లారిజాని స్థానిక మీడియాతో పేర్కొన్నారు.

## ఖమేనీ కుమారుడికి క్షిపణి దాడుల్లో గాయాలు



**టెహ్రాన్, మార్చి 8:** ఇరాన్ దివంగత సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కుమారుడు మోజ్తబా ఖమేనీ ఇజ్రాయెల్ దాడిలో గాయపడ్డారు. ఖమేనీ వారసుడిగా మోజ్తబా పేరు వినిపిస్తోంది. అయితే ఫిబ్రవరి 28న లయన్స్ రోర్‌లో భాగంగా ఇజ్రా యెల్ చేపట్టిన దాడుల్లో అలీ ఖమేనీతో పాటు 40మంది కీలక నాయకులు, జనరల్స్ ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిలో మొజ్తబా భార్య జహ్రా కూడా మరణించారు. ఈ దాడి నుంచి మోజ్తబా మాత్రం ప్రాణాలతో బయటపడినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ దాడి చేసిన సమయంలో మోజ్తబా తన తండ్రితో పాటు కాంపౌండ్‌లోనే ఉన్నారా అన్న విషయం వెల్లడి కావాల్సి ఉంది. ఆయనకు గాయాల తీవ్రత కూడా తెలియరాలేదు. ఈ దాడి నుంచి మోజ్తబా ప్రాణాలతో బయటపడ్డారని, కానీ గాయపడ్డారని ఇజ్రాయెల్ భద్రతా అధికారులు కూడా భావిస్తున్నారు. అలీ ఖమేనీ తర్వాత ఇరాన్ తదుపరి నేతగా మోజ్తబా ముందు వరుసలో ఉన్నారు. ఇతనికి ఇరాన్‌లోని శక్తిమంతమైన ఐఆర్జీసీపై పట్టు ఉంది. దీనితో ఆయనే ఖమేనీ స్థానాన్ని భర్తీ చేస్తారని అందరూ భావిస్తున్నారు. అయితే 88 మంది సభ్యులున్న గార్డియన్ కౌన్సిల్‌లో కొందరు మాత్రం అధికారాన్ని వారసత్వంగా మోజ్తబాకు అందించడాన్ని వ్యతిరేకిస్తున్నారని సమాచారం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా మోజ్తాబాకు అధికారం అప్పగించేందుకు ససేమీరా అంటున్నారు.

## యుద్ధంలో గెలిచాక మీ సాయం దేనికి:ట్రంప్



**వాషింగ్టన్, మార్చి 8:** ఇరాన్‌తో యుద్ధం వేళ, బ్రిటన్ ప్రధానమంత్రి తీరుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమాసియాకు విమాన వాహక నౌకలను పంపించే విషయంపై యూకే ప్రభుత్వం ఇంకా తేల్చుకోకపోవడంపై ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. యుద్ధం గెలిచిన తర్వాత తమతో కలిసే వ్యక్తులు అవసరం లేదని వ్యాఖ్యానించారు. యుద్ధంలో గెలిచాక మీ విమాన వాహక నౌకలను మోహరించాల్సిన అవసరం లేదని యూకే ప్రధాని కీర్ స్మార్టర్‌పై మండిపడ్డారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా స్మార్టర్‌పై విమర్శలు గుప్పించారు. బ్రిటన్ రక్షణ మంత్రిత్వ శాఖ హెచ్ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ విమాన వాహన నౌకను సిద్ధం చేస్తున్నట్లు తెలిపింది. రెండు విమాన వాహక నౌకలలో ఒకదానిని సిద్ధంగా ఉంచామని, అయితే పశ్చిమాసియాకు తరలించే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదని బ్రిటన్‌కు చెందిన ఒక అధికారి మీడియాతో మాట్లాడుతు తెలిపారు. ఈ వ్యాఖ్యలపై ట్రంప్ స్పందించారు. ఒకప్పుడు యూకే తమకు మిత్రదేశమని పేర్కొన్నారు. పశ్చిమాసియాకు రెండు విమాన వాహక నౌకలను తరలించే విషయంపై వారు తీవ్రంగా ఆలోచిస్తున్నారని మండిపడ్డారు. అమెరికా బలగాలకు ఇప్పుడు వాటి అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ చర్యను తాము ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటామని స్మార్టర్‌కు హెచ్చరిక జారీ చేశారు.

## గల్ఫ్‌దేశాలపై ఇరాన్ దాడులు ఉధృతం



**టెహ్రాన్, మార్చి 8:** గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేస్తున్న దాడులు తీవ్రరూపం దాల్చాయి. ఆదివారంతో ఈ ప్రాంతీయ యుద్ధం రెండో వారంలోకి అడుగుపెట్టింది. కువైట్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ మరోసారి క్షిపణులు, డ్రోన్లతో విరు చుకుపడింది. ఇక సౌదీ అరేబియాలో రాజధాని రియాద్‌లోని దౌత్య కార్యాలయాలు, అమెరికా బలగాలున్న ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ లక్ష్యంగా వచ్చిన 15 డ్రోన్లు, 3 బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే ధ్వంసం చేసినట్లు సౌదీ రక్షణ శాఖ తెలిపింది. ఖతార్‌పై ప్రయోగించిన 12 క్షిపణులను కూడా విజయవంతంగా అడ్డుకున్నారు. దుబాయ్ విమానాశ్రయం పరిసరాల్లో గుర్తుతెలియని వస్తువును కూల్చి వేయడంతో, విమానాశ్రయాన్ని కాసేపు మూసి వేశారు.

## బెంగాల్‌లో రాష్ట్రపతికి చేదు అనుభవం

# దురదృష్టకరమన్న సిఎం చంద్రబాబు

### ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా ప్రోటోకాల్ పాటించాల్సిందేనని వ్యాఖ్య



విజయవాడ మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పశ్చి బెంగాల్ ప్రభుత్వం ప్రొటోకాల్ కల్పించక పోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తన పర్యటనలో ఆ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై రాష్ట్రపతి అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. ఈ ఘటన దురదృష్ట కరమని, రాష్ట్రపతి పదవిని అవమానించేలా బెంగాల్ ప్రభుత్వం వ్యవహరించడం బాధ కలిగించిందన్నారు. రాష్ట్రపతి పర్యటనలో చోటు చేసుకున్న పరిణామాలపై ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఏ ప్రభుత్వమైనా రాష్ట్రపతి పట్ల అత్యంత గౌరవ, మర్యాదలతో మెలగాలి. రాజ్యాంగ సంస్థలు రాజకీయాలకు అతీతంగా ఉంటాయి. వాటి పవిత్రతను కాపాడుకోవడం సమష్టి విధి అంటూ వ్యాఖ్యానించారు. మన దేశంలో రాష్ట్రపతి పదవి అత్యున్నత రాజ్యాంగ హోదా కలిగి ఉంది. ఆ పదవికి ఎల్లప్పుడూ అత్యున్నత గౌరవాన్ని ఇవ్వాలి. రాష్ట్రపతి పర్యటన సజావుగా సాగేలా చూడటం సంబంధిత యంత్రాంగం బాధ్యత అని చంద్రబాబు పేర్కొన్నారు.

# తాళి కట్టే శుభవేళ... మెడలో పడని కల్యాణ మాల

### జీలకర్ర-బెల్లం తంతు ముగిసింది... ప్రియుడొచ్చాడు..
### పెళ్లి ఆగింది... వధువు, వరుడు బంధువులు ఘర్షణ
### ప్రేమించుకున్నామంటూ వధువు, ప్రియుడు మాటలు
### పెద్దమనుషుల చర్చలు... సమస్య పరిష్కారం

విజయవాడ మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి: తాళి కట్టే శుభవేళ, మెడలో పడని కల్యాణ మాల ఇదేమీ పేరడి గీతం కాదు. చెదిరిన ఓ స్వప్న కథ. ఎన్టీఆర్ జిల్లా మైలవరం జరిగిన ఓ యదార్ధగాథ,ఆ పెళ్ళిలో ముహూర్తం వేళకు వధూవరులకు జీలకర్ర-బెల్లం పెట్టించారు. తదుపరి తాళికట్టే కార్యక్రమం ఉంటుందనగా ఓ యువకుడు హడావుడిగా వచ్చేసి మండపం ముందు నిలుచున్నాడు అతడిని చూసిన వధువు పీటలపై నుంచి లేని వచ్చావా అంటూ మండపం దిగింది. ఆ యువకుడి పక్కకు వెళ్లి నిలుచుంది. ఈ పరిణామంతో వరుడు షాకయ్యాడు. పెళ్లికొచ్చిన బంధువులు, ఊరిజనం నిర్ఘాంతపోయారు. వారు తేరుకుని నిలదీసేసరికి ఈ అబ్బాయి ఈ ఊరు వాడే. మేమిద్దరం ప్రేమించుకున్నాం అంటూ వధువు అసలు విషయం బయటపెట్టింది. ఎన్టీఆర్ జిల్లా మైలవనం నియోజకవర్గంలో ఈ ఉదంతం కలకలం రేపింది. నియోజకవర్గంలోని వేర్వేరు గ్రామాలకు చెందిన యువతి, యువకుడికి వివాహం నిశ్చయమైంది. వరుడి ఇంటి వద్ద పెళ్లి జరుగుతోంది. మధ్యలో ప్రియుడు ప్రత్యక్షమయ్యేసరికి గలాటా జరిగింది. ఈ పెళ్ల తనకు ఇష్టం లేదని, ప్రియుడే కావాలంటూ వధువు తెగేసి చెప్పడంతో వరుడి కుటుంబసభ్యులు నివ్వెరపోయారు. చివరి నిమిషంలో వచ్చి పెళ్లి చెడగొడతావా అంటూ యువకుడిపై కొందరు చేయి చేసుకున్నారు. పరిస్థితి చేయిదాటిపోయే పరిస్థితులు ఏర్పాటు చేశాం. ఇప్పటికే వేల మంది విందును ఆరగించారు. ఇంత జరిగాక పెళ్లిని మధ్యలో ఆపి అందరిలో మా పరువు తీశారు అంటూ వరుడి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పిల్ల తమ కుమారుడితో నిశ్చితార్థానికే ముందే చనువుగా ఉంటూ వచ్చిందని,ఎంతో ఇష్టం కన్పర్చిందని వారంటున్నారు.ఆ అమ్మాయి ఇష్టం లేకపోతే ఇంతదాకా తీసుకుని రావడం ఎందుకని వారు ఆవేదన వ్యక్తం చేసారు. ఇరువైపుల వారూ గ్రామ పెద్దల వద్ద పంచాయితీ పెట్టుకున్నారు. సమస్యను పరిషారమైనట్లు సమాచారం.

# సమాన హక్కుల కోసం సర్వేయర్ల సమ్మెబాట

### సాంకేతిక నైపుణ్యాన్ని గుర్తించడం లేదని ఆవేదన



సర్వే విభాగం రాష్ట్ర డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్వేయర్లు(ఫైల్)

చంద్రగిరి, మార్చి 8 ప్రభాతవార్త: సచివాలయ ఉద్యోగులతో సమాన హక్కులు కల్పించాలంటూ ఆందోళన (సమ్మె) బాటపట్టిన సచివాలయ సర్వేయర్లపై ప్రత్యేక కథనం. రెవెన్యూ విభాగంలో ఉద్యోగం కోసం గత ప్రభుత్వం 2019లో నిర్వహించిన పోటీ పరీక్షలో (సచివాలయ ఉద్యోగాలు) ఉత్తమ ఫలితాలు సాధించిన నిరుద్యోగ యువతకు నాటి ప్రభుత్వం విఆర్ఓ, సర్వేయర్ పోస్టులలో ఏది ఇష్టమో ఎంపిక చేసుకునే వెసులుబాటును కల్పించింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగం సాధించామనే ఒకింత గర్వం, సంతోషంతో కొంత మంది విఆర్ఓలుగా, మరి కొంత మంది సర్వేయర్లుగా కోరుకున్నారు. మొదట రూ.15 వేలు వేతనంలో రెండేళ్ళ పాటు విధులు నిర్వహించారు. ఆపై విఆర్ఓలకు, సర్వేయర్లకు పరీక్ష నిర్వహించి పాస్ అయిన వారిని రెగ్యులర్ చేశారు. అదేవిధంగా రెగ్యులర్ అయిన వెంటనే వేతనాలలో గ్రేడ్-2విఆర్ఓలకు రూ.25,200, బేసిక్ పే నిర్ణయించిన ప్రభుత్వం గ్రేడ్-2 సర్వేయర్లకు మాత్రం 24,500/-లు బేసిక్‌గా నిర్ణయించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. విఆర్ఓల వేతనం, సర్వేయర్ల వేతనం, ఇంక్రిమెంట్స్, పదోన్నతి వంటి అంశాలలో ప్రభుత్వం వ్యత్యాసాలు చూపడం పట్ల సర్వేయర్లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సర్వేయర్లు తమ విధి నిర్వహణలో సాంకేతికతను జోడించి ఆధునిక పద్ధలతులను అవలంభిస్తున్నప్పటికీ గొలుసు కొలతల నాటి తరం క్రిందనే తమను చూస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు ఉద్యోగాలలోని వ్యత్యాసాలను పరిశీలిస్తే విఆర్ఓలుగా బాధ్యతలు చేపట్టిన అధికారులు తహశీల్దార్ వరకు పదోన్నతులు పొందే అవకాశం వుంటుంది. అదే సర్వేయర్లు గ్రేడ్-2 నుండి గ్రేడ్-1గా పదోన్నతి పొంది అక్కడితో దాదాపు పదవీ విరమణ వరకు మండలానికే పరిమితమయ్యే దుస్థితి ఎదురవుతున్నట్లు వాపోతున్నారు. సర్వేయర్లు పదోన్నతికై సాంకేతికతతో కూడిన (6 పరీక్షలు) 4 వ్రాత పరీక్షలు, రెండు ప్రాక్టికల్స్ రాయాల్సి వుంటుందని అంటున్నారు. ఇందులో పాస్ అయిన వారికి మాత్రమే పదోన్నతి కల్పిస్తున్నారు. పాస్ కాని వారికి రూ.24,500లు, పాస్ అయిన వారికి రూ.25,200లు వేలు చెల్లిస్తారు. మొత్తం 9,600 మంది సర్వేయర్లలో 6,000 మందికి మాత్రమే పదోన్నతి కల్పిస్తామని చెప్పడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆరు పరీక్షలో పాస్ అయిన తమకు గ్రేడ్-1 సర్వేయర్‌గా రూ.25,200/-లు (విఆర్ఓలకు గ్రేడ్-2లో చెల్లించే వేతనం) చెల్లించడం అన్యాయమంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేస్తున్న తమకు తగిన గుర్తింపునివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. 9,600 మందిలో 6,000 వేల మందికి మాత్రమే పదోన్నతి కల్పిస్తామనడం పట్ల ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం అగ్రికల్చర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, లైన్‌మ్యాన్‌లకు చెల్లిస్తున్న విధంగా తమకూ రూ.30 వేలు బేసిక్ పే చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అదేవిధంగా విఆర్ఓలతో సమానంగా పదోన్నతులు కల్పించాలనే న్యాయమైన కోరికను ప్రభుత్వం ముందు పెడుతున్నారు. ఆ విధంగా కుదరని పక్షంలో తమను రెవెన్యూలోకి తీసుకోవాలని పట్టుబడుతున్నారు. ఫిబ్రవరి 2026లో సర్వే విభాగం ఏడికి తమ సమస్యలను వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో సర్వే విభాగం డైరెక్టర్‌కు విన్నవించుకున్నారు. దీంతో రెవెన్యూ మంత్రి ఈ అంశాలపై పరిశీలనకు కమిటీ వేసినట్లు చెబుతున్నారు. అయితే తమ సమస్యలను పరిష్కరించే వరకు రీ సర్వే పనులు నిలుపుదల చేసిట్లు వెళ్ళడించారు. కూటమి ప్రభుత్వ సానుకూల స్పందన కొరకు సర్వేయర్లు నిరీక్షిస్తున్నారు.

# మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రైజ్ ఏర్పాటు

### 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్



మహిళలను సత్కరిస్తున్న లంక దినకర్, కలెక్టర్ లక్ష్మీశా తదితరులు

విజయవాడ, మార్చి 8 ప్రభాతవార్త: రాష్ట్రంలోని మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు రైజ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇబ్రహీం పట్నం మండలం గుంటుపల్లిలోని రైజ్ కార్యాలయంలో ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా అమరావతి పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో దినకర్ మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి చెందే దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోడీ సంకల్పించిన వికసిత భారత్ నిర్మాణంలో మహిళల బాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. మహిళల స్వయం సంవృద్ధి ద్వారా రాష్ట్రాన్ని వికసిత భారత్‌లో కీలక బాగ స్వామిగా నిలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. పార్లమెంటులో అత్యదిక సార్లు బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతా రామన్ చరిత్ర సృష్టించారని, దేశ అత్యున్నత పదవి అయిన రాష్ట్రపదవికి ద్రౌపతి ముర్ము వన్నె తెచ్చారని కొనియాడారు. దేశవ్యాప్తంగా 3కోట్ల మంది మహిళలను లక్‌పతిదీదిలుగా తయారు చేయాలనే లక్ష్యంతో నరేంద్రమోడీ నేతృత్వంలోని ప్రభుత్వం కృషిచేస్తుందని, మన రాష్ట్రంలో ఇప్పటికే దాదాపు 18 లక్షల మంది లక్‌పతి దీదిలు ఉన్నారని ఆయన వివరించారు. రాబోయే రెండేళ్ళలో మన రాష్ట్రంలో 30లక్షల మంది మహిళలను లక్‌పతి దీదిను తయారు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు దినకర్ తెలిపారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ మహిళలు సమర్ధవంతంగా రాణిస్తున్నారని, వారికి తగు ప్రోత్సాహం అందించేందుకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నట్లు దినకర్ భరోసా ఇచ్చారు. కలెక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ జిల్లా, రాష్ట్రం, దేశాన్ని ఆర్థికంగా బలంగా నిలబెట్టడంలో మహిళామణుల పాత్ర అత్యంత కీలకమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రైజ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈకేంద్రం ద్వారా మహిళలకు సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార నైపుణ్యాలను అందిస్తూ స్వావలంబన దిశగా నడిపిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 5వేల మందికి ఈకేంద్రం ద్వారా చేరువైనట్లు తెలిపారు. రైజ్‌ద్వారా చేపడుతున్న వినూత్న కార్యక్రమాలకు నీతి ఆయోగ్ నుండి ప్రశంసలు లభించటం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా మహిళా పారిశ్రామికవేత్తలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు గద్దె అనురాధ, యంపిపి పాలడుగు జ్యోత్స్న, జిల్లా సమాఖ్య అధ్యక్షుడు కె.కల్పన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్ళు అలరించాయి. స్వయం సహాయకసంఘ పారిశ్రామిక వేత్తలకు, స్వయం సహాయకసంఘాలకు బ్యాంకు లింకేజి రుణాలు అందచేసారు.





దండియాత్ర వివరాలు వెల్లడిస్తున్న విజయ్‌కలాం

## డ్రగ్స్ రహిత రాష్ట్రం కోసం 12న దండియాత్ర

విజయవాడ, మార్చి 8 ప్రభాతవార్త: మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మన రాష్ట్రాన్ని మారే ్చందుకు ఈనెల 12 వతేదీ రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజక వర్గాల్లో 10లక్షల మందితో దండియాత్ర-2 నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వైబ్రెంట్స్ ఆఫ్ కలాం సంస్థ వ్యవస్థాపకులు విజయ్ కలాం తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పోరేషన్ సమీపంలోని సంస్థ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 1930వ సంవత్సరం దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ మార్చి 12వతేదీ దండి సత్యాగ్రహం ప్రారంభించి 240 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టారని గుర్తుచేసారు. ఆఉద్యమాన్ని స్పూర్తిగా తీసుకుని ఈనెల 12వతేదీ మాదక ద్రవ్యరహిత రాష్ట్రం కోసం ఈకార్యక్రమం రూపొందించినట్లు చెప్పారు. విజయవాడలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఈగల్ టీంసభ్యులు, యువత పాల్గొంటారని చెప్పారు. మాదక ద్రవ్యాల వినయోగాన్ని నిర్మూలించటమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈకార్యక్రమానికి తెలుగుబుక్స్ ఆఫ్ రికార్డ్సు ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువత పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. జాతీయ సమన్వయకర్త వి.వెంకటేశ్వరావు, రాష్ట్ర కన్వీనర్ రవిరాజు, మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ వి.శ్రీలలిత, తెలంగాణా రాష్ట్ర కోఆర్డినేటర్ రంజిత్, తెలంగాణా ఇన్‌చార్జీ జహీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.





## మహిళా సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత

### - బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వెల్లడి

విజయవాడ, మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి: మహిళ శక్తి సంఘటితంగా ఉంటే అద్భుతాలు సాధిస్తుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారత కోసం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నాయన్నారు. ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబుల నేతృత్వంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు అత్యంత శక్తివంతంగా అభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మాధవ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో కనీసం ఒక మహిళను పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి లక్ష్యమని అన్నారు. మహిళల అభ్యున్నతి కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. నేటి ప్రపంచాన్ని ముందుకు నడిపించే శక్తి మహిళలేనని, అన్ని రంగాల్లో వారు అద్భుత విజయాలు సాధిస్తున్నారని అన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, సమాజం, దేశం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు అమలులోకి తీసుకుని వచ్చిన మహిళల ఉచిత బస్సు ప్రయాణం స్త్రీ శక్తి ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు.





మహిళా దినోత్సవంలో ప్రసంగిస్తున్న ఎం. రామకృష్ణ

## మహిళా సాధికారతపై చిత్తశుద్ధి ఏది?

### - సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత ఎం.రామకృష్ణ

విజయవాడ, మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేరుకే స్త్రీ సాధికారిక తప్ప మహిళల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ విజయవాడ నగర కార్యదర్శి ఎం. రామకృష్ణ ఆరోపించారు. ప్రగతిల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) నగర్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్ మున్సిపల్ ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సభ నిర్వహించారు. నగర అధ్యక్షురాలు ఆసియా అధ్యక్షత నిర్వహించిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి సైతం ఈ మహిళా దినోత్సవాలను న్యాయచర్య దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా దేశంలో పురుషులతో పాటు 50శాతం మహిళలు ఉన్నప్పటికీ సమాన హక్కులు అధికారాలు పొందకపోగా వివక్ష గురవుతున్నారని విమర్శించారు. కుల, లింగ, మత వివక్షలకు మహిళలు నేటికీ గురవుతున్నారని తెలిపారు. స్త్రీలను కార్పొరేట్ సంస్థలు వ్యాపార ప్రకటనలకు ఉపయోగిస్తున్నారు. మహిళలు పనిగంటలు తగ్గింపు కోసం రాజకీయ రిజర్వేషన్ల కోసం ఓటు హక్కు కోసం సమానత్వం కోసం నిరంతరం పోరాడుతున్న ఈ ప్రభుత్వాలు మహిళల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేయడం లేదని అన్నారు. తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఒడబ్ల్యు నగర అధ్యక్ష కార్యదర్శులు ఆసియా, రాజీ, రమిజా, హేమ, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఇరాన్- ఇజ్రాయిల్ యుద్ధంలో అమెరికా జోక్యాన్ని నివారించేందుకు

# భారత ప్రభుత్వం దౌత్యం వహించాలి

### - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య





అనంతపురం, మార్చి 8 ప్రభాతవార్త బ్యూరో: అంతర్జాతీయ పరిస్థితులపై భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు ధైర్యంగా స్పందించాలి. ప్రస్తుతం ఇరాన్ ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు తీవ్రమైన నేపథ్యంలో అమెరికా జోక్యంపై భారత ప్రభుత్వం దౌత్యాన్ని వహించాలని సిపిఐ తరఫున ప్రధాన మోడీని కోరుతున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు. ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దాడులు ఆపాలని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని కోరుతూ అనంతపురం నగరంలోని ప్రధాన వీధుల్లో సిపిఐ శ్రేణులు కొవ్వొత్తులతో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. సిపిఐ, దాని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విలేకరులతో మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద విధానాలకు భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ దాసోహం అయ్యారని, దేశ స్వాభిమానం మరియు సార్వభౌమాధికారాన్ని కాపాడడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఈశ్వరయ్య తీవ్రంగా విమర్శించారు. అమెరికా ప్రపంచ దేశాలపై పెత్తందారి ధోరణి కొనసాగిస్తూ గత దశాబ్దాలుగా అనేక యుద్ధాలకు కారణమైందని ఆయన ఆరోపించారు. గత 70 సంవత్సరాలలో అమెరికా వివిధ దేశాలపై దాడులు చేసి సహజ వనరులను దోచుకోవడమే లక్ష్యంగా యుద్ధాలను ప్రోత్సహించిందన్నారు. వియత్నాం యుద్ధం నుంచి ఇప్పటి వరకు అనేక దేశాలు అమెరికా దురాక్రమణలకు బలైపోయాయని ఆయన పేర్కొన్నారు. కొన్ని దేశాల్లో ప్రభుత్వాలను అస్థిరపరచి అక్కడి సహజ వనరులను స్వాధీనం చేసుకునే కుట్రలు అమెరికా చేస్తోందని ఈశ్వరయ్య ఆరోపించారు. అలాంటి పరిస్థితుల్లో భారతదేశం స్వతంత్ర విదేశాంగ విధానాన్ని పాటించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మాజీ ప్రధాన మంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ వంటి నాయకులు అలీన విధానాన్ని అనుసరిస్తూ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. అయితే నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత భారతదేశ విదేశాంగ విధానం అమెరికా అనుకూలంగా మారిందని ఆయన విమర్శించారు. ఇరాన్ అధ్యక్షుడిని ఇజ్రాయిల్ దాడిలో హతమార్చిన ఘటనపై భారత ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించకపోవడం బాధాకరమని అన్నారు. అంతర్జాతీయ రాజకీయాల్లో జరుగుతున్న సంఘటనలపై భారత ప్రభుత్వం ధైర్యంగా స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. భారతదేశంపై పాకిస్థాన్‌ను రెచ్చగొట్టే అమెరికా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించలేకపోతుందని ఈశ్వరయ్య విమర్శించారు. అలాగే ఇటీవల ఇరాన్ నుంచి విశాఖపట్నం పోర్టుకు వచ్చిన నౌకను అమెరికా ఒత్తిడితో వెనక్కి పంపినట్లు వార్తలు రావడం కూడా ఆందోళనకరమని అన్నారు. అమెరికా భారత ఉత్పత్తులపై 18 నుంచి 27 శాతం వరకు సుంకాలు విధిస్తుండగా, అమెరికా దిగుమతులపై భారత్ తగిన ప్రతిస్పందన ఇవ్వకపోవడం మోడీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఈశ్వరయ్య విమర్శించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి. జాఫర్, జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణ స్వామి, జిల్లా సహాయ కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, జె.రాజారెడ్డి, కర్నూలు జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి ఎన్. లెనని బాబు,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామకృష్ణ, ఎన్. శ్రీరాములు, బి. కేశవరెడ్డి, ఎ.పద్మావతి, తలారి నారాయణస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు సి. లింగమయ్య, బి.రమణయ్య, జి. చిరంజీవి, మేకల రమేష్,రాప్తాడు నియోజకవర్గం మహిళా సమాఖ్య కార్యదర్శి జి. శారదా, బికెఎస్ మండల కార్యదర్శి బండి రామకృష్ణనగర నాయకులు అల్లీపూరా, గాదిలింగ, సూర్యనారాయణ, ఏఐటియుసి నాయకులు సి.రాజు, క్రిష్ణా నాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## పోలవరం అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

### -సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విజయవాడ, మార్చి 8 ప్రభాతవార్తప్రతినిధి: పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసిత గ్రామాల్లో 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరికీ ప్యాకేజీ ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండు చేశారు. ఇప్పటి వరకూ జరిగిన అవినీతి అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదివారం విజయవాడలోని ఎంబివికెలో విలేకరుల సమావేశంలో అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కాగ్ రిపోర్టుపై సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.రవి, బప్పెన కిరణ్, మొడియం నాగమణితో కలిసి వి.శ్రీనివాసరావు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టులో నిర్వాసితులకు అన్యాయం జరుగుతోందని సిపిఎం ఏదైతే చెబుతుందో అదే కాగ్ రిపోర్టు వెల్లడించిందని తెలిపారు. పెద్దఎత్తున అవినీతి జరుగుతోందని, అనర్హులకు వందల కోట్ల రూపాయలను కట్టబెట్టారని, కాంట్రాక్టర్లు దోచుకున్నారని వీటిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని డిమాండు చేశారు. డయాఫ్రంవాల్ పేరుతో సుమారు రెండు వేల కోట్ల రూపాయలు నష్టం చేశారని, నిర్మాణానికి కావాల్సినంత సమయం ఉన్నా సరైన సమయంలో చేయకపోవడం, జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే అది దెబ్బతిందని కాగ్ నివేదికలో వెల్లడించారని తెలిపారు. దీనికి కారకులైన వారి నుండి ఆ మొత్తాన్ని ప్రభుత్వం రాబట్టాలన్నారు. అదంతా ప్రజల సొమ్మని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం స్వాధీనం చేసుకునే వరకూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పరిధిలో ఉన్న 1.06 లక్షల మంది నిర్వాసిత కుటుంబాలకు ఒకేసారి పునరావాసం కల్పించాలని డిమాండు చేశారు. భూమికి భూమి ఇవ్వాలని డిమాండు చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



# విద్యుద్ఘాతంతో ఇద్దరి మృతి

- ఉయ్యాల ఊగుతుండగా షాక్
- మనవరాలిని కాపాడబోయి అమ్మమ్మ, జాతరకు వచ్చిన బంధువు బలి
- అన్నమయ్య జిల్లా రెడ్డివారిపల్లెలో మిన్నంటిన రోదనలు

మదనపల్లె క్రైమ్, మార్చి 8 ప్రభాతవార్త: ఆనందోత్సాహాల మధ్య సాగాల్సిన గంగమ్మ జాతర ఆ కుటుంబంలో తీరని శోకాన్ని నింపింది. కురబలకోట మండలం ముదివేడు జాతర సందర్భంగా జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఒక చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. జాతర కోసం కుమార్తె ఇంటికి వచ్చిన పద్మావతి (55), బెంగళూరు నుంచి వచ్చిన వెంకటేష్ (40) లు మృతి చెందారు. ఆదివారం అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం రెడ్డివారిపల్లెలో చోటు చేసుకున్న ఈ ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

బాధితుల కథనం మేరకు రెడ్డివారిపల్లి చెందిన జగదీష్, సునీత దంపతులు ముదివేడు జాతర ఘనంగా నిర్వహించాలనుకున్నారు. ఇందు కోసం పుంగనూరు మండలం గొల్లపల్లిలో నివాసం ఉన్న సునీత తల్లి పద్మావతి, బెంగళూరులో ఉన్న తన అక్క అనిత, బావ శివకుమార్ రెడ్డి లను జాతరకు ఆహ్వానించింది. దీంతో అనిత, శివకుమార్ తమ పిల్లలు మధుప్రియ, లిఖితారెడ్డితో పాటు పక్కింటి వ్యక్తి వెంకటేష్‌తో కలిసి జాతరకు విచ్చేశారు. ఆదివారం ఉదయం అనిత కుమార్తెలు మధుప్రియ, లిఖితారెడ్డి ఇంటిముందు రేకుల షెడ్డు కింద ఏర్పాటుచేసిన ఉయ్యాలలో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో ఉయ్యాలకు విద్యుత్ సరఫరా కావడంతో పిల్లలిద్దరూ విద్యుత్ ఘాతానికి గురై గట్టిగా కేకలు వేశారు. దీనిని గమనించిన అమ్మమ్మ పద్మావతి ప్రాణాలకు తెగించి పిల్లలను ఉయ్యాల నుంచి పక్కకు నెట్టేసింది. ఆ క్రమంలో ఆమె ఉయ్యాలకు అతుక్కుపోయింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో బెంగళూరు నుంచి వచ్చిన వెంకటేష్ కూడా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దురదృష్టవశాత్తూ పద్మావతి, వెంకటేష్ ఇద్దరూ





అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన చిన్నారి మధుప్రియను వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

### రెడ్డివారిపల్లెలో విషాదం

సంతోషంగా జాతర జరుపుకోవాల్సిన సమయంలో ఒకే కుటుంబానికి చెందిన వారు మృత్యువాత పడటంతో రెడ్డివారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువుల రోదనలు మిన్నంటాయి. ముదివేడు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# వైభవంగా భూతప్పలు ఉత్సవం



## తడి బట్టలతో బోర్లా పడుకుని కోర్కెలు తీర్చుకున్న భక్తులు

రొళ్ల, మార్చి 8 ప్రభాతవార్త: శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మినరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భూతప్పల ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి శనివారం సాయంత్రమే వేల సంఖ్యలో భక్తులు ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున పూజలు అందుకున్న భూతప్పలు మారుతీ కాలనీ సమీపంలో గల ముత్తరాయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం మేళతాళాలతో పాదాల బండ వద్ద నుంచి నృత్య చేస్తూ ఆలయం వద్దకు చేరారు. ఈరముద్దమ్మదేవి ఆలయం వద్ద నుంచి దేవాలయం ఆవరణ వరకు రోడ్డుపై కిలో మీటర్ల మేర భూతప్పల రాక కోసం భక్తులు బోర్లా పడుకున్నారు. అనంతరం తడి బట్టలతో బోర్లాపడుకున్న భక్తులపై భూతప్పలు కాలు మోపుతూ నాట్య మాడుతూ ముందుకు సాగారు. భూతప్పల కాలి స్పర్శతో రోగాలు నయమవుతాయని, సంతానం భాగ్యం లేని మహిళలకు సంతానం కలుగుతుందని, పెళ్లి కాని యువతులకు పెళ్లిళ్లు జరుగుతాయని భక్తుల విశ్వాసం. మేళతాళాలతో భూతప్పలు ప్రధాన ఆలయ ప్రాంగణం చేరుకుని చుట్టు ప్రదర్శనలు చేశారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేయించుకుని సమీపాన ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం వద్దకు చేరుకుని పూజలు అందుకున్నారు.

తర్వాత ఆంజనేయస్వామి ఆలయం ఆవరణం ముందు భాగాన భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు సమర్పించిన బొరుగులు రాసి చుట్టూ ఉరాలు కొడుతుండగా భూతప్పలు నాట్య మాడారు. తర్వాత భక్తులు రాశిగా పోసి ఉంచిన బొరుగులను భూతప్పలు రాసిని భుజించారు. చదువుకున్న వారు నిర్లక్షరాస్యులు, శ్రీమంతులు, కూలిపని చేసుకుని జీవనం సాగించే బడుగు జీవులు అందరిదీ ఒకటే కోర్కె. భూతప్ప పాదస్పర్శ తగిలితే చాలన్నది సంకల్పం. అచంచలమైన భక్తి విశ్వాసం తనువంతా కనులుగా చేసుకుని భూతప్పల కోసం ఎదురుచూశారు. పాదస్పర్శతో పునీతులైనట్లుగా భావించి సంబరంగా వెళ్లిపోయారు. ఈ అపూర్వ ఘట్టం రొళ్లలో కనిపించింది. మొక్కులు ఉన్న భక్తులు ఆలయ ఆవరణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అవంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

# వైభవోపేతం కుంభాభిషేకం



**● పూర్ణాహుతితో స్వస్తి ● శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివార్ల పవిత్ర కరకమాలలతో ద్విగ్విజయంగా ఉత్సవాలు**

ఇంద్రకీలాద్రి, మార్చి 8 ప్రభాతవార్త: ఇంద్రకీలాద్రిపై వైభవంగా కుంభాభిషేక మహోత్సవం ఆదివారం పూర్ణాహుతితో స్వస్తి పలికారు. శ్రీశ్రీశ్రీ శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివార్ల కరకమలాలతో ద్విగ్విజయంగా జరిగిన ఈ కుంభాభిషేక ఉత్సవాలు భక్తుల జయజయధ్వానాలతో స్వస్తి పలికారు. యాగశాలలో మంటప పూజలు, మూలమంత్ర హవనములు, పూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం 9.34 గంటలకు ప్రధాన ఘట్టమైన కుంభాభిషేక క్రతువును మేషలగ్న పుష్కరాంశమున, శ్రీ కనకదుర్గ అమ్మ వారి ప్రధాన ఆలయ ప్రాంగణంలో అత్యంత వైభవంగా కుంభాభిషేక క్రతువు జగద్గురువులు శ్రీశ్రీశ్రీ శంకరాచార్య స్వామివార్ల పరంపరాగతానికి చెందిన శ్రీశ్రీశ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారి చేతుల మీదుగా వైదిక మంత్రపూర్వక మంగళ కార్యములతో అభిమంత్రించిన అనేక పుష్కర మహా జీవనదులు మరియు సముద్ర జలములతో మహా క ం బ ా బ ి ష క ం న ి ర ్వ హ ి ం చ ా ర ు. కుంభాభిషేకం అనంతరం ప్రధాన మూర్తులకు పవిత్ర జలాలతో మార్జనము, సంప్రోక్షణ చేశారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య వి శివప్రసాద్, ప్రధాన అర్చకులు లింగంబొట్ల దుర్గాప్రసాద్, ఆలయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ఎ.వి. రాజ మోళి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. ఎం.హరిజవహర్ లాల్, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, ఇఓ వికె శీనా నాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు, ఆలయాధికారులు పాల్గొన్నారు.

**అలరించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక నీరాజనం:** ఇంద్రకీలాద్రిపై ధర్మపథంలో భాగంగా ఆదివారం కళావేదికపై వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులను పరవశింపజేశారు. విజయవాడకి చెందిన వివిధ కోలాట బృందాల ప్రదర్శన, తెనాలికి చెందిన బృందం భక్తి సంకీర్తనలు, తాడేపల్లికి చెందిన భజన బృందాలు సామూహిక భజనలు, విజయవాడకు చెందిన శ్రీ కనకదుర్గ నృత్య మందిరం (యల్లాజోశ్యుల అనురాధ) బృందం బ్రహ్మాంజలి, పంచదశాయుధాక్షి, సుబ్రహ్మణ్యాష్టకం, నవరసం మరియు భో శంభో వంటి అంశాలతో అద్భుత నృత్య నీరాజనం సమర్పించారు.

విజయవాడకు చెందిన కె.ఎస్.ఎన్. మూర్తి మరియు బృందం (మస్తాన్ వలి, హారిణి, రమణి సుందరి (గ్రూప్) జయ జయహే, జై కనకదుర్గ వంటి కీర్తనలతో అలరించారు. వీరికి వనమాలి (ఫ్లూట్), కె. జగన్మోహిని (మృదంగం) తమ వాయిద్య సహకారాన్ని అందించారు.– ఆధ్యాత్మిక సౌరభం వెదజల్లిన పంచహారతులు:

సాయంసంధ్యాకాలంలో పవిత్ర కృష్ణానదీమతల్లికి పంచహారతులను నిర్వహించారు. కార్యక్రమంలో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారు పాల్గొని భక్తులకు అభిభాషణం చేశారు.





# మహిళల ఆర్థిక సాధికారతకు పెద్దపీట

**● మహిళలు బలంగా ఉంటే దేశం బలంగా ఉంటుంది ● రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ**

**● కస్తూరిబా కళాక్షేత్రంలో పండుగ వాతావరణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు**

**● నా ప్రతి అడుగులోనూ మా అమ్మ ఉంది: కలెక్టర్ హిమాన్షు శుక్ల ● మహిళల ఆశీస్సులతోనే ప్రజాప్రభుత్వం ఏర్పడింది: ఎమ్మెల్యే కోటంరెడ్డి ● పురాణాల నుంచే మహిళల ఔన్నత్యం స్పష్టమైంది: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి**



నెల్లూరు కలెక్టరేట్, మార్చి 8 ప్రభాతవార్త: ఆదివారం నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర కస్తూర్బ కళాక్షేత్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆధ్వర్యంలో పండుగవాతావరణంలో నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నగర మేయర్ దేవరకొండ సుజాత, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పలువురు ప్రముఖులు, జిల్లాస్థాయి అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించగా, మహిళల ఔన్యత్యాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నెల్లూరు సంగీత కళాశాల విద్యార్థి విశాల్ ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. డిఆర్‌డిఎ, ఐసిడిఎస్, మెప్మా, ఫిషరీస్ శాఖలు ఏర్పాటు చేసిన వివిధ శాఖలను అతిథులు స్వయంగా పరిశీలించి, మహిళల ప్రతిభాపాఠవాలను అభినందించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ మహిళలు బలంగా ఉంటే కుటుంబం బలంగా ఉంటుందని, కుటుంబం బలంగా ఉంటే సమాజం బలపడుతుందని, సమాజం బలపడితే దేశం మరింత శక్తివంతంగా మారుతుందని మంత్రి పేర్కొన్నారు. మహిళలకు గౌరవం ఇచ్చే సమాజమే నిజమైన అభివృద్ధిని సాధించగలదన్నారు. నేటి సమాజంలో మహిళలు విద్య, ఉద్యోగాలు, వ్యాపారాలు, రాజకీయాలు వంటి అన్ని రంగాల్లో అద్భుతమైన విజయాలు సాధిస్తూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళా పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

**నా ప్రతి అడుగులోనూ మా అమ్మ: కలెక్టర్**

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ.. మా అమ్మ సహకారం, భరోసాతోనే నేను ఈరోజు జిల్లా కలెక్టర్ స్థాయికి ఎదిగాను. నేను ఉదయం 4 గంటలకు నిద్ర లేవాలంటే మా అమ్మ 3.30 గంటలకు లేచేవారని, నా కంటే ముందుగా ఆమె నా పాఠాలు చదివేవారని, హోంవర్కు దగ్గరుండి చేయించేవారని, ఇలా నా ప్రతి అడుగులోనూ మా అమ్మ ఉంది అని సగర్వంగా కలెక్టర్ హిమాన్షు శుక్ల చెప్పారు. ఒక అమ్మగా, చెల్లిగా, భార్యగా ఇలా స్త్రీ పోషిస్తున్న పాత్రలు సమాజంలో ఆమెను స్త్రీశక్తిగా నిలబెట్టాయన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలందరి ఆశీస్సులతో రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం పాలన కొనసాగిస్తుందన్నారు. మహిళల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ హామీలను సూపర్‌హిట్ చేసి మహిళల సంక్షేమాన్ని అగ్రతాంబూలం వేస్తున్నట్లు చెప్పారు. మహిళలకు జవాబుదారీగా ఉంటూ మహిళలకు అన్నివిధాల తమ ప్రభుత్వం అండగా వుంటుందని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూడా అమలు చేస్తూ మహిళ ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తున్నట్లు ఆమె వివరించారు.

**ప్రతి మహిళ అవకాశాలను అందిపుచ్చుకోవాలి**

మేయర్ నెల్లూరు నగర మేయర్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ మహిళలందరూ ఓర్పు, సహనంతో విజయాలను అందిపుచ్చుకోవాలన్నారు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని కూడా సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధికి రూ.1,370 కోట్ల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను సత్కరించి మెమెంటోలు అందజేశారు. తొలుత మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో నిర్వహించిన ర్యాలీలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, డిఆర్‌డిఎ, మెప్మా, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్లు నాగరాజ కుమారి, లీలారాణి, హేనాసుజన్, జిల్లా టూరిజం అధికారి ఉషశ్రీ, జిల్లా మత్స్యశాఖ ఏడి చాన్‌బాషా, సెట్నల్ సిఇవో నాగేశ్వరరావు, డిఆర్‌డిఎ, మెప్మా, ఐసిడిఎస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణి

కొడవలూరు (నెల్లూరు), మార్చి 8 ప్రభాతవార్త: మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా తమ కాళ్ల మీద తాము నిలబడినప్పుడే మహిళా దినోత్సవానికి సార్థకత లభిస్తుందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కోవూరు. కొడవలూరు మండలం రాజుపాళెం గ్రామంలోని ఎఎంసి మైదానంలో నిర్వహించిన మహిళా వేడుకలలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలానికి 20 మంది చొప్పున నియోజకవర్గ పరిధిలోని బుచ్చి, కోవూరు, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట మండలాలకు చెందిన 100 మహిళలకు ఆమె కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభావంతులైన మహిళలకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సన్మానించి ప్రశంసా పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, కొడవలూరు తహసీల్దారు స్ఫూర్తి రెడ్డి, అగ్రికల్చర్ ఏడిఏ అనిత, ఇందుకూరుపేట ఏపీఎం షరితా రెడ్డి, గండవరం సర్పంచ్ ఉచ్చి రాజకుమారి, వేగూరు సర్పంచ్ కరేటి అమరావతి తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు లక్ష్మి, ఏకశిరి వెంకటరమణమ్మ, షేక్ పర్వీన్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్.ఐ. మల్లేశ్వరి సేవలు అభినందనీయం

## మల్లేశ్వరి ఇంటికి వెళ్లి అభినందించిన హోం మంత్రి అనిత



విజయవాడ, మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ సిటీ మహిళా ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవల రిటైర్ అయిన మల్లేశ్వరి సేవలను హోం మంత్రి అనిత ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత స్వయంగా ఆమె నివాసానికి వెళ్లి మల్లేశ్వరిని అభినం దించారు. మల్లేశ్వరి భర్త కూడా పోలీస్ శాఖలోనే సేవలందిస్తూ 2024 ఎన్నికల సమయంలో విధులు నిర్వహించే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం ఎంతో విషాదకరమని మంత్రి అనిత పేర్కొన్నారు. ఆ వ్యక్తిగత విషాదాన్ని అధిగమించి మల్లేశ్వరి మరింత సంకల్పంతో ప్రజలకు సేవ చేయడం అభినందనీయమని అన్నారు. తన ఆసక్తితో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు అందే కాంపెన్సేషన్ విభాగంలో చేరి, అనేక కుటుంబాలకు త్వరితగతిన పరిహారం అందేలా మల్లేశ్వరి అపారమైన కృషి చేసినట్లు మంత్రి తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు న్యాయం జరిగేలా వెంటనే కాంపెన్సేషన్ అందేలా ఆమె నిరంతరం సేవలు అందించారని కొనియాడారు. మల్లేశ్వరి కృషి వల్లే ఆంధ్రప్రదేశ్ పోలీస్ కాంపెన్సేషన్ విభాగం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడమే కాకుండా, ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రం లోనే మొదటి స్థానంలో నిలిచిందని మంత్రి అనిత వెల్లడించారు. రిటైర్ అయిన తర్వాత కూడా సేవాభావంతో ప్రజలకు సహాయం చేస్తూ ఉండటం నిజంగా గొప్ప విషయమని ఆమె అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మల్లేశ్వరి కుటుంబ సభ్యులను స్వయంగా కలవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని మంత్రి అనిత తెలిపారు. పోలీస్ శాఖకు మల్లేశ్వరి ఒక ఆదర్శమని, ఇలాంటి సేవాభావం గల వ్యక్తులు పోలీస్ శాఖకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. మల్లేశ్వరి అందించిన సేవలకు మంత్రి అనిత మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.

# మోపిదేవి ఆలయంలో కూలిన సీలింగ్... భక్తులు పరుగులు

విజయవాడ, మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా జిల్లా మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలోని ఓ షెడ్డులో సీలింగ్ కూలింది. అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించే షెడ్డులో వేసిన సిలింగ్ సగ భాగం శనివారం రాత్రి కూలిపోయినట్లు ఆలస్యంగా సమాచారం వెలుగులోకి వచ్చింది. షేడ్ కూలడంతో అందులో నిద్రిస్తున్న 30 మంది భక్తులు ప్రాణ భయంతో పరుగులు తీశారు. వీరిలో కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. 2024లో కూడా ఒకసారి ఇలాంటి ఘటనే జరిగింది అప్పుడు భక్తులు ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఇప్పుడు షెడ్డు సిలింగ్ సరిగ్గా లేదని పలువురు భక్తులు ఆలయ కార్యనిర్వాహణాధికారి దృష్టికి తీసుకుని వెళ్ళినా స్పందించలేదని ఆరోపిస్తున్నారు.



# కోనలో వైభవంగా నృసింహుని స్వర్ణ గరుడోత్సవ సేవ

రాపూరు (నెల్లూరు), మార్చి 8 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారికి ఆదివారం స్వర్ణ గరుడోత్సవ సేవ నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా తెల్లవారుజామున స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, చందనాలంకారం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికి శాంతి హోమం నిర్వహించిన అనంతరం స్వామి వారి నిత్యకళ్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి అత్యంత ప్రీతిప్రాతమైన స్వర్ణ గరుడవాహనంపై శ్రీవారిని వుంచి స్వామివారికి క్షేత్రోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, గిరిజన వాయిద్యాల మధ్య నిర్వహించిన స్వామివారి స్వర్ణ గరుడవాహన క్షేత్రోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావల్సిన భోజన, వసతి ఏర్పాట్లును ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పర్యవేక్షణలో ఆలయ సూపరింటెండెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, పెంచలస్వామి, హరిష్ ఇతర సిబ్బంది పర్యవేక్షించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

# పాల కల్తీ ఘటనలో మరొకరు మృతి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో మార్చి 8 ప్రభాతవార్త: రాజమహేంద్రవరం పట్టణంలో జరిగిన పాలు కల్తీ ఘటనకు సంబంధించిన ఆరోగ్య సమస్యల నేపథ్యంలో డెల్టా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఎస్. రామలక్ష్మి (వయసు 73) ఆదివారం తీవ్ర మూత్రపిండ వైఫల్యంతో దురదృష్టవశాత్తు మరణించినట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం మొత్తం 9 మంది రోగులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మిగిలిన రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షణలో ఉంచి, అవసరమైన అన్ని వైద్య చర్యలు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. రోగులు సంబంధిత నిపుణుల వైద్యుల పర్యవేక్షణలో వైద్య చికిత్స పొందుతున్నారని, ప్రభుత్వ ఆదేశాల మేరకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ అనంతబాబు భార్యపై నాన్ బెయిలబుల్ వారెంట్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మార్చి 8 ప్రభాతవార్త: డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబు అతని భార్య లక్ష్మీ దుర్గను కూడా అడిషనల్ చార్జ్‌షీట్‌లో ఎ2 గా చేర్చిన విషయం తెలిసిందే. రాజమండ్రి ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సునంద నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేశారు. ఆమెను ఇప్పటివరకు అరెస్టు చేయలేకపోవడంపై తీవ్ర అనుమానాలకు తావిస్తుంది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితురాలు పరారీలో ఉండడం చట్టాన్ని అవహేళన చేయడమేనని పలు ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. పరారీలో ఉన్న నిందితురాలిని వెంటనే పట్టుకుని కోర్టు ముందు హాజరుపరచడం లేకపోతే లక్ష్మీ దుర్గ ను వెంటనే ప్రకటిత నేరస్తురాలుగా ప్రకటించాలని డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# అభివృద్ధిని గాలికి వదిలివేసిన ప్రభుత్వాలు

కలువాయి (నెల్లూరు), మార్చి 8 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లాను అన్ని స్థాయిలలో అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉన్నప్పటికి గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వాలు గాలికి వదిలివేశాయని బిసివై వ్యవస్థాపక అధ్యక్షులు బోడే రామచంద్రయ్యాయాదవ్ పేర్కొన్నారు. రాబోవు రోజులలో నెల్లూరు జిల్లా నుండి బిసివై పార్టీ ఆధ్వర్యంలో జరిగే అనేక ఉద్యమాలకు సంపూర్ణ మద్దతును ప్రజల నేండి ఆశిస్తున్నామని భవిష్యత్తులో కూడా బిసిల సమస్యలపైన రాష్ట్రంలో ప్రభుత్వం చేసే అరాచకాలతోపాటు ఏదైతే దోపిడి అవినీతి పైన చేస్తున్న పోరాటంలో జిల్లా ప్రజలు పూర్తి స్దాయిలో మద్దతు అందించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో జిల్లాలో ప్రత్యామ్నాయ రాజకీయం రావలిసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. నెల్లూరు జిల్లా నుండి బలమైన పునాదుతో ముందుకు వెళతామని రాబోవు స్దానిక ఎన్నికలలోరాష్ట్ర వ్యాప్తంగా బిసివై పార్టీ ప్రధాన శిర్షికను పోషిస్తుందని అందుకు ప్రజల మద్దతు కావాలని కోరారు. ముందుగా కలువాయిలోని శివాలయం వేడుకలలో ఆయన పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.



# జగనన్న సిఎం అయితే మహిళలకు మంచి రోజులు: రోజా

విజయవాడ, మార్చి 8 ప్రభాతవార్తప్రతినిధి: జగనన్న సీఎం అయితే మహిళలకు మంచి రోజులు వస్తాయని మాజీ మంత్రి ఆర్కే రోజా వ్యాఖ్యానించారు. ఆదివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో మహిళలు ఎదిగేందుకు ఎక్కువ అవకాశం ఉంది. ఈ రోజు నేను, వరుదు కళ్యాణి ఈ స్థానంలో ఉన్నామంటే అది వైయస్ జగన్ ఇచ్చిన ప్రోత్సాహమే. రిజర్వేషన్లతో సంబంధం లేకుండా పురుషులతో పాటు ఎన్నో పెద్ద పెద్ద పదవులు ఇచ్చి ప్రోత్సహించి గౌరవించిన వైయస్ జగన్‌ని తిరిగి సీఎం చేసుకుంటేనే మళ్లీ మహిళలకు మంచి రోజులొస్తాయి. గతంలో వైయస్ సీఎంగా ఉన్నప్పుడు, చంద్రబాబు సీఎం అయ్యాక మహిళల జీవితాల్లో వచ్చిన మార్పులు మనం గుర్తించడమే కాకుండా అందరికీ తెలిసేలా చెప్పాల్సిన బాధ్యత వైయస్సార్సీపీ మహిళా విభాగానిదే. 20 నెలల చంద్రబాబు పాలన చూసి రాష్ట్రంలోని ప్రతి మహిళ విసిగిపోయింది. ఎప్పుడెప్పుడు ఎన్నికలొస్తాయా అని ఎదురు చూస్తున్నారు. మహిళా సంక్షేమ పాలన పోయి, నారాసుర పాలన వచ్చింది. చంద్రబాబు కేబినెట్‌లో అనిత, సవిత, సంధ్యలు మంత్రులు కావడం రాష్ట్ర మహిళల దురదృష్టం. హోంమంత్రిగా ఉన్న మహిళ ఆ సంగతి తప్ప అన్ని విషయాలను పట్టించుకుంటుంది. ఇంకో మహిళా మంత్రి పీఏ కారణంగా మహిళల జీవితాలు నాశనమవుతున్నాయి. ఆరేళ్ల చిన్నారి నుంచి 60 ఏళ్ల మహిళలపై అత్యాచారాలు చేస్తున్నా చూసీచూడనట్టు వదిలేస్తున్న ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేస్తున్న అనిత, సవిత, సంధ్యారాణికి మహిళా దినోత్సవంలో పాల్గొనే అర్హతే లేదు. ఒక్క చాన్స్ ఇస్తే ఆడవారి తలరాతలు మార్చేస్తానని, సుగాలి ప్రీతి పేరు వాడుకుని, ఆమె తల్లి కన్నీళ్లను వాడుకుని గెలిచిన పవన్ కల్యాణ్ వారికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. వాలంటీర్ల వేతనాలు రూ.10 వేలు చేస్తానని చెప్పి చివరికి ఉద్యోగమే లేకుండా చేసి మోసగించారు. తప్పిపోయిన 30 వేల మంది మహిళలను తీసుకొస్తానని చెప్పి 20 నెలలైనా ఆ ఊసే ఎత్తడం లేదు. రాష్ట్రంలో మహిళలందరి ధైర్యం జగనన్నే. కులం, మతం, పార్టీ చూడకుండా అందరికీ న్యాయం చేసిన ఘనత వైయస్ జగన్‌కే దక్కుతుంది. ఇవిఎంల వల్లే మనం ఓడిపోయామని ప్రతి గ్రామంలో మాట్లాడుకుంటున్నారు. 20 నెలల్లో మహిళలను పూర్తిగా వంచించిన కూటమి నాయకులు గ్రామాల్లో తిరగడానికే భయపడిపోతున్నారు. కూటమి ఎమ్మెల్యేలు మహిళలను మోసగించినా ఇందులో తప్పేముందని మాట్లాడే వారిని దేవుడే చూసుకుంటాడు. బీఆర్ నాయుడు సహా లడ్డూ గురించి తప్పుడు ప్రచారం చేసిన ప్రతి ఒక్కరినీ దేవదేవుడే వరుసపెట్టి శిక్షిస్తున్నాడు. ఆయన్ను రాజీనామా చేయించే ధైర్యం చంద్రబాబుకి కూడా లేదని ఆర్కే రోజా అన్నారు.

# మనదే టీ20 ప్రపంచకప్

## అహ్మదాబాద్‌లో బ్లూ సునామీ ●న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన సూర్యసేన ● ముచ్చటగా మూడో కప్



ఇషాన్ కిషన్ 25 బంతుల్లో 54 రన్స్

అభిషేక్ శర్మ 21 బంతుల్లో 52 రన్స్

సంజూ శాంసన్ 46 బంతుల్లో 89 రన్స్

అక్షర్ పటేల్ 27 రన్స్‌కు 3 వికెట్లు

*అహ్మదాబాద్‌లో బ్లూ సునామీ ఆవిష్కృతమైంది. బ్లూ బ్రిగేడ్ మొదట బ్యాటింగ్‌లో ధనాధన్ లాడిస్తే.. తర్వాత బౌలింగ్‌లో ప్రత్యర్థిని పేకమేడలా కూల్చారు. టీ20 ప్రపంచకప్‌లో చరిత్ర సృష్టించారు. ఫైనల్‌కు ముందు ఉన్న డౌట్స్ అన్నీ పటాపంచలు చేశారు. సౌతాఫ్రికాపై చెలరేగిన కివీస్‌ల ఆటలు బ్లూ బ్రిగేడ్ ముందు సాగలేదు.సూర్యసేన సూపర్ షోతో ముచ్చటగా మూడోసారి టీ20 ప్రపంచకప్ అందుకుంది. వరుసగా రెండోసారి కప్ సాధించింది.*

**అహ్మదాబాద్:** టీ20 ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా రికార్డు స్కోరు సాధించింది. 256 లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ మరో ఓవర్ ఉండగానే 159 రన్స్‌కు కుప్పకూలింది. టీమిండియా 96 పరుగులతో చిత్తుచేసి ముచ్చటగా మూడోసారి పొట్టి ప్రపంచకప్ అందుకుంది. టాస్ ఓడి మొదట సూర్యసేన బ్యాటింగ్‌కు దిగింది. న్యూజిలాండ్ బౌలింగ్‌ను చితక్కొడుతూ భారత టాపార్డర్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. గత మ్యాచ్‌లలో విఫలమైన అభిషేక్ శర్మ.. టైటిల్ పోరులో బ్యాట్ ఝులిపించాడు. కేవలం 18 బంతుల్లోనే 50 పరుగుల మార్కు అందుకున్నాడు. మొత్తంగా 21 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లు బాది 52 పరుగులు సాధించాడు.

ఇక మరో ఓపెనర్ సంజూ శాంసన్ సూపర్ ఫామ్ కొనసాగిస్తూ మరోసారి విజృంభించాడు. కేవలం 46 బంతుల్లోనే 5 ఫోర్లు, 8 సిక్సర్లు బాది 89 పరుగులు సాధించాడు. మరోసారి సెంచరీ మిస్సయ్యాడు. ఇషాన్ సైతం23 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. మొత్తంగా 25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లు బాది 54 పరుగులు సాధించాడు. మిగిలిన వారిలో సూర్యకుమార్ డకౌట్ కాగా.. హార్దిక్ పాండ్యా (13 బంతుల్లో 18) నిరాశపరిచాడు. తిలక్ వర్మ 6 బంతుల్లో 8 పరుగులతో అజేయంగా నిలవగా.. శివం దూబే 8 బంతుల్లోనే 3 ఫోర్లు, 2 సిక్స్‌లు బాది 26 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి టీమిండియా 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. న్యూజిలాండ్ బౌలర్లలో జేమ్స్ నీషమ్ ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి సత్తా చాటగా.. మ్యాట్ హెన్రీ, రచిన్ రవీంద్ర తలా ఒక వికెట్ పడగొట్టారు.

### తిప్పేసిన అక్షర్ పటేల్

అనంతరం భారీ లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ తడబడింది. సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్(52), ఫిన్ అల్లెన్(9)ను బౌలర్లు చక్కగా కట్టడి చేశారు. అక్షర్ పటేల్ భారత్‌కు తొలి బ్రేక్ అందించాడు. ఫిన్‌ను తొందరగానే పెవిలియన్ పంపాడు. ఆ వెంటనే క్రీజ్‌లోకి వచ్చిన రచిన్ రవీంద్ర(1)ను బుమ్రా బోల్తా కొట్టించాడు. ఇషాన్ అద్భుత డైవ్‌తో క్యాచ్ అందుకున్నాడు. గ్లేన్ ఫిలిప్స్(5)ను అక్షర్ క్లీన్ బౌల్డ్ చేయడంతో కివీస్ 47 రన్స్‌కే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

### బూమ్ బూమ్ బుమ్రా

సీఫెర్ట్ ధాటిగా ఆడాడు. అర్ధసెంచరీతో ఒంటరిపోరాటం చేశాడు. మరోఎండ్‌లో చాంప్‌మన్(17)ను హార్దిక్, డారెల్ మిచెల్(17)ను అక్షర్ పటేల్ అవుట్ చేశారు.చివర్లో కెప్టెన్ మిచెల్ సాంట్నర్ ధాటిగా ఆడాడు. 35 బంతుల్లో 43 రన్స్ చేశాడు. బుమ్రా ఒకే ఓవర్లో జేమ్స్ నీషామ్(8), మాట్ హెన్రీ(0)ను వరుస బంతుల్లో అవుట్ చేశాడు. సాంట్నర్‌ను కూడా క్లీన్ బౌల్డ్ చేశాడు. చివరి వికెట్ అభిషేక్ శర్మ తీయడంతో న్యూజిలాండ్ మరో ఓవర్ ఉండగానే 159 రన్స్‌కు ఆలౌటైంది. భారత బౌలర్లలో బుమ్రా 4 వికెట్లు, అక్షర్ పటేల్ మూడు వికెట్లు..హార్దిక్, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ తలా ఓ వికెట్ తీశారు.

ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో నెగ్గి టీమిండియా మూడోసారి ట్రోఫీని దక్కించుకొని చరిత్ర సృష్టించింది. మరే జట్టు కూడా మూడు టైటిళ్లను గెలుచుకోలేదు. ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ తర్వాత భారత్‌కు కప్ అందించిన సారథిగా సూర్యకుమార్ యాదవ్ నిలిచాడు. ఆతిథ్య జట్టు స్వదేశంలో ట్రోఫీ గెలవడం ఇదే మొదటిసారి. 2007, 2024లో విశ్వవిజేతలుగా నిలిచింది. బ్లూ బ్రిగేడ్ కప్ సాధించడంతో దేశవ్యాప్తంగా సంబరాలు అంబరాన్ని అంటాయి.

## పరుగులు వచ్చాయిలా..

**ఓవర్1(7 రన్స్):** మాట్ హెన్రీ వేసిన ఈ ఓవర్ అయిదో బంతికి సంజూ మిడాన్ మీదుగా స్టాండ్‌లోకి పంపి భారత్ పరుగుల ఖాతా తెరిచాడు.
**ఓవర్2(5 రన్స్):** స్పిన్నర్ గ్లేన్‌ఫిలిప్స్ పొదుపుగా బౌలింగ్ చేశాడు. అభిషేక్ సింగిల్‌తో తన రన్స్ ఖాతా తెరిచాడు. మూడు సింగిల్స్ వచ్చాయి.
**ఓవర్3(15 రన్స్):**డఫీ ఓవర్‌లో అభిషేక్ రెండు,సంజూ ఓ ఫోర్ బాదారు.
**ఓవర్4(25 రన్స్):** ఫెర్గ్యూసన్ ఓవర్లో భారత్ స్కోరు 50రన్స్ దాటింది. ఈ ఓవర్లో అభిషేక్ కీపర్ మీదుగా బౌండరీ,మిడాఫ్ మీదుగా సిక్స్‌తో విరుచుకుపడ్డాడు. సంజూ కూడా తనవంతుగా సిక్స్, ఫోర్ బాదాడు.
**ఓవర్5(20 రన్స్):** హెన్రీ వేసిన ఈ ఓవర్లోనూ ఓపెనర్లు దంచికొట్టారు. ఇద్దరూ చెరో సిక్స్‌తో 20 రన్స్ సాధించారు.
**ఓవర్6(20 రన్స్):** డఫీ వేసిన ఈ ఓవర్లో అభిషేక్ ఒక్కడే 3బౌండరీలు, ఓ సిక్స్ బాదాడు. 18 బంతుల్లోనే అభిషేక్ 50 రన్స్ కంప్లీట్ చేశాడు. పవర్ ప్లేలో భారత్ వేగంగా 92 రన్స్ చేసింది.
**ఓవర్7(6 రన్స్):** కెప్టెన్ సాంట్నర్ పొదుపుగా 6 పరుగులే ఇచ్చాడు. మొదటి 3 బాల్స్ డాట్‌గా ఆడిన సంజూ.. స్వేర్ బౌండరీ సాధించాడు.
**ఓవర్8(12 రన్స్):** రచిన్ రవీంద్ర వస్తూనే తొలి బంతికే అభిషేక్(58)ను బోల్తా కొట్టించాడు. ఆఫ్ స్టంప్‌కు దూరంగా వేసిన బంతిని వేటాడబోయి కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఇషాన్ కిషన్ వస్తూనే డబుల్‌తో ఖాతా తెరిచి బ్యాక్ టు బ్యాచ్ బౌండరీలు బాదాడు. భారత్ స్కోరు వంద దాటింది.
**ఓవర్ 9(5 రన్స్):** సాంట్నర్ తన రెండో ఓవర్‌లోనూ సంజూ, అభిషేక్‌ను కట్టడిచేశాడు. ఈ ఓవర్లో అయిదు సింగిల్స్ మాత్రమే ఇచ్చాడు.
**ఓవర్10(12 రన్స్):** నీషమ్ వేసిన ఈ ఓవర్లో సంజూ, కిషన్ చెరో బౌండరీ బాదారు.సగం ఓవర్లు పూర్తయ్యే సరికి భారత్127రన్స్ చేసింది.
**ఓవర్ 11(10 రన్స్):** సాంట్నర్ మూడో బంతికి కిషన్ మిడ్ వికెట్ మీదుగా స్విప్ షాట్‌తో సిక్స్ బాదాడు. చివరి బంతికి సింగిల్ తీసి సంజూ మరో అర్ధసెంచరీ (33 బంతుల్లో) పూర్తిచేశాడు.
**ఓవర్12(24 రన్స్):** ఫెర్గ్యూసన్ వేసిన ఈ ఓవర్లో సంజూ జూలు విదిల్చాడు. బ్యాక్ టు బ్యాక్ సిక్స్‌లు బాదాడు. ఒకటి స్క్వేర్ లెగ్ మీదుగా, ఇంకొకటి సైట్ స్క్రీన్ వైపు. మరో ఎండ్‌లో ఇషాన్ కూడా లాంగ్‌ఆన్ సిక్స్ బాదడంతో 24 రన్స్ వచ్చాయి. భారత్ స్కోరు 150 మార్కు దాటింది.
**ఓవర్ 13(10 రన్స్):** హెన్రీ మొదటి బంతికే లాంగ్ ఆన్ మీదుగా ఇషాన్ సిక్స్ కొట్టాడు. మరో నాలుగు సింగిల్స్‌తో పది రన్స్ వచ్చాయి.
**ఓవర్ 14(20 రన్స్):** బౌలింగ్‌కు వచ్చిన స్పిన్నర్ రచిన్ రవీంద్ర వేసిన ఈ ఓవర్ చివరి మూడు బంతులను సంజూ స్టాండ్స్‌లోకి తరలించి స్టేడియాన్ని హోరెత్తించాడు. 20రన్స్ వచ్చాయి.
**ఓవర్ 15(12 రన్స్):** సాంట్నర్ వేసిన ఈ ఓవర్ రెండో బంతికి డీప్ మిడ్ వికెట్ మీదుగా ఇషాన్ కిషన్ సిక్స్‌గా మలిచాడు. సింగిల్‌తో హాఫ్ సెంచరీ(23 బంతుల్లో) పూర్తిచేశాడు. చివరి బంతికి బౌండరీ బాది టీమిండియా స్కోరును 200 మార్కు దాటించాడు.
**ఓవర్ 16(3 వికెట్లు, ఒక రన్):** నీషామ్ పేస్ మ్యాజిక్. ఈ ఓవర్లో మూడు వికెట్లు తీసి టీమిండియాను దెబ్బతీశాడు. హైఫుల్ టాస్ తో మొదట సంజూ(89)ను... లో ఫుల్ టాస్‌తో ఇషాన్(54)ను బోల్తా కొట్టించాడు. చివరి బంతికి సూర్యకుమార్(0)ను అవుట్ చేశాడు. చివరి రెండు బంతులకు రెండు వికెట్లు. కేవలం ఒకే రన్ వచ్చింది.
**ఓవర్17 (7 రన్స్):** డఫీ ఓవర్లో ధాటిగా ఆడడంలో హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ విఫలమయ్యారు.ఓ డబుల్, 5 సింగిల్స్‌తో 7రన్స్ వచ్చాయి.
**ఓవర్18 (9 రన్స్):** నీషామ్ వేసిన ఈ ఓవర్లోనూ పొదుపుగా పరగులిచ్చాడు. 16బంతుల తర్వాత భారత్ ఖాతాలో చివరకు బౌండరీ చేరింది. హార్దిక్ పాండ్యా బౌండరీ ఖాతా తెరిచాడు.
**ఓవర్ 19(11 రన్స్):** మాట్ హెన్రీ తొలి బంతికే డీప్ మిడ్‌వికెట్ మీదుగా స్టాండ్స్ లోకి పంపిన హార్దిక్‌ను స్లో బంతితో బోల్తా కొట్టించాడు. మూడు సింగిల్స్,ఓ డబుల్‌తో 11 రన్స్ వచ్చాయి. చివరి 4 ఓవర్లలో భారత్ 28 రన్స్ మాత్రమే సాధించి 4 వికెట్లు కోల్పోయింది.
**ఓవర్ 20(24 రన్స్):** నీషామ్ వేసిన ఈ ఓవర్లో శివమ్ దూబే జూలు విదిల్చాడు. మొదటి బంతికి బౌండరీ, ఆతర్వాతి రెండు బంతుల్లో బ్యాక్ ట బ్యాక్ సిక్స్‌లు, ఆ తర్వాత మరో రెండు బౌండరీలతో మొత్తం 24 రన్స్ పిండుకున్నాడు. దీంతో భారత్ స్కోరు 250 దాటింది.

## రన్నరప్‌గా నిలిచిన లక్ష్యసేన్



**బర్మింగ్హామ్:** భారత్ షట్లర్ లక్ష్యసేన్ చరిత్ర సృష్టించే అవకాశాన్ని తృటిలో చేజార్చుకున్నాడు. ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ ఛాంపియన్ షిప్ ఫైనల్‌కు రెండోసారి చేరుకున్నా రన్నరప్‌తోనే సరిపెట్టాడు.చైనీస్ తైపీ ప్లేయర్ లిన్ చున్‌యీ వరుస గేమ్‌ల్లో లక్ష్యసేన్‌పై నెగ్గి ట్రోఫీ అందుకున్నాడు.తొలి గేమ్‌ను 15-21 తో చేజార్చుకున్నాడు. రెండో గేమ్‌లో పుంజుకున్న లక్ష్యసేన్ 10-5తో ఆధిక్యంలో నిలిచాడు. ఆ తర్వాత నుంచి పోటాపోటీగా స్కోర్ చేస్తూ 20-20 తో సమంగా నిలిచారు.ఈ దశలో లక్ష్యసేన్ కొన్ని పొరపాట్లు చేయగా, 2 పాయింట్లు సాధించి లిన్ చున్‌యీ 22-20తో ముగించాడు.

## పెర్త్ టెస్ట్‌లో అమ్మాయిలకు ఓటమి



**పెర్త్:** వాకా స్టేడియం వేదికగా జరిగిన పింక్ బాల్ టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా మహిళల జట్టుకు పరాభవం ఎదురైంది.3రోజుల్లోనే ముగిసిన టెస్ట్‌లో ఆస్ట్రేలియా మహిళల జట్టు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మూడో రోజు ఓవర్ నైట్ స్కోరు 6 వికెట్లకు 105 పరుగులతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ విమెన్స్.. లంచ్ లోపే మిగతా నాలుగు వికెట్లను కోల్పోయింది.ఓవర్ నైట్ స్కోరుకు 44 పరుగులు మాత్రమే జోడించి 149 రన్స్‌కు ఆలౌటైంది. టెస్ట్ అరంగేట్రం చేసిన ప్రతీకా రావల్(63) అర్ధసెంచరీతో ఒంటరిపోరాటం చేసింది. శేఫా రాణా 30 పరుగులు చేసింది.

# వాణిజ్యం

## అనిల్ అంబానీపై సిబిఐ కేసు

### పిఎన్‌బిని రూ.1085 కోట్లు మోసం చేశారని ఆరోపణ



**ముంబయి, మార్చి 8:** పారిశ్రామిక వేత్త అనిల్ అంబినిపై కేంద్ర దర్యాప్తుసంస్థ సిబిఐ మరోకేసునమోదుచేసింది. రిలయన్స్‌కమ్యూనికేషన్స్, మాజీ డైరెక్టర్ మంజరి అశోక్ కేకర్‌తో కలిసి సుమారు రూ.1085 కోట్ల బ్యాంకు మోసానికి సంబంధించి ఈ కేసునమోదుచేసింది. ఈనెల ఐదోతేదీ ఎఫ్‌ఐఆర్‌నమోదుచేసింది. పంజాబ్‌నేషనల్ బ్యాంకునుంచి అందిన ఫిర్యాదుమేరకు ఈ కేసునమోదుచేసినట్లు తెలిపింది. బ్యాంకు ముంబయి శాఖలోని సంక్లిష్ట ఆస్తుల నిర్వహణ విభాగం చీఫ్‌మేనేజర్ సంతోష్‌కృష్ణ అన్నవరపు ఈ ఫిర్యాదుచేసారు. పిఎన్‌బితోపాటు యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలను 2013, 2017 సంవత్సరాల్లో మోసంచేసారని దీనివల్ల 1085.19 కోట్లు రెండు బ్యాంకులకు నష్టం వాటిల్లిందని చీఫ్‌మేనేజర్ వివరించారు. ఈ నష్టంలో పిఎన్బీకి రూ.621.39 కోట్లు, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.463.80 కోట్లు ఉందని బ్యాంకు చీఫ్‌మేనేజర్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేరపూరిత కుట్ర, అనుచిత ధోరణితో బ్యాంకులనుంచి రుణాలు పొందేందుకు ప్రయత్నించారని ఆరోపణలపై కేసనమోదయింది. అలాగే ఈ రుణమొత్తాలను ఇతర ప్రయోజనాలకు మళ్లించి దుర్వినియోగంచేసారని, నిధుల దుర్వినియోగం, నేరపూరిత విశ్వాసఘాతుకం వంటి అభియోగాలను నమోదుచేసారు. 2017లోనే వీటిని ఎన్పీయేలుగా ప్రకటించారు. 2021లో మోసపూరిత ఖాతాగా ప్రకటించారు. బిడిఒ ఇండియా ఎల్ఎల్‌పి నిర్వహించిన ఆడిట్‌లో బ్యాంకు నిధులు లావాదేవీలు అన్నీ లోపాలతో ఉన్నట్లు తేలిందని సిబిఐ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐపిసిలోని 120బి, 420, అవినీతినిరోధక చట్టం పరిధిలో ఈకేసునమోదయినట్లు సిబిఐ ప్రకటించింది.



## నాలుగు ట్రేడింగ్‌లలో రూ.21వేల కోట్ల ఎఫ్‌పిఐలు వెనక్కి!

**ముంబయి, మార్చి 8:** విదేశీ ఇన్వెస్టర్లు గడచిన నాలుగు ట్రేడింగ్‌లలో దేశీయ స్టాక్ మార్కెట్లనుంచి సుమారు రూ.21 వేలకోట్లు నిధులు వెనక్కి తీసుకుననట్లు తేలింది. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో పెట్టుబడులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అంచనావేసిన విదేశీ ఇన్వెస్టర్లు అప్రమత్తం అయినట్లు మార్కెట్ల ధోరణులు కనిపిస్తున్నాయి. విదేశ ఈపోర్టుఫోలియో ఇన్వెస్టర్లు భారతీయ ఈక్విటీల్లో ఫినరబవరి నెలలో రూ.22, 615 కోట్లు పెట్టుబడులు పెట్టారు. అంత కుముందు ఎఫ్‌పిఐలు మూడు సెషన్లలో తమ షేర్ల పెట్టుబడులు వెనక్కితీసుకు న్నారు. రూ.35,962 కోట్లు జనవరిలో ను, గత ఏడాది డిసెంబరులో రూ.22, 611 కోట్లు, నవంబరులో రూ.3765 కోట్లు వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల రెండు ఆరు తేదీలమధ్యలోనే ఎఫ్‌పిఐలు ఎక్కువ ఈక్విటీలను విక్ర యించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలే ఇందుకు కారణమని మార్కెట్ నిపుణులు చెపుతున్నారు. అమెరికా ఇజ్రాయెల్ రెండుదేశాలు కూడా ఇరాన్‌పై సంయుక్త దాడులుచేఇ ఇరాన్‌సుప్రీం నేత అయతొల్లాఅలీఖమైనీని హత్యచేసినట్లు తేలింది. హార్మొజ్‌జలసంధిని మూసివేయడంతో బ్రెంట్‌ముడిచమురు కూడా బ్యారెల్‌కు 90 డాలర్లుగా కొనసాగింది. దీనికితోడు డాలర్ రూపాయి చెలామణి 92గా నడించింది. విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు విత్‌డ్రాచేసినా మార్కెట్లకు దేశీయ ఇన్వెస్టర్లు కొంత దన్నుగా నిలిచారు. దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు భారీ స్థాయిలోనే పెట్టుబడులు పెట్టారు.





## ప్రైమరీ మార్కెట్లకు 5 కంపెనీల

# ఐపిఒలు

**ముంబయి, మార్చి 8:** ప్రైమరీ మార్కెట్లకు మళ్లీ ఐపొలు వస్తున్నాయి. ఈ వారం ఏకంగా 5 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలకు వస్తున్నాయి. స్టాక్ మార్కెట్ల నుంచి ఈ కంపెనీలు రూ. 6,578 కోట్లకు పైగా నిధులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇటీవల వచ్చిన చివరి 8 ఐపీఓలలో 7 ఐపీఓలు నష్టాలు మిగిల్చాయి. ప్రస్తుతం మార్కెట్ బలహీనంగా ఉండమే ఇందుకు ప్రధాన కారణమని నిపుణుల అంచనా. గ్రే మార్కెట్ ప్రీమియం తక్కువగా ఉంది. అయితే, ఈ వారం వచ్చే ఐపీఓలు లాభాలు అందించవచ్చన్న అంచనాలున్నాయి. రాజ్‌పుతన స్టెయిన్‌లెస్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ ఈనెల 9న రోజున సబ్‌స్క్రిప్షన్ కోసం ఓపెన్ అయి 11వ తేదీ వరకు కొనసాగుతుంది. మార్కెట్ నుంచి రూ. 255 కోట్లు సమీకరించనుంది. తాజా షేర్ల జారీతో పాటు ఆఫర్ ఫర్ సేల్ ద్వారానూ షేర్ల విక్రయాలు చేపడుతోంది. ఇష్యూధర రూ. 116రూ. 122 గా నిర్ణయించారు. ఈ కంపెనీ స్టెయిన్‌లెస్ స్టీల్ ప్రొడక్ట్స్, బిలెట్స్, బార్స్ వంటివి తయారు చేస్తోంది. గుజరాత్ నుంచి వ్యాపారం నిర్వహిస్తోంది. ఇన్నోవిజన్ కంపెనీ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ కోసం 10వ తేదీ ఓపెన్ అవుతుంది. 12 వ తేదీతో ముగుస్తుంది. మార్కెట్ నుంచి రూ. 323 కోట్లు సమీకరించనుంది. రూ. 255 కోట్లు విలువైన ఫ్రెష్ షేర్ల జారీతో పాటు ఆఫర్ ఫర్ సేల్ సైతం ఉంది. ఇక షేరు ధర రూ. 521-548 గా నిర్ణయించారు. ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌హెచ్ఏఐ అనుబంధ సంస్థ అయిన ఈ రాజ్‌మార్గ్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ 11వ తేదీనుంచి 13వ తేదీ వరకు కొనసాగనుంది. మార్కెట్ నుంచి రూ.ఆరువేల కోట్లు సమీకరించనుంది. ఈవారం వస్తోన్న ఐపీఓల్లో ఇదే అతిపెద్ద ఐపీఓగా నిలుస్తోంది. షేరు ధరల శ్రేణి రూ. 99-100 గా నిర్ణియంచారు. ఈ కంపెనీ 5 టోల్ రోడ్ అసెట్లు కలిగి ఉంది. మొత్తం 260 కిలోమీటర్ల రోడ్లు నిర్వహిస్తోంది. ఈనెల 24వ తేదీన లిస్టింగ్ జరుగుతుంది. స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్ కంపెనీ ఐపీఓ 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ సంస్థ 4.22 కోట్ల షేర్లను ఐపిఒకు తెస్తోంది. ప్రైస్ బ్యాండ్ ప్రకటించలేదు. ఈ సంస్థ ఎయిర్ ఫ్రైట్, ఓషన్ ఫ్రైట్, ట్రకింగ్, వేర్ హౌసింగ్, కస్టమ్స్ క్లియరెన్స్ వంటి సేవలు అందిస్తోంది. ఎయిర్ ఇండియా కార్గో, టర్కిష్ ఎయిర్‌లైన్స్, లుఫ్తాన్సా మొదలైన సంస్థలు ఈ కంపెనీకి క్లయింట్లుగా ఉన్నాయి. ఆప్సిస్ ఏరోకామ్ ఎస్ఎంఈ విభాగం నుంచి వస్తున్న ఐపీఓ ఇది. మార్చి 11వ తేదీనే సబ్‌స్క్రిప్షన్ ఓపెన్ అవుతుంది. మార్చి 13వ తేదీ వరకు కొనసాగుతుంది. ప్రైమరీ మార్కెట్ నుంచి రూ. 3536 కోట్లు సమీకరించనుంది. ప్రైస్ బ్యాండ్ రూ. 104-110 గా నిర్ణయించారు. ఈ కంపెనీ ఏరోస్పేస్, డిఫెన్స్, హెల్త్‌కేర్ సెక్టార్లకు ప్రెసిషన్ ఇంజినీరింగ్ కాంపోనెంట్స్ తయారు చేస్తుంది.

## మహిళలకోసం బ్యాంకులు ప్రత్యేక పథకాలు!





**ముంబయి, మార్చి 8:** మహిళల కోసం స్పెషల్ శాలరీ అకౌంట్ ప్రారంభించినట్లు ప్రైవేటురంగంలోని యెస్ బ్యాంక్ ప్రకటించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల ఆర్థిక, జీవన శైలి అవసరాలకు అనుగుణంగా ఈప్రత్యేక ఖాతాను రూపొందించింది. యెస్ ఎసెన్స్ ఉమెన్స్ శాలరీ అకౌంట్లో మొదటి ఏడాది ఉచితలాకర్ సౌకర్యం, ఏడాది పాటు రూ.5లక్షల వరకు కాంప్లిమెంటరీ హెల్త్ కవర్ లభిస్తాయి. డెబిట్ కార్డు ద్వారా ఎంపిక చేసిన విభాగాల్లో 5 శాతం క్యాష్ బ్యాక్ ఏడాదికి రూ.6000 వరకు పొందవచ్చు. మొదటి ఏడాది రూ.5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ లభిస్తుందని చెప్పింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ప్రభుత్వ దిగ్గజ బ్యాంక్ ఎస్‌బిఐ మహిళల ఆర్థిక సాధికారత కోసం 500 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.4590 కోట్ల సామాజిక రుణ సౌకర్యాన్ని తీసుకొస్తున్నట్లు తెలిపింది. మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఎల్ అండ్ టీ ఫైనాన్స్ సరికొత్త హోమ్ లోన్ స్కీమ్ తీసుకొచ్చింది. స్ఫూర్తి పేరుతో ఈ స్పెషల్ గృహ రుణ పథకాన్ని లాంచ్ చేసింది. హోమ్ లోన్స్ పై గరిష్ఠంగా 25 ఏళ్ల, పారిశ్రామిక ఆస్తుల హామీతో 12 ఏళ్ల వరకూ టెన్యూర్ వ్యవధితో ఈ రుణాలు అందిస్తున్నట్లు తెలిపింది. వ్యాపారంలో కనీసం 50 శాతం వాటా ఉండి, రూ.5 లక్షల వార్షిక లాభం పొందే మహిళలు ఈ రుణాలు పొందేందుకు అర్హులుగా పేర్కొంది. తక్కువ వడ్డీ రేట్లు, సడలించిన రూల్స్ తో రూ.75 లక్షల వరకు లోన్ పొందవచ్చని తెలిపింది.



## ఫండ్స్ నిర్వహణలో మహిళలు టాప్

### 49 మంది మహిళలు రూ.13.45 లక్షలకోట్ల ఫండ్స్ పర్యవేక్షణ

**న్యూఢిల్లీ,మార్చి 8:** అసెట్‌మేనేజ్‌మెంట్ రంగంలోకూడా మహిళలు భారత్‌లో ద్విముఖంగా రాణిస్తున్నారు. మొత్తం49 మంది మ్యూచువల్‌ఫండ్ మహిళా మేనేజర్లు సమిష్టిగా రూ.13.45 లక్షలకోట్ల ఫండ్స్‌ను నిర్వహిస్తున్నారు. వీరిలో టాప్ ఐదుగురు రూ.6.1 లక్షలకోట్ల ఫండ్స్ పర్యవేక్షిస్తున్నట్లు తేలింది. ఆర్థికసేవలు, ఫండ్స్, ఈక్విటీ రంగాల్లోకూడా మహిళల భాగస్వామ్యం పెరుగుతున్నది. అలాగే ఫండ్స్‌పర్యవేక్షణలో కూడా మహిళా చీఫ్‌ల సామర్థ్యం మరింత పెరుగుతున్నది. ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్‌లో మాన్సి సజేజా సుమారుగా రూ.1.4 లక్షలకోట్ల ఫండ్ నిర్వహిస్తున్నారు. హైబ్రిడ్ అసెట్ కేటాయింపు వ్యూహాల్లో ఆమెకు మంచి అనుభవం ఉంది. ఈక్విటీ డెట్ రంగాలపైనా మంచి పట్టు ఉంది. ఎస్‌బిఐ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్‌ఫండ్ వంటి వాటిని సమర్థవంతంగా నిర్వహించారు. అలాగే ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ సర్వీసెస్‌కు సంబంధించి అశ్విని షిండే రెండోస్థానంలోనిలిచారు. మొత్తం 47 విభిన్న స్కీమ్‌లు ఆమె నిర్వహిస్తున్నారు. ఈక్విటీ సేవింగ్స్, మద్యేమార్గ వ్యూహాలతో ఆమె ముందుకు వెళుతున్నారు. అలాగే నిప్పన్ ఇండియా మ్యూచువల్‌ఫండ్ కింజాల్ దేశాయి కూడా రూ.1.37 లక్షలకోట్ల విలువైన 24 ఫండ్‌స్కీమ్స్ పర్యవేక్షిస్తున్నారు. మిడ్, స్మాల్‌క్యాప్ సెక్టార్లలోనే ఆమె మంచి పనితీరుచూపించారు.

అలాగే నిప్పన్‌లోనే మీనాక్షి దావార్‌కూడా టాప్ స్థానంలో ఉన్నారు నిప్పన్ ఇండియా మార్కెట్ విలువలను 15.92శాతం పెంచారు. ఆదిత్యబిర్లా సన్‌లైఫ్ సునైనా దా చున్హాకూడా మంచి అనుభవశాలి. క్రెడిట్‌రిస్క్ ఫండ్ నిర్వహణలో ఆమె 9.52శాతం వార్షిక రిటర్నులు సాధించారు. ఈ ఫండ్‌ను టాప్‌స్థాయిలోకి తెచ్చారు. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్‌లో రాజసా కాకులవరపు కూడా సీనియర్ రీసెర్చి అనలిస్టుగా మంచి నితీరుచూపించారు. ఫ్రాంక్లిన్ ఇండియా ఫ్లెక్సిక్యాప్‌ఫండ్ ఆమె ఆధ్వర్యంలో 14.14శాతం వార్షిక రిటర్నులు తెచ్చిపెట్టింది. యాక్సిస్ ఎంఎఫ్‌లో కృష్ణా ఎన్ కూడా రూ.1.35 లక్షలకోట్ల ఫండ్ నిర్వహిస్తున్నారు. అలాగేఏక్తాగాలా కూడా మొత్తం 30 స్కీమ్‌లు నిర్వహించడం గమనార్హం.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 5-69, 7Pratipadu, Pentapadu (M), West Godavari Dist., Tadepalligudem-534101. Telefax: 08818-220791, 225046, RNI?No. ARTEL 2004/13724 Editer: "Damerla Saibaba responsible for selection of new under the PRB Act. Read: No H/SD/337/12-14. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

## మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది -ఎమ్మెల్యే పితాని

పెనుమంట్ర, మార్చి 08, (ప్రభాతవార్త) : మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ పేర్కొన్నారు. ఆచంట గ్రామంలోని కమ్మ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత, అభ్యున్నతి కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఆయన తెలిపారు. మహిళలు ఉద్యోగ, రాజకీయ, శాస్త్ర సాంకేతిక, క్రీడా రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పలు పథకాలను వివరించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు డ్వాక్రా వ్యవస్థను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని ఆయన అన్నారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆడపిల్లలకు మగవారితో సమానంగా ఆస్తి హక్కులు కల్పించి మహిళల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. రానున్న రోజుల్లో చట్టసభల్లో మహిళలకు ఇంకా అధిక ప్రాతినిధ్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తోందని చెప్పారు.



## మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలి
### -జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

భీమవరం మర్చి 8 ప్రభాతవార్త : ప్రకాశం చౌక్ నుండి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యం, శారీరక దృఢత్వంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన 2కె రన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొని రన్‌ను ప్రోత్సహించారు. మహిళలు మరియు యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని 2 కె రన్‌ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్య పరంగా, మానసికంగా దృఢంగా ఉండి ఆదర్శప్రాయమైన జీవనం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు కుటుంబానికి వెన్నుముకలా ఉంటారని, వారు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా, సమాజం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. శారీరక దృఢత్వం మంచి ఆరోగ్యానికి పునాది అని పేర్కొంటూ ప్రతిరోజూ కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలని మహిళలకు సూచించారు. మహిళలు నేటి సమాజంలో అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ విశేష ప్రతిభ కనబరుస్తున్నారని కలెక్టర్



అభినందించారు. తమ హక్కుల సాధనతో పాటు సమాజపట్ల ఉన్న బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వర్తిస్తూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ సతీమణి వెంకటేశ్వరి దేవి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సతీమణి లక్ష్మీ శృతి, ఏఎంసీ చైర్మన్ కలిదిండి సుజాత, డి.ఎస్.పి రఘువీర్ విష్ణు, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఏవి సూరిబాబు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.కీర్తి కిరణ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, వైద్యులు, వారి కుటుంబ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయటమే కూటమీ ప్రభుత్వ లక్ష్యం
# మంత్రి కొలుసు పార్థసారధి

నూజివీడు, మార్చి08 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఏటా లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. నూజివీడులో ఆదివారం పాత్రికేయుల సమావేశంలో మంత్రి పార్థసారధి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి, సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళల సంక్షేమం, భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నదని రాష్ట్రంలో ఏటా లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలోని మహిళల ఆర్థికాభివృద్ధికి డ్వాక్రా సంఘాల ద్వారా 38 వేల కోట్ల రూపాయలు అందించామని తల్లికివందనం కార్యక్రమం ద్వారా ఏటా 67. 20 లక్షల మంది తల్లుల ఖాతాలకు 10, 090 కోట్ల రూపాయలు జమ చేస్తున్నామన్నారు. విద్యకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు చదువుకున్న యువతకు ఉద్యోగ ఉపాధి, అవకాశాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. స్త్రీ శక్తి పథకం కింద 50 కోట్ల మంది మహిళలు ప్రయాణం చేశారని,. 2963 కోట్ల రూపాయలు ఖర్చు చేసామన్నారు. బస్సు చార్జీలను భరించలేని ఎన్నో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరంగా ఉంటున్నారని, అటువంటి వారు ఉచిత బస్సు వినియోగించుకుని తమ గ్రామం దగ్గరలోని కళాశాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, దూరప్రాంతంలో ఉద్యోగాలు చేస్తున్న మహిళలు ఉచిత బస్సు వినియోగించుకుంటున్నారు. రాష్ట్రంలో ఇంతవరకు ఉచిత వంట గ్యాస్ పథకంలో రాష్ట్రంలోని 1. 08 కోట్ల మంది మహిళలకు గ్యాస్ సిలండర్లు అందించామన్నారు. మెగా డిఎస్సి లో 7955 మంది మహిళలకు ఉద్యోగాలు అందించామని, అదేవిధంగా



పోలీస్ కానిస్టేబుళ్ల నియామకంలో వెయ్యి మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. మహిళల సమస్య పరిష్కారం, మహిళల భద్రత కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. రాష్ట్రంలో సర్వైకల్ కాన్సర్ బారిన మహిళలు పడకుండా మహిళలకు, పాఠశాల, కళాశాలల విద్యార్థినిలకు ఉచితంగా సర్వైకల్ కేన్సర్ నివారణ వాక్సిన్ ను అందిస్తున్నామన్నారు. నూజివీడు ప్రాంతంలో మామిడి కాయ పొడి తయారీతో 'అమెచ్యూర్' పౌడర్ పరిశ్రమ, మునగాకు పొడి తయారీకి 'మొరింగా పొడి' పరిశ్రమలను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీటిని మహిళలకు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని మంత్రి చెప్పారు. నూజివీడు నియోజకవర్గంలో నారా లోకేష్ విద్యామృతం కొలుసు రెడ్డియ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో 2 వేల మంది విద్యార్థినీ విద్యార్థులకు జనవరి,1వ తేదీ నుండి 10వ తరగతి పరీక్షలు పూర్తి అయ్యేంతవరకు కోచింగ్, సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నామన్నారు. అంతేకాక నియోజకవర్గంలోని మండల స్థాయిలో 10వ తరగతి ఫలితాలలో మొదటి ఐదు స్థానాలు పొందిన వారికి మొదటి స్థానం పొందిన వారికి 25 వేలు, రెండవ స్థానం వారికి 15 వేలు, మూడవ స్థానం పొందిన వారికి 10 వేలు, 4, 5 స్థానాలు పొందిన వారికి 5 వేల రూపాయలు చొప్పున ప్రోత్సాహక బహుమతిగా అందిస్తామని, అంతేకాక ఐఐటీ లో సీటు పొందిన వారికి షెడ్యూల్డ్ కులాలు, తెగల విద్యార్థినీ,విద్యార్థులకు 50 వేలు, వెనుకబడిన తరగతులకు 50 వేలు, ఇతరులకు 25 వేల రూపాయలు చొప్పున ప్రోత్సాహక బహుమతిగా అందిస్తామన్నారు. నూజివీడు పట్టణాన్ని అమృత్-2 నిధుల ద్వారా రోడ్లు, డ్రైనేజి, త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించి స్మార్ట్ సిటీగా రూపొందిస్తామని మంత్రి పార్థసారధి చెప్పారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం

భీమవరం మర్చి 8 ప్రభాతవార్త : దిరుసుమర్రు రోడ్లో ఆదిత్య డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన తల్లి కి వందనం ప్రత్యేక కార్యక్రమానికి క్యాంపస్ లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల తల్లులను ని ఆహ్వానించి సత్కరించారు. ప్రిన్సిపాల్ కమలాకర్ మాట్లాడుతూ మహిళా సాధికారత, సమాజం లో మహిళల ప్రత్యేకతలను వివరించారు. క్యాంపస్ ప్లేస్మెంట్స్ సాధించిన విద్యార్థుల పేరెంట్స్ కు అభినందనలు తెలిపారు. మహిళా ఉద్యోగులను సత్కరించి ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎం. శ్రీనివాసరావు అభినందించారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ కుమారస్వామి అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## పోలీస్ "ఓపెన్ హౌస్"తో విద్యార్థులకు సమగ్ర అవగాహన

భీమవరం మర్చి 8 ప్రభాతవార్త : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల నేపథ్యంలో, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో ఆదివారం పాఠశాల, కళాశాల విద్యార్థినీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ''ఓపెన్ హౌస్'' కార్యక్రమాన్ని నిర్వహించారు. గొల్లలకోడేరులోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ ప్రదర్శనను జిల్లా ఆర్మ్ రిజర్వ్ డీఎస్పీ ఎం .వి.వి. సత్యనారాయణ ప్రారంభించి మాట్లాడుతూ భావి భారత పౌరులైన విద్యార్థులకు పోలీసు విధి నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణలో వినియోగించే అత్యాధునిక ఆయుధ సంపత్తి రక్షణ సాంకేతికతపై ప్రత్యక్ష అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. డీఎస్పీ గారు మాట్లాడుతూ మహిళలు మరియు విద్యార్థినుల అత్యవసర రక్షణ కోసం రూపొందించిన 'శక్తి యాప్' ప్రాధాన్యతను వివరించారు. ఈ యాప్‌ను ప్రతి మహిళా తన స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఆపద సమయాల్లో



కేవలం ఒక బటన్ నొక్కడం ద్వారా లేదా ఫోన్‌ను వేగంగా ఊపడం ద్వారా తక్షణమే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరుతుందని, తద్వారా నిమిషాల వ్యవధిలోనే పోలీస్ సహాయం అందుతుందని ప్రాక్టికల్‌గా వివరించారు. మహిళా రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ చట్టాలు, వేధింపులకు వ్యతిరేకంగా తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలు మరియు సామాజిక మాధ్యమాలలో పొంచి ఉన్న ముప్పుల గురించి విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ ఓపెన్ హౌస్‌లో భాగంగా పోలీసులు నిత్యం విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ రకాల అత్యాధునిక ఆయుధాలు, కమ్యూనికేషన్ సెట్లు, బాంబ్ డిస్పోజల్ ఎక్విప్‌మెంట్, ఇతర భద్రతా ఉపకరణాలను ప్రదర్శనకు ఉంచారు. వీటితో పాటు, అత్యవసర సమయాల్లో పోలీసు సహాయం పొందేందుకు 112, 100 మరియు సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్ నంబర్ల పనితీరును విద్యార్థులకు వివరించారు. "ఫ్రెండ్లీ పోలీసింగ్"లో భాగంగా విద్యార్థులు ఎప్పుడైనా ధైర్యంగా పోలీసులను ఆశ్రయించవచ్చని భరోసా ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లలో కూడా ఇదే తరహాలో ఓపెన్ హౌస్ నిర్వహించగా, వేల సంఖ్యలో విద్యార్థులు పాల్గొని పోలీసుల పనితీరును ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కె.వి.వి.ఎన్ సత్యనారాయణ , మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అహ్మదున్నీసా, మహిళా ఆర్మ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ (అడ్మిన్) ఇ.ఇందుమతి , ఇతర పోలీసు అధికారులు వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆదర్శం.. అంకితభావం: తడికలపూడి మహిళా పోలీసులకు ఘన సత్కారం

కామవరపుకోట,మార్చి 8(ప్రభాత వార్త): తడికలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్లో పనిచేస్తున్న మహిళా పోలీస్ సిబ్బందిని సబ్ ఇన్స్పెక్టర్ పి. చిన్నారావు ప్రత్యేకంగా అభినందించి, వారిని ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో మహిళా సిబ్బంది ప్రదర్శిస్తున్న చొరవ, అంకితభావం ప్రశంసనీయమని ఈ సందర్భంగా ఎస్సై కొనియాడారు. సమాజ రక్షణలో మహిళా పోలీసుల పాత్ర కీలకమని, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమిస్తూ సేవలు



అందించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంచినీటి చెరువులో పడి యువకుడు మృతి

కాళ్ళ మార్చి8 (ప్రభాతవార్త) : మండల కేంద్రమైన కాళ్ళలో చెరువులో పడి యువకుడు మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం దొడ్డనపూడి గ్రామానికి చెందిన గుండా సురేష్(21) కాళ్ళ హైస్కూల్ వద్ద ఉన్న మంచినీరు చెరువులో పడి మృతి చెందాడన్నారు. సురేష్ చాలా కాలం నుండి మానసికంగా ఇబ్బంది పడుతున్నాడని, తల్లిదండ్రులను కొట్టడం, ఇంట్లో సామాను బద్దలు కొట్టి పాడు చేసేవాడన్నారు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో కాళ్ళ హైస్కూల్ వద్ద మంచినీటి చెరువులో ప్రమాదవశాత్తు పడి మునిగిపోతుండగా అది గమనించిన అక్కడ క్రికెట్ ఆడుతున్న యువకులు కేకలు వేశారన్నారు. ఆ కేకలు విని కొల్లి సాయి రాజేష్ మరికొంతమంది యువకులు మునిగిపోతున్న సురేష్ ని ఒడ్డుకు చేర్చడానికి ప్రయత్నించగా ఊపిరాడక సురేష్ మృతి చెందాడన్నారు. సంఘటన విషయం తెలుసుకున్న సురేష్ తండ్రి గుండా పెద్దిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రావు తెలిపారు.



# తణుకులో ఘనంగా మహిళా దినోత్సవం
## - ఉత్తమ సేవలు అందిస్తున్న మహిళలకు సత్కారం

తణుకు, మార్చి 8 ప్రభాత వార్త : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఆదివారం తణుకులో ఘనంగా జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సహకారంతో నియోజకవర్గస్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు తణుకు ఎస్.కె.ఎస్.డి.మహిళా కళాశాలలో నిర్వహించారు. నియోజకవవర్గ ప్రత్యేక అధికారి జి.సీహెచ్.ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 600 మంది మహిళలు హాజరయ్యారు. తణుకు పట్టణంతోపాటు నియోజకవర్గం నుంచి హాజరైన మహిళా ప్రజాప్రతినిధులు తమ ఉత్తేజ పూరితమైన ప్రసంగాలతో మహిళల హక్కులు మహిళల బాధ్యతలు వారి పురోభివృద్ధి, ఆర్థిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి అనే అంశాలపై మహిళలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా అనేకమంది ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల భద్రతకు వారి అభివృద్ధికి కట్టుబడి ఉందని అనేక రకాలైన సంక్షేమ పథకాలకు మహిళలని ఎంపిక చేయడం ద్వారా వారి యొక్క ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తిస్తుందని చెప్పారు. అంతేకాకుండా మహిళలకు ప్రత్యేకంగా ఉచిత బస్సు, తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేయడం ద్వారా ప్రభుత్వం మహిళలను మరింత బలోపేతం చేస్తుందని తెలియజేశారు. రానున్న రోజుల్లో మహిళలకు పూర్తిగా రాజ్యాధికారం దక్కే విధంగా అందరూ ప్రయత్నించాలని కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని అనేక రంగాలలో ప్రతిభ కనబరిచిన, సామాజిక సేవ చేస్తూ ప్రజలకు సేవ చేస్తున్న ఉత్తమమైన మహిళలను గుర్తించి



పది మంది మహిళలను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ సామాజిక చైతన్యం కలిగిస్తున్న అనేకమంది ఉద్యోగులలో ఉత్తమమైన ఉద్యోగినులను గుర్తించి పది మందిని సన్మానించారు.

## అభివృద్ధి పనులు వేగవంతం కావాలి - మంత్రి రామానాయుడు.



పాలకొల్లు ప్రభాతవార్త : పాలకొల్లు లో కోట్లాది రూపాయలు తో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం కావాలని, జాప్యం జరిగితే సహించేది లేదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. వారం వారం పనుల పరిశీలన కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాలకొల్లులో 27వ వార్డులో క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్, పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం, ఎన్టీఆర్ కళాక్షేత్రం, చంద్రబాబు నాయుడు ఉద్యానవనం, అబ్దుల్ కలాం హెల్త్ పార్క్, హిందూ స్మశాన వాటిక, కొత్త కుళాయి చెరువు గట్టు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పనుల్లో జాప్యం జరిగితే ఎందుకు జరిగిందంటూ అధికారులను నిలదీశారు. ప్రతి పనిలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. పలు పనులకు సూచనలు చేశారు. మంత్రితో మున్సిపల్ కమిషనర్ విజయ్ సారధి,కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు

## మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యం - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం టౌన్ మార్చి8 (ప్రభాత వార్త ): మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీ రంగారావు కూడలిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక స్వేచ్ఛను కలిగించే విధంగా స్వయం ఉపాధి పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చి దిద్దటానికి అనేక చర్యలు చేపట్టిందన్నారు. మహిళలను గౌరవించడం, పూజించటం మన సనాతన ధర్మంలో భాగమని, అర్ధనారీశ్వర తత్వం అదే చెబుతుందని అన్నారు. వందల సంవత్సరాలుగా విదేశీయులైన మొగలులు, బ్రిటిష్ వారి పాలన ఫలితంగా సనాతన ధర్మానికి ఎంతో హాని కలిగిందన్నారు. మహిళలను ఆటబొమ్మలుగా చూసే విదేశీ సంస్కృతి దేశంలో ప్రవేశించిందని చెప్పారు. 1947లో స్వాతంత్ర సాధన అనంతరం మన ధర్మాన్ని కాపాడుకునే అవకాశం కలిగిందన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి తదితర ఎందరో వీర నారీమణులు స్వాతంత్ర పోరాటం చేసి భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. డొక్కా సీతమ్మ వంటి సేవా గుణం కలిగిన ఆదర్శ మహిళలను నేటికీ మనం అనుసరిస్తున్నామన్నారు. ఈ ఆదర్శలతోనే ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ లు మహిళల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. శ్రీ శక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణం, డ్వాక్రా మహిళలకు వివిధ పథకాల ద్వారా రుణాలిచ్చి స్వయం ఉపాధి కల్పించారన్నారు. మహిళల రక్షణకు ఫోన్లలో ప్రత్యేక యాప్ ల ద్వారా ఎక్కడ ఏ నేరం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారన్నారు. ఎక్కడ ఏ మహిళ ఆపదలో ఉన్నా తక్షణమే ఆ ప్రదేశానికి పోలీసులు చేరుకునే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రక్షణ చర్యలు చేపట్టారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని, మహిళా మణులందరూ భాగస్వాములు కావాలని కోరారు. అభివృద్ధి వేగవంతమవుతుందనే ఉద్దేశంతో తాహాశీల్దార్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ తదితర ప్రభుత్వ అధికారులుగా మహిళలను తీసుకువచ్చామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రతి మహిళ అందిపుచ్చుకొని, సాధికారత సాధించి, దేశాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా



పలువురు ప్రభుత్వ మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భవన నిర్మాణ ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి, బిజెపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జి ఈతకోట తాతాజీ, ఎమ్మార్వో రాజరాజేశ్వరి, ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి, స్పెషలాఫీసర్ మల్లికార్జున రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ మంగ బాయ్, భోగి రెడ్డి ఆదిలక్ష్మి , పైడికొండల సింధు, కట్టుబోయిన వెంకటలక్ష్మి, దాసరి కృష్ణవేణి, వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, పాలూరి వెంకటేశ్వరరావు, మద్దాల మణికుమార్, కూటమి నాయకులు మాట్లాడారు. ముందుగా పలువురు చిన్నారులు నిర్వహించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకోవటం విశేషం.

## శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి

మొగల్తూరు మార్చి 8 (ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా 216 నేషనల్ హైవే ఆనుకుని ముత్యాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వెలసి ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పలు జిల్లాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యములు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు ఈ సందర్భంగా ఆలయ ఈవో మోకా అరుణ్ కుమార్ ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు డైరెక్టర్లు గ్రామస్తులు స్థానికులు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యములు కలగకుండా దగ్గరుండి క్యూ లైన్ ఏర్పాటు



చేశారు అనంతరం మహిళా భక్తులకు పసుపు కుంకుమ గాజులు పంపిణీ చేశారు

## శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో చండీ హోమం

మొగల్తూరుమార్చి 8(ప్రభాతవార్త ) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామ పంచాయతీ పరిధిలో వెలసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం నందు జాతర మహోత్సవములు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సతినేని శేషుబాబు ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం గ్రామానికి చెందిన సత్తినేని కనక ముత్యాలు రావు, సూర్య కుమారి దంపతులచే చండీ హోమం ఘనంగా నిర్వహించారు. రాత్రి 8 గంటలకు బాల గణపతి నాట్యమండలి ప్రగాఢ నాగేంద్ర సమర్పించు శ్రీ రత్నములు, రామాంజనేయ యుద్ధం వంటి కార్యక్రమాలు ఆలయ ఆవరణలో నిర్వహించారు. శ్రీ కనకదుర్గ అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు



భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన పర్యవేక్షణ నిర్వహించారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



చింతలపూడి.. ప్రభాత వార్త : ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడిలో ఉమెన్ ఎంపవర్మెంట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. పి శ్రీనివాసరావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి, ఈ రోజు మనం జరుపుకుంటున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళల శక్తి, సామర్థ్యం, సాధనలను స్మరించుకునే గొప్ప రోజు. ఒక కుటుంబం అభివృద్ధి చెందాలంటే మహిళ అభివృద్ధి చెందాలి. ఒక సమాజం ముందుకు వెళ్లాలంటే మహిళలకు సమాన అవకాశాలు కలగాలి. మహిళలు విద్య, విజ్ఞానం, రాజకీయాలు, క్రీడలు, సాంకేతిక రంగాలు ఇలా అన్ని రంగాల్లో తమ ప్రతిభను నిరూపిస్తున్నారు. మన కళాశాలలో కూడా అమ్మాయిలు విద్యలో, క్రీడల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరుస్తూ మంచి భవిష్యత్తు వైపు అడుగులు వేస్తున్నారు. కాబట్టి మనందరం మహిళలను గౌరవిస్తూ, సమానత్వ భావనను పెంపొందిస్తూ, సమాజ అభివృద్ధికి కలిసి పనిచేద్దాం అని వివరించారు.

## లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం.



లింగపాలెం మండలం మార్చ్ 8 ప్రభాతవార్త : ఏలూరు జిల్లా లింగపాలెం మండలం లింగపాలెం మండల ఆఫీసులో ఈరోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఏపిఎం జ్యోతి గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీపీ లింగపాలెం సొసైటీ చైర్మన్ మారంపూడి మల్లికార్జున రావు, లింగపాలెం మండల డిప్యూటీ ఎంపీడీవో సుందరి, ఏపీఎం జ్యోతి వెంకాయమ్మ, ఐసిడిసి సూపర్వైజర్ రాజ్యలక్ష్మి, మండల సమైక్య ప్రెసిడెంట్ అసిలేటి హిమబిందు, డ్వాక్రా సిఏలు, అంగన్వాడి టీచర్స్, మహిళలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వీరిశెట్టిగూడెంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



కామవరపుకోట, మార్చి 8(ప్రభాత వార్త): ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా వీరిశెట్టిగూడెంలో శ్రీ సీతా సమేత రామలక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య గ్రామస్తులు ఈ ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రామచంద్రుని జీవితం ఆదర్శప్రాయమని, ఆయన అడుగుజాడల్లో నడవడం సమాజానికి శ్రేయస్కరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు నెక్కలపూడి మల్లికార్జునరావు, బొప్పన వీర శేఖర రావుతో పాటు పరిసర గ్రామాల భక్తులు భారీగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ఘనంగా మహిళా దినోత్సవం



చాట్రాయి, మార్చి 8, ప్రభాతవార్త : అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని చాట్రాయి మండల విద్యాశాఖ మరియు మాసగిరి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలో ఉన్న అన్ని పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సుమారు 90 మందిని ఘనంగా సన్మానించారు. మండల విద్యాశాఖ అధికారి 1 మాసగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న మాసగిరి ఎడ్యుకేషనల్ ట్రస్టు ద్వారా మరియు మండల విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించారు. ముందుగా మహిళా టీచర్స్ కు వివిధ రకాల ఆటలు నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు లక్ష్మణరావు ప్రసంగిస్తూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మహిళా ఉపాధ్యాయులు అందరికి శుభాకాంక్షలు తెలియ చేస్తున్నట్టు చెప్పారు. ఎంఈఓ 2 వి ఎస్ వి బ్రహ్మాచారి మాట్లాడుతూ మహిళలు 50శాతం పైనే రిజర్వేషన్లకు కృషి చేయాలని అన్నారు. ఎంఈఓ 1 మాసగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు లేకుంటే మనుగడ లేదని బాల్యవాహాలు వల్ల అనేక అనర్ధాలు వస్తాయని, వరకట్న దాహార్తికి బలైన ఒక యువతి వార్త నాదాన్ని స్వయంగా పాడి వినిపించారు. మహిళలకు సేవ చేయడంలో అమ్మ స్ఫూర్తిగా ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నత పాఠశాలలో హెచ్ఎంలు కృష్ణయ్య, లక్ష్మి, సౌభాగ్యం మరియు మండల ఉపాధ్యాయ నాయకులు, మహిళా ఉపాధ్యాయులు ఎంఆర్సి సిబ్బంది పాల్గొన్నారు.

# దశావతారాల మూర్తియే స్త్రీ మూర్తి



టీ నర్సాపురం మార్చి 8 ప్రభాతవార్త : టీ నర్సాపురం పంచాయతీలోనిప్రకాష్ నగర్ లో బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంను జరపడం జరిగింది. ఈ సందర్భంగాసంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ నాయక్ మాట్లాడుతూ ఆధునిక మహిళ నేల నుండి ఆకాశానికి ఎదిగిందని, అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా మహిళలు రాణిస్తున్నారని అయినప్పటికీ ఇంకా స్త్రీలపై వివక్షత, లైంగిక దాడులు, వరకట్న వేధింపులు, పురుషాధిపత్యాలు కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. ఇందిరాగాంధీ, రుద్రమదేవి ,సావిత్రిబాయి పూలే ,మదర్ తెరిసా, జిజియా భాయి వంటి దీర మహిళలను నేటి స్త్రీలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వాటి నుండి స్త్రీలకు విముక్తి కలిగినరోజే స్త్రీలకు నిజమైన స్వాతంత్ర్యం, సమానత్వం వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కృష్ణవేణి, మల్లీశ్వరిలను సంఘం తరుపున సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూక్యా పోతు రాజు, కుంజా కిరణ్, భరగడం రాముడు మొదలగువారు పాలుగొన్నారు.

## సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించిన వైసీపీ నేతలు



కామవరపుకోట, మార్చి 8(ప్రభాత వార్త):మండలంలోని పాతూరుకు చెందిన ఉప్పలపాటి సత్యనారాయణ ఇటీవల మృతి చెందగా, ఆదివారం ఆయన నివాసంలో పలువురు రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు. కామవరపుకోట ఎంపీపీ మేడవరపు సత్య ఛాయ విజయలక్ష్మి, జడ్పీటీసీ కడిమి రమేష్ సత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పశువైద్య రంగంలో ఆయన అందించిన సేవలను వారు కొనియాడారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కామిరెడ్డి నాని, ఉప సర్పంచ్ మేడూరి రంగబాబు, సొసైటీ మాజీ అధ్యక్షులు సాయిన కనకరాజు తదితరులు సత్యం కుటుంబాన్ని పరామర్శించారు. సత్యం కుమారుడు బాపిరాజు, మనవడు ఆరుమళ్ల ధర్మలను కలిసి తమ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సాయిన ప్రభాకర్‌రావు, తట్టిగోడల శ్రీనివాసరావు, వార్డు సభ్యులు సాయిన అంజనాదేవి, ఉమాదేవి పాల్గొన్నారు.

## మహిళా లోకానికి వందనం: ఘనంగా సన్మాన కార్యక్రమాలు



కామవరపుకోట,మార్చి 8(ప్రభాత వార్త): మండల కేంద్రంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నవ యామిని పాల్గొని సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి 2026 పిలుపునిచ్చిన “గివ్ టు గెయిన్” నినాదంతో మహిళా సాధికారత సాధించాలని, రక్షణ పట్ల ప్రభుత్వాలు బాధ్యత వహించాలని కోరారు. అనంతరం వివిధ రంగాల మహిళా ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కన్వీనర్ టీవీఎన్ రాజు, పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఇన్ ఛార్జ్ ప్రిన్సిపాల్ ఎం. మల్లేశ్వరరావు నేతృత్వంలో మహిళా సిబ్బందిని సత్కరించి, మెహందీ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి. శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కోడి పందాలు నిర్వహిస్తున్న ఐదుగురు అరెస్టు

అత్తిలి,మార్చి 8 (ప్రభాతవార్త) అత్తిలి మండలం లక్ష్మీ నారాయణ పురం శివారు పొలాల్లో కోడిపందాలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు అత్తిలి ఎస్ఐ పి. ప్రేమరాజు తెలిపారు. పొలిమేర సురేష్, పెంటకోటి శ్రీనివాసరావు, శరకడం శ్రీను, దాడి కిషోర్, రంబాల పవన్ కోడిపందాలు ఆడుతుండగా సిబ్బందితో దాడి చేసి ఒక కోడి, మూడు కత్తులు, 4,580 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# చాట్రాయి మండలం లో కొలువు తీరిన సమస్య - మంత్రిగారు దృష్టిపెట్టండి



ప్రభాతవార్త చాట్రాయి: వెనుకబడిన చాట్రాయి మండలంలో అనేక సమస్యలు ఉండగా ప్రజల గోడు పట్టించుకోవటం లేదని పలువురు అంటున్నారు. మెట్ట ప్రాంతమైన చాట్రాయి మండలంలో అనేక సమస్యలు కొలువుతీరి ఉన్నాయి. ముఖ్యంగా చింతలపూడి ఎత్తిపోతల పథకం పేజ్2 పనులను నిలిపివేయటం వల్ల మెట్ట ప్రాంత రైతాంగానికి తీరని లోటు జరిగిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది ఎకరాలకు నీరు అందే విధంగా నాడు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రూపొందిస్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎక్కడ పనులు అక్కడే చతికిల పడ్డాయి. సాగునీటిని అందించే పథకాలను నిర్వీర్యం చేయటంపై ఈ ప్రాంత రైతాంగం వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేసి రైతు వ్యతిరేక ప్రభుత్వంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలన కొనసాగిందని రైతాంగానికి ఎటువంటి మేలు చేయకుండా కాలక్షేపం చేశారని కోపంతో ఆ ప్రభుత్వంపై కక్షతో తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి 20 మాసాలు పూర్తి అవుతున్నా ఎప్పటికప్పుడు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని చెప్పడమే తప్ప అధికారులు వచ్చిన దాఖలాలు లేవు. ఇదిఇలా ఉండగా మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం మండల కేంద్రానికి వందలాదిమంది ప్రజలు వస్తూ ఉంటారు. బస్టాండ్ లేకపోవడంతో నిలువు కాళ్ళ మీద నడిరోడ్డు మీద నిలబడి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని గత 20 సంవత్సరాల నుండి మండల ప్రజలు కోరుతున్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యారనే పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాడు స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ప్రతి మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో తాహసిల్దార్ కార్యాలయం వద్ద స్థలం కూడా చేయడం జరిగింది. ఫైర్ స్టేషన్ నిర్మాణం చేయాలని నాడు నూజివీడు శాసనసభ్యులుగా ఉన్న డాక్టర్ చిన్నం రామకోటయ్య ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞాపనలు చేశారు. కానీ నాటి నుండి నేటి వరకు ఆ సమస్య పరిష్కారం కాలేదు. మండలంలో అన్ని గ్రామాల్లో డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉండటంతో మురుగునీరు నిల్వ ఉండి దోమలు అధికమై ప్రజలు జ్వరాలు బారిన పడుతున్నారు. ఈ విధంగా చాట్రాయి మండలంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలుగా సునీత



అత్తిలి మార్చి 8( ప్రభాత వార్త )అత్తిలి మండలం భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా మండల అధ్యక్షులుగా సనమంద్ర సునీత ఎన్నికయ్యారు. అత్తిలి లైన్స్ క్లబ్ లో నిర్వహించిన అభినందన సభ కు ముఖ్యఅతిథి గా పశ్చిమగోదావరి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి పాల్గొన్నారు. పార్టీని బలోపేతం చేయడం కోసం మహిళా మోర్చా అధ్యక్షురాలు సునీత కృషి చేయాలని కోరారు. పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని కోరారు. మండల బీజేపీ అధ్యక్షుడు మామిడి శెట్టి నాగబాబు, మాజీ అధ్యక్షుడు బాల మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట త్రిమూర్తులు, స్టేట్ కౌన్సిలర్ కొత్తపల్లి రామరాజు, ప్రధాన కార్యదర్శి అయ్యప్ప, బండి సోమేంద్ర, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నేడే ఉమర్ ఆలీషా పీఠం చే ఉచిత వైద్య శిబిరం

అత్తిలి, మార్చి 8 (ప్రభాతవార్త) తాడేపల్లిగూడెం ఏఎస్ఆర్ హోమియోపతిక్ మెడికల్ కళాశాల,పిఠాపురం ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ సంయుక్తంగా అత్తిలిలో మహిళా ఆరోగ్య చైతన్య సదస్సు, ఉచిత హోమియో వైద్య శిబిరం సోమవారం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అత్తిలి విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆశ్రమంలో శిబిరాన్ని ఉదయం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో రక్త పరీక్షలు కూడా చేస్తారని తెలిపారు. అత్తిలి పరిసర ప్రాంతాల వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రహ్లాద, వెంకటేశ్వర, హనుమాన్ విగ్రహాల ప్రతిష్ట



అత్తిలి,మార్చి 8 (ప్రభాతవార్త )అత్తిలి మండలం గుమ్మంపాడు లోగల సుబ్రహ్మణ్యేశ్వర గో మహాలక్ష్మి సమేత నారికేళ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ముంగిట నూతనంగా ప్రహ్లాదుడు, వెంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్టించారు. ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశద్వారాన్ని ముందుకు మార్చడం ద్వారా రోడ్డు భాగంలో ప్రహరీ గోడను నిర్మించి రోడ్డు వైపున 3 విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పులవర్తి గిరిజ తెలిపారు.

## మేము సైతం మిత్ర బృందం సామాజిక సేవ స్ఫూర్తిదాయకం



టీ నర్సాపురం మార్చి 8 ప్రభాతవార్త : మేము సైతం మిత్రబృందంసామాజిక సేవలు స్ఫూర్తిదాయకమని టి .నరసాపురం సర్పంచ్ శ్రీమతి మోదుగు సునంద ప్రసంశించారు. గత నాలుగు సంవత్సరాల క్రితం తీవ్ర అనారోగ్యానికి బ్రెయిన్ స్ట్రోక్ కు గురై చికిత్స పొందుతున్నటీ .నర్సాపురం చినగురవాయిగూడెం గ్రామస్తుడుట్రాక్టర్ డ్రైవర్ మువ్వ వెంకటేశ్వరరావు కుటుంబానికి మేము సైతం మిత్ర బృందం ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం నిత్యవసర వస్తువులు పండ్లు అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ సునంద ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తీవ్ర అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన మువ్వా వెంకటేశ్వరరావు కుటుంబానికి సాధారణ పెన్షన్ పథకం ఆరు వేల రూపాయలకు బదులుగా పదిహేను వేల రూపాయలు హెల్త్ పెన్షన్ వర్తింపచేయాలని ఆమె జిల్లా కలెక్టర్ గారిని కోరారు. ఈ కార్యక్రమంలో మేము సైతం మిత్ర బృందం సభ్యులు కొరివి శేషారావు, పింగుల మధు, మువ్వ వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా సమ్మక్క-సారలమ్మ, అంకాలమ్మ, కనకదుర్గమ్మ విగ్రహాల ప్రతిష్ట



జీలుగుమిల్లి, మార్చి 08, (ప్రభాతవార్త) : మండలంలోని పాతపండువారి గూడెంలో దేవుడమ్మ మూక మామిడి స్వామీజీ (పాల్వంచ) ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ సమ్మక్క--సారలమ్మ, అంకాలమ్మ, కనకదుర్గమ్మ తల్లుల విగ్రహాల ప్రతిష్టతో పాటు దేవాలయ ప్రతిష్ట మహోత్సవాలు గత మూడు రోజులుగా ఘనంగా నిర్వహించారు. గిరిజన అర్చక పండితుల ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు, హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామోత్సవాలు ధార్మిక చైతన్యంతో సాగాయి. గ్రామ సర్పంచ్ సున్నం ఉషారాణి ఆధ్వర్యంలో గిరిజన మహిళలు బోనాలు సమర్పించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ మహోత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి గిరిజనులు విశేషంగా హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా గ్రామంలో అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సున్నం మహేష్, సర్పంచ్ సున్నం ఉషారాణి, ఊక సూర్యచంద్రరావు, కుంజా వెంకటేశ్వరరావు, కోర్స చిరంజీవి, బీజేపీ నాయకులు చాట్రాతి ప్రసాద్, పీవీ సుబ్బారెడ్డి, వేదుల జనర్దనరావు తదితరులు పాల్గొన్నారు. మీకు కావాలంటే ఇదే వార్తను ఇంకా పత్రిక స్టైల్‌లో కొంచెం చిన్నగా లేదా మరింత ఆకర్షణీయంగా కూడా తయారు చేసి ఇవ్వగలను.

# మహిళా సాధికారత వల్లే సంక్షేమం సాధ్యం

## ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్



నరసాపురం ప్రభాతవార్త :అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. మహిళల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని అన్నారు. మహిళలు ప్రతి రంగంలో ముందుకు వచ్చి తమ ప్రతిభను నిరూపిస్తున్నారని కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మహిళల హక్కులు, సమాన అవకాశాలు మరియు భద్రత కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ టిడిపి ఇన్చార్జి పి రామరాజు రాష్ట్ర మత్స్యకార సంస్థ చైర్మన్ కొల్లు పెద్దిరాజు కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ కే పద్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీచర్లను ఘనంగా సత్కరించారు.

# బొండాడలో అన్న సమారాధన

కాళ్ళ మార్చి8( ప్రభాతవార్త) : మండలంలోని బొండాడ గ్రామ దేవతలు పోలేరమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవారి 51 వార్షిక మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం అఖండ అన్న సమారాధన కార్యక్రమం జరిపారు. మందపాటి రామారావు సావిత్రమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు విశ్వేశ్వరరావు, కోటేశ్వరరావు( లేటు) వెంకన్న లు లక్ష రూపాయలు విరాళం, అమృత వైన్ చిక్కాల సత్య జగదీష్ ప్రసాద్ 50,000, మందపాటి గోపాలం 25000, చెరుకువాడ నాగార్జున 25000, బొండాడ బొండాడ పేట గౌడ సంఘం 100 కేజీల మటన్ విరాళాలతో ఈ అన్న సమారాధన నిర్వహించినట్లు నిర్వాహకులు మందపాటి కృష్ణమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు గొర్ల లక్ష్మణస్వామి, గుడిగంటల ఫణీంద్ర, మేక వెంకన్న బాబు, పెద్దిరాజు అరిటాకు సత్యనారాయణ, గుడ్ల సురేంద్ర, సూర్యనారాయణ, టైలర్ శ్రీను, మన్నే సోమేశ్వర రావు, శ్రీను, సేనాపతి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి వేగేశ్న ఆంజనేయరాజు గ్రామ పెద్దలు గ్రామస్తులు దాతలు భక్తులు పాల్గొన్నారు. అమ్మవారు జాతరకు, అన్న సమారాధన కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన భక్తులకు దాతలకు నిర్వాహకులు మందపాటి కృష్ణమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సత్కారం



తణుకు,మార్చి 8 ప్రభాత వార్త) అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తణుకు డిపో మేనేజర్ సుధారాణి ని తణుకు స్వర్ణ లయన్స్ క్లబ్ వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో స్వర్ణ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ బూరుగుపల్లి వెంకట్రావు, లయన్స్ జోన్ చైర్ పర్సన్ కే ఎన్ పద్మావతి, మాజీ అధ్యక్షులు బురుగుపల్లి లలితకుమారి డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

## డి ఎన్ ఆర్ కాలేజీ లో ఘనంగా మహిళా దినోత్సవవేడుకలు




భీమవరం మార్చి 8 ప్రభాతవార్త : డి ఎన్ ఆర్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం డా.డి.విజయ,గైనకాలజిస్ట్, భీమవరం హాస్పటల్ వారి అధ్యక్షతన కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలోఆదివారం ఘనంగాజరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్ ఆధ్వర్యంలోజరిగిన కార్యక్రమం లో కళాశాల అసోసియేషన్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) మాట్లాడుతు మహిళలు సమాజానికి బలమైన ఆధారమని, విద్య, ఉపాధి, సామాజిక రంగాలలో మహిళలు సాధించిన విజయాలు దేశ అభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. మహిళలు స్వయం విశ్వాసంతో ముందుకు సాగి అన్ని రంగాల్లో నాయకత్వం వహించాలని సూచించారు. “మహిళల అభివృద్ధియే దేశాభివృద్ధి. ప్రతి విద్యార్థిని ఉన్నత ఆశయాలతో చదివి సమాజంలో గౌరవప్రదమైన స్థానాన్ని పొందాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేషన్ ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు మాట్లాడుతూ, మహిళా సాధికారత కోసం ప్రభుత్వం సమాజం తీసుకుంటున్న చర్యలను వివరించారు. మహిళలపై వివక్షను నిర్మూలించి సమాన అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని” పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం ముఖ్య అతిది డా.డి.విజయ,గైనకాలజిస్ట్, భీమవరం హాస్పటల్ వారిని ఘనంగా సన్మానించటం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డా.బి.జ్యోతి, డా.కె.ఉషారాణి, కళాశాల మహిళా సాధికారత విభాగం సభ్యులు మరియు విద్యార్దినులు పాల్గొన్నారు.

## దేశం కీర్తి పతాకలో మహిళల పాత్ర ఎంతో పెరిగింది



నరసాపురం ప్రభాతవార్త : స్థానిక శాఖ గ్రంథాలయంలో జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను స్థానిక రోటరీ క్లబ్ వారు ఏర్పాటు చేశారు. ఈ సభకు గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కేజే ఎస్ ఎల్ కుమారి అధ్యక్ష త వహించగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఆత్మురి రమ ముఖ్య అతిథిగా పాల్గొని నేటి సమాజం లో మహిళలు ల పాత్ర చాలా ముఖ్యమైనది మరియు విశేషమైనదన్నారు. ఒకప్పుడు మహిళలు ఎక్కువగా ఇంటి పనులకు మాత్రమే పరిమితమయ్యేవారు. కానీ ఇప్పుడు మహిళలు అన్ని రంగాలలో ముందుకు వచ్చి తమ ప్రతిభను చూపుతున్నారు. దేశం కీర్తి పతాకలో విద్యా క్రీడలు రక్షణ రాజకీయాలు తదితర అంశాల్లో మహిళలు తమలైన పాత్రను పోషిస్తూ విశ్వశిఖరంపై దేశ కీర్తి పతాకకు కలిగితురాయిగా నిలుస్తున్నారన్నారు. రోటరీ క్లబ్ వారు మహిళలకు రోటరీ క్లబ్ఆధ్వర్యంలో .... కొన్నిపోటీలను నిర్వహించారు. “నేటి సమాజంలో మహిళల పాత్ర”.. డిబేట్, మ్యూజికల్ చైర్స్ గేమ్, లక్కీ డీప్... పోటీలను నిర్వహించి బహుమతులు ఇచ్చారు . ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ట్రెజరర్ సమత,లైన్స్ క్లబ్ సెక్రటరీ భరణి, వనిత క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ఉషారాణి, లైన్స్ క్ల బ్ మణికర్ణిక, డాక్టర్ అమ్మాజీ ,సలాది రామారావు, భట్టి ప్రోలుసత్యనారాయణ సూరిబాబు సూర్యం బాబు, ప్రవీణ్ , పవన్,దిలీప్, జ్యోతి,గీతావాణి తదితరులు పాల్గొన్నారు. అని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కేజే ఎస్ ఎల్ కుమారి తెలిపారు.